అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
గురువారం 8-2-2018
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 4 సంచిక : 41
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal
12 + 16 పేజీలు వెల : 5.00



రాఫెల్ డీల్ వెనుక!

వివరాలు గోప్యంగా ఉంచుతామంటే కుదరదు : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : 'రాఫెల్ యుద్ధ విమానాల' కొనుగోలు ఒప్పందంపై పార్లమెంట్‌లో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చిన తీరు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఒప్పందం వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది. సీపీఐ(ఎం) బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి...తొలుత కాంగ్రెస్ హయాంలో ఈ ఒప్పందం ఫ్రాన్స్ ప్రభుత్వంతో కుదిరింది. ఆ తర్వాత కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏఅధికారంలోకి వచ్చింది. ఈనేపథ్యంలో విమానాల కొనుగోలుకు సంబంధించి చెల్లిస్తున్న మొత్తాల్లో చాలా తేడా కనపడుతోంది. మొదటి ఒప్పందంలో పేర్కొన్న ధరకు మించి రాఫెల్ విమానాలకు చెల్లిస్తున్నారన్న ఆరోపణలకు మోడీ సర్కార్ సమాధానమివ్వాలి. ఈ అంశాన్ని ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్‌లో లేవనెత్తితే, విమానాల



కొనుగోలు ఒప్పందం ఫ్రాన్స్-భారత్ ప్రభుత్వాల అంతర్గత ఒప్పందమని, దీనిని గోప్యంగా ఉంచుతున్నామని, బహిర్గతం చేయలేమని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పటం సమర్థనీయం కాదు. ఒప్పందం కోసం చెల్లిస్తున్న ...9లో

పెట్రోల్‌పై ఎక్సైజ్‌డ్యూటీ ఎత్తేయండి... 2లో





మాట్లాడుతున్న బివి రాఘవులు

పోరుబాటలో...
కమ్యూనిస్టులు..
దోపిడీ, అణచివేత, ఆధిపత్యాన్ని ఎదుర్కొందాం..

- సామాజిక న్యాయం కోసం ఉద్యమించటం గొప్ప అవకాశం
- హిందూత్వ మతోన్మాదంపై పోరు
- సరళీకృత విధానాలపై ఉద్యమాలు కొనసాగాల్సిందే
- దేశాన్ని ముక్కలు చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుయుక్తులు
- ఐక్యత, క్రమశిక్షణ, పోరాటం ప్రధానం: బివి రాఘవులు

కామ్రేడ్ నర్రా రాఘవరెడ్డినగర్ (నల్లగొండ) నుంచి బి.బసవపున్నయ్య

దోపిడీ, అణచివేత, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడే సత్తా కేవలం కమ్యూనిస్టులకే ఉందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. హిందూత్వ మతోన్మాదం, సరళీకృత ఆర్థిక విధానాలపై పోరాటాలు, ఉద్యమాలు కొనసాగించాల్సిందేనని సూచించారు. పార్టీ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... దేశంలో సామాజిక న్యాయం కోసం ఉద్యమం చేసే గొప్ప అవకాశం పార్టీకి వచ్చిందన్నారు. దేశాన్ని ముక్కలు చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ కుయుక్తులు పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల, మతాల పేర చీలికలు తెచ్చి దేశ ఐక్యమత్యాన్ని దెబ్బతీసే కుట్రలు ఇంకా కొనసాగిస్తున్నాయని తెలియజేశారు. పార్టీ శ్రేణులు ఐక్యత, క్రమశిక్షణ, పోరాటపటిమతో ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు. మతోన్మాద వ్యతిరేక పోరాటంలో సామాజిక న్యాయ ఉద్యమం అగ్రగామిగా ఉందన్నారు. మతం ప్రాతిపదికన హిందువుల్లో ఐక్యత పెంచి మైనార్టీలను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఓట్లు వేయకున్నా మైనార్టీల కోసం ఉద్యమం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

బూర్జువా పార్టీలను ఐక్యం చేయడం ద్వారానో, ఎన్నికల పొత్తుల మూలంగానో, సర్దుబాట్ల ద్వారానో మతోన్మాద బీజేపీని ఓడించడం, బలహీనపరచడం సాధ్యం కాదని ఈ సందర్భంగా రాఘవులు చెప్పారు. మతోన్మాదం బలహీనతలపై దెబ్బకొట్టాలని అభిప్రాయపడ్డారు. దక్షిణాదిలో బీజేపీ చొచ్చుకోలేకపోతున్నదని చెప్పారు. సాంఘిక ఉద్యమాలు ఇప్పటికే ఇక్కడ జరగడం, కుల వివక్ష, కుల తత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చోటుచేసుకుంటుండమే కారణమని అన్నారు.

అంబేద్కర్ గొప్ప హిందువుగా పేర్కొంటూ దళితుల్లో చీలిక తెచ్చే ప్రయత్నం జరుగుతున్నారు. రకరకాల రూపాల్లో రిజర్వేషన్లను మతోన్మాద శక్తులు వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. సరళీకృత పోరాటం ద్వారానే మతోన్మాదాన్ని ఎదుర్కోగలమని ...9లో



బీఎల్ఎఫ్ దేశానికే దిక్సూచి

ప్రజాపోరాటాలను ఉధృతం చేస్తామని వ్యాఖ్య

రైతాంగం, మహిళ, యువజన, విద్యార్థి, చేతివృత్తిదారుల సమస్యలపై పోరాటం: తమ్మినేని

వివరాలు 10లో

పృథ్వీ-2 పరీక్ష సక్సెస్



బాలాసోర్ : పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వీ-2 క్షిపణి ప్రయోగ పరీక్ష విజయవంతమైంది. దీనిని ఒడిషాలోని బాలాసోర్ జిల్లా చాందిపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి బుధవారం 11.35 గంటలకు(మధ్యాహ్నం) ఆర్మీ వ్యూహాత్మక దళం ...9లో

పార్లమెంట్‌లో మోడీ డైలాగులు 9లో

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా
తమ్మినేని వీరభద్రం

రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక...

13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం

60 మందితో రాష్ట్ర కమిటీ

వివరాలు 9లో



సీపీఐ(ఎం) రాష్ట్ర నూతన కమిటీ...





ఇంకా నయం విజయ్ మాల్యా.. ఎవరో మాకు తెల్వదు అనలేదు..!!

సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణాగా తీర్చిదిద్దుతామని సీఎం కేసీఆర్ ప్రకటించిన అడ్డా ఆర్మూర్.. నేడు విత్తన వ్యాపారుల గుప్పిట్లో చిక్కుకుంది. ఆధునిక సాగులో రాణించే రైతాంగమూ సిండికేటుగాళ్ల దెబ్బకు విలావిల్లాడుతోంది. ఉత్తర భారతం, విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉండటంతో అయినకాడికి కొనుగోలు చేసి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. పంట ధరను ప్రతిరోజూ తగ్గిస్తూ క్వింటా రూ.1800కు దిగజార్చారు. దీంతో కనీసం పెట్టుబడులు రాకపోగా అన్నదాతకు ఎకరాకు రూ.12 వేలకుపైగా నష్టం వాటిల్లుతోంది.

కల్లాల్లోనే కన్నీళ్లు



ఎర్రజొన్న చేను...

ఎర్రజొన్నల కొనుగోళ్లలో దళారుల దోబూచులాట

- ధర తెగ్గోస్తున్న సిండికేటుగాళ్లు
- క్వింటా రూ.1800
- ఎకరా పెట్టుబడిపై రూ.12 వేలకు పైగా నష్టం

నవతెలంగాణ- నిజామాబాద్ ప్రతినిధి

దేశం మొత్తంలో తెలంగాణ రాష్ట్రంలో అందులో నిజామాబాద్ జిల్లాలోని వ్యవసాయ భూములు ఎర్రజొన్న విత్తనాలు పండించడానికి అనువుగా ఉన్నాయి. ఆర్మూర్ ప్రాంతంలోనే రైతులు 45వేల ఎకరాల్లో పైగా ఎర్రజొన్న పండిస్తున్నారు. దేశంలోనే 85 శాతం ఎర్రజొన్న విత్తనాల ఉత్పత్తి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అవుతోంది. మిగతా 15శాతం కర్ణాటకలోని బళ్లారి ప్రాంతంలో సాగవుతోంది. ఎర్రజొన్నలకు ఉత్తర భారత దేశంతో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అక్కడికి చేరేసరికి క్వింటా ఎర్రజొన్నలు సుమారు రూ.12 వేలు అవుతోంది. అదే పండించిన రైతుకు క్వింటాకు కనీసం రూ.2వేలు కూడా దక్కని పరిస్థితి.

సిండికేటుగాళ్ల వెన్నుపోటు..!

ఆర్మూర్ ప్రాంతంలోని అంకాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు ...9లో

సవాల్ నా వరకే..

- నా కుటుంబానికి సంబంధం లేదు
- రాహుల్‌గాంధీ ఓ పెద్ద దద్దమ్మ...
- 'బాహుబలి' కలెక్షన్లంతా కేంద్రం ఇవ్వలేదు
- కోదండరామ్ పార్టీని స్వాగతిస్తున్నాం : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోతే తాను రాజకీయ సన్యాసం చేస్తానని, ఆ సవాల్ నా వరకేనని, దానికి నా కుటుంబానికి ఎటువంటి సంబంధం లేదని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె తారకరామారావు స్పష్టం చేశారు. ఉత్తమ్ స్ట్రాంగ్ లీడరే అయితే...నా సవాల్‌ను స్వీకరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నేతలు తన కుటుంబంపై "చీప్ ట్రిక్స్" ప్లే చేస్తున్నారని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సవాల్‌పై హుందాగా స్వీకరించలేదన్నారు. కాంగ్రెస్ ఓడితే తాను, తన భార్య కూడా రాజకీయ సన్యాసం ...9లో

మా హామీలు ఒట్టిమాటలు కాదు..

జనామోద
మ్యానిఫెస్టోతో ప్రజల్లోకి లెఫ్ట్

- త్రిపురలో ఎన్నికలవేడి



నవతెలంగాణ - జనరల్ డెస్క్

త్రిపుర... దేశవ్యాప్తంగా అందరి దృష్టి ఇప్పుడు ఆ చిన్న రాష్ట్రంపైనే ఉంది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అధికార లెఫ్ట్ ఫ్రంట్ ఎన్నికల మ్యానిఫెస్టోను ఇటీవల విడుదల చేసింది. 25 ఏండ్లుగా ఈ రాష్ట్రంలో వరుసగా అధికారంలో ఉన్న లెఫ్ట్ ఫ్రంట్ తన మ్యానిఫెస్టోలో అనేక కీలక అంశాలను పేర్కొంది. వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను అదుపుచేయడం నుంచి వ్యవసాయ ఆధునీకరణ, పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధి కల్పించడం వరకూ, అక్షరాస్యత పెంచడం, డ్రాపవుట్లను తగ్గించడం నుంచి ఆరోగ్య సేవలను విస్తృతపర్చడం వరకు, వివిధ జాతుల మధ్య సామరస్యాన్ని పెంపొందించడం మొదలుకుని పేద, గిరిజన, దళితులు, మైనార్టీల అవసరాలపై దృష్టిసారించడం వరకు అనేక అంశాలను వామపక్ష కూటమి తన మ్యానిఫెస్టోలో ప్రస్తావించింది. తన పనిలో, బహుళ వర్గాల మద్దతును కూడగట్టుకుంటూ ఎంతో విశ్వాసంతో బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమికి భిన్నమైనదిగా వామపక్ష కూటమి ముందుకు సాగుతున్నది.

మ్యానిఫెస్టో లేకుండానే బీజేపీ...

ఈ నెల 18న జరిగే ఎన్నికలకు గాను ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల మ్యానిఫెస్టోను ముందే ప్రకటించి.. ముమ్మర ప్రచారంతో లెఫ్ట్ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి. మ్యానిఫెస్టో లేకుండానే ఎన్నికలకు వెళ్లడం బీజేపీ విలక్షణమైన ఎన్నికల ఎత్తుగడ. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లోనూ బీజేపీ తొలి విడతకు ఒక రోజు ముందు మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇతర అనేక రాష్ట్రాల్లో అసలు మ్యానిఫెస్టోనే విడుదల చేయలేదు. ఎన్నికలంటే అమిత్‌షా దృష్టిలో.. సగం నిజాలు, అలవికాని వాగ్దానాలు, ధన బలం, తెరచాటున ఒప్పందాలు చేసుకునే డర్టీ ట్రిక్స్, లంచాలు, అవకాశవాద పొత్తులున్నాయని లెఫ్ట్ నాయకులు ఆరోపిస్తున్నారు.

త్రిపురలో ప్రత్యేకంగా మ్యానిఫెస్టోను తీసుకురావడంలో కూడా బీజేపీ క్లిష్టమైన సమస్యను ఎదుర్కొంటున్నది. ప్రత్యేక గిరిజన రాష్ట్రం కావాలన్న డిమాండ్‌తో వేర్పాటువాద ఉద్యమాన్ని నడుపుతున్న ఐపీఎఫ్‌టీతో పొత్తు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఎన్నికల ప్రయోజనాల కోసం పెట్టుకున్న ఈ పొత్తుతో బీజేపీ ఇబ్బందికరమైన సమస్యను ఎదుర్కొంటున్నది. ఎందుకంటే.. మ్యానిఫెస్టో ప్రకటించాలంటే ఐపీఎఫ్‌టీ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కు మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి.

'కాబట్టి త్రిపుర ప్రజలకు మీరు ఏం చెబుతారు? ఐపీఎఫ్‌టీ డిమాండ్‌కు మద్దతు తెలిపితే.. మీరు ఐక్య త్రిపురకు, వివిధ జాతుల మధ్య సామరస్యతతో ఉన్నవారి నుంచి మద్దతు కోల్పోతారు. త్రిపుర ఓటర్లలో వారిదే మెజార్టీ. మీరు త్రిపురను చీల్చేందుకు మద్దతు ప్రకటించకపోతే.., మరి ఐపీఎఫ్‌టీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నారు? ఆ గిరిజనులను మీరు ఏం చేస్తారు?' అని స్థానిక బీజేపీ నేతలు సైతం ప్రశ్నిస్తున్నారు. అందువల్ల మ్యానిఫెస్టో లేకుండానే ఆ పార్టీ ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది.

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా నేతృత్వంలోని బీజేపీ-ఐపీఎఫ్‌టీ ప్రచార కూటమి చేస్తున్న ఆరోపణలను వామపక్ష కూటమి మ్యానిఫెస్టో తూర్పారబట్టింది. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని నాలుగేండ్ల పాలనలో పెరుగుతున్న నిరుద్యోగిత, ఆకాశాన్నంటుతున్న ధరలు, రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి, భూ సేకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేసింది. మోడీ ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ ప్రజల జీవితాలను ఏ విధంగా ఛిద్రం చేసిందో స్పష్టం చేసింది. 'సామాన్య జనం ప్రయోజనాలపట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నది' అని లెఫ్ట్ మ్యానిఫెస్టోలో ప్రస్తావించింది.

మతపరమైన మూఢవిశ్వాసాల జ్వాలలను రగిలించడం, 'భారతదేశాన్ని మతపరమైన రాజ్యంగా మార్చడం' అనే యుద్ధాన్ని బీజేపీ ప్రకటించింది. ప్రత్యేకంగా దళితులు, మైనార్టీలను 'గోరక్షకులు' లక్ష్యంగా చేసుకున్నారు. పార్లమెంటు, న్యాయవ్యవస్థ వంటి సంస్థలను బీజేపీ బలహీనపరుస్తూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని క్రమంగా క్షీణింపచేస్తున్నదని మ్యానిఫెస్టో విమర్శించింది.

సాధారణ ప్రజలకు అనుకూలంగా.. ప్రత్యామ్నాయ, భిన్న మార్గాలతో రాష్ట్రాన్ని లెఫ్ట్ ఫ్రంట్ ఎలా ముందుకు తీసుకెళ్లనున్నదో స్పష్టం చేసింది.

రాష్ట్రంలో హింసాత్మక వేర్పాటువాదాన్ని నియంత్రించడం, సామరస్యం శాంతిని కాపాడటం ప్రధాన లక్ష్యాలుగా లెఫ్ట్ ఫ్రంట్ దిశానిర్దేశం చేసుకుంది.

సాధించిన విజయాలు, తీసుకున్న లక్ష్యాలతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడుపుతామన్న హామీని ప్రజలకు ఇస్తున్నది. కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విపత్కర విధానాలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపుతూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నది.

సాధించిన విజయాలు

- 1998లో రూ.11,012గా ఉన్న తలసరి ఆదాయం 2015-16కు రూ.80,027కు పెరిగింది.
- త్రిపురలో 97.22% అక్షరాస్యతా రేటుతో దేశంలో ప్రథమ స్థానంలో ఉంది. 1998లో ఇది 73.20%.
- మహిళల అక్షరాస్యతలో కూడా 96.89%తో అగ్ర స్థానంలో ఉంది. పాఠశాలల్లో డ్రాప్-అవుట్ రేటు 1998లో 51% నుంచి 2017లో 4%కు తగ్గింది.
- శిశు మరణాలు, ఇతర పలు ఆరోగ్య సూచీల్లో దేశ సగటుకన్నా త్రిపుర మెరుగైన స్థానంలో ఉంది.
- 1998 నుంచి వరి ఉత్పత్తిలో 53% పెరుగుదల, కూరగాయల ఉత్పత్తిలో 500%, పండ్ల ఉత్పత్తిలో 56%, చేపల ఉత్పత్తిలో 400%, పాల ఉత్పత్తిలో 112%, మాంసంలో 500%, గుడ్ల ఉత్పత్తిలో 100% పైగా ఉన్నాయి.
- విద్యుత్ ఉత్పత్తి రెట్టింపు అయ్యింది.
- ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు కిలో రూ. 2కు బియ్యం, రేషన్‌కార్డుపై నూనె, పప్పు ధాన్యాలు కొనుగోలు చేస్తే ఒక్కో కార్డుకు రూ. 65 సబ్సిడీ ఇస్తున్నది.
- 4 లక్షల మందికి పెన్షన్లు లభిస్తున్నాయి.
- 1998లో 703గా ఉన్న పరిశ్రమలు 2017 నాటికి 4870కి పెరిగాయి.
- 1.27 లక్షల గిరిజనులకు భూమి హక్కులు కల్పించింది.
- 2.12 లక్షల భూమిలేని కుటుంబాలకు 2.32 లక్షల ఎకరాల భూమిని పంచింది.
- 3.49 లక్షల గృహాలను నిర్మించింది.

పెట్రోల్‌పై ఎక్సైజ్‌డ్యూటీ ఎత్తేయండి...

- రాజ్యసభ జీరోఅవర్‌లో సీపీఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్ విమర్శ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశంలో నానాటికీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించాలని సీపీఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్ డిమాండ్ చేశారు. చాలా నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.80 దాటిందని, ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీని విరమించుకోవాలని కోరారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ కేంద్రంలోని మోడీ సర్కారు ఆ ప్రయోజనాలను వినియోగదారుడికి చేరనీయకుండా అడ్డుకుంటోందని ఆక్షేపించారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల అంశాన్ని రాజ్యసభ జీరో అవర్‌లో కేకే రాగేష్ బుధవారం లేవనెత్తారు. 'ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ. 8 తగ్గిస్తున్నట్టు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. కానీ అది వినియోగదారులకు చేరకుండా రోడ్డు సెస్ రూ.8 విధించారు' అని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణను ఎత్తివేస్తూ యూపీఏ సర్కారు నిర్ణయం తీసుకుందని, సీపీఐ(ఎం)గా ఆ నిర్ణయాన్ని అప్పుడే వ్యతిరేకించామని గుర్తు చేశారు. అయితే నియంత్రణ ఎత్తివేసే సమయంలో అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో పెరుగుదలతో పాటు తగ్గుదల కూడా ఉంటుందని అప్పటి యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. కానీ గడిచిన నాలుగేండ్లలో అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడు పెట్రోల్ ధరలు పెరుగుతున్నాయని, కానీ ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనం వినియోగదారులకు చేరడం లేదని వివరించారు. '2014 సంవత్సరంలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 110 యూఎస్ డాలర్లు ఉండగా.. ప్రస్తుతం అది 70 యూఎస్ డాలర్లకు తగ్గింది. ఒకానొక సమయంలో బ్యారెల్ ముడిచమురు ధర 30 యూఎస్ డాలర్లకు కూడా పతనమైంది. కానీ ఆ ప్రయోజనాలను వినియోగదారులకు చేరనీయలేదు' అని మోడీ సర్కారును విమర్శించారు. పైగా పెట్రోల్‌పై 2014 సంవత్సరంలో రూ.లక్ష కోట్లు, 2016-17లో రూ.2.67 లక్షల కోట్లు, ఈ ఏడాది రూ.మూడు లక్షల కోట్ల ఎక్సైజ్ డ్యూటీని విధించారని వివరించారు. పైగా డీజిల్ పై రూ.92 వేల కోట్ల సబ్సిడీని ఎత్తేశారని చెప్పారు. ప్రస్తుతం పెట్రోల్ ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్‌డ్యూటీని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. అలాగే డీజిల్ పై సబ్సిడీ తొలగించగా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని వినియోగదారులకు చేరనీయాలన్నారు.

ముస్లింలు భారత్‌లో ఎందుకుంటున్నారు?

- పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో వెళ్లిపోవాలి : బీజేపీ నేత వినయ్ కటియార్

న్యూఢిల్లీ: బీజేపీ సీనియర్ నేత వినయ్ కటియార్ ముస్లింలపై మరోసారి నోరు పారేసుకున్నారు. ముస్లింలకు భారత్‌లో ఏం పని లేదనీ, వారు పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో పోవాలని అన్నారు. దేశ విభజనకు ముస్లింలే కారణమని నిందించారు. వందేమాతర గీతాన్ని, జాతీయ పతాకాన్ని గౌరవించని వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లింలను పాకిస్తానీయులు అన్న వారిని మూడేండ్లు జైలులో పెట్టాలంటూ ఎంఐఎం నేత ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కటియార్ పై విధంగా స్పందించారు. భారతీయ ముస్లింలను పాకిస్తానీలు అనటం అవమానకరమైన అంశమని ఒవైసీ చెప్పారు.

జస్టిస్ లోయా మృతి కేసు
రాష్ట్రపతి జోక్యం కోసం విపక్షాల సన్నాహాలు

న్యూఢిల్లీ సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ లోయా మృతి విషయంలో చెలరేగుతున్న వివాదంలో రాష్ట్రపతి జోక్యం కోరుతూ ప్రతిపక్షాలు సమష్టిగా వినతి పత్రం సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే ఈ అంశం సుప్రీం కోర్టు విచారణలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా, కాంగ్రెస్ నాయకత్వంలో రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించనున్నారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రంపై ప్రతిపక్ష నాయకులు, ఎంపీలు దాదాపు వంద మందికి పైగా సంతకాలు కూడా చేసినట్టు తెలుస్తోంది. వచ్చే కొద్ది రోజుల్లో ప్రతిపక్ష నాయకుల ప్రతినిధి వర్గం రాష్ట్రపతిని కలిసే అవకాశం ఉంది. లోయా మృతి విషయంలో అనుమానాలు కలుగుతున్నాయని, అందుకు కొత్తగా మరి కొన్ని ఆధారాలు లభించాయని, అందువల్ల ఆయన మరణంపై స్వతంత్ర సంస్థ ఆధ్వర్యంలో సమగ్రమైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఈ వివాదాన్ని సాధ్యమైనంత తొందరగా బుట్టదాఖలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షానికి చెందిన ఒక నాయకుడు అనుమానం వ్యక్తం చేసారు.

అంతర్జాతీయం

ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయోగం

ఫ్లోరిడాలోని స్పేస్‌ఎక్స్ కంపెనీ నుంచి...



వాషింగ్టన్ : ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన ఫాల్కన్ హెవీ రాకెట్‌ను ఫ్లోరిడాలోని స్పేస్‌ఎక్స్ కంపెనీ బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. ఈ రాకెట్‌లో స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలోన్ మస్క్‌కు చెందిన టెస్లా కారు అంతరిక్షంలోకి వెళ్లింది. అంగారకుడి సమీప కక్ష్యలోకి ఇది చేరనుంది. ప్రయోగం విజయవంతం కావడంతో ఫ్లోరిడాలోని కేప్ కనవెరాల్‌లో శాస్త్రవేత్తలు, కంపెనీ ప్రతినిధులు సంబరాల్లో మునిగిపోయారు. అత్యంత శక్తివంతమైన ఫాల్కన్ హెవీ 27 ఇంజిన్లను మండించడంతో ఆకాశంలోకి దూసుకెళ్లింది. కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నాసా అపోల్ మిషన్ ద్వారా 11 మంది సిబ్బందిని చంద్రుడిపైకి పంపించిన ప్రాంతం నుంచే ఈ రాకెట్‌ను ప్రయోగించారు. ప్రయోగ సమయంలో పెద్ద ఎత్తున పొగలు ఎగిసిపడ్డాయి. ఈ చారిత్రక ప్రయోగాన్ని వీక్షించేందుకు వేలాది మంది హాజరయ్యారు. స్పేస్ సెంటర్‌కు 8కిలోమీటర్ల దూరంలోని కొకోవా బీచ్ నుంచి ప్రయోగాన్ని చూశారు. సుమారు 23 అంతస్తుల పొడవైన ఈ జంబో రాకెట్ మాక్ పేలోడ్‌గా కారును తీసుకెళ్లింది. ఫాల్కన్ హెవీ రాకెట్‌ను మూడు ఫాల్కన్ 9 చిన్న రాకెట్లను చేర్చి తయారు చేశారు.

ఫాల్కన్ హెవీ ప్రత్యేకతలు...

- ఫాల్కన్ హెవీ రాకెట్ అట్లాంటిక్ సముద్రం మీదుగా విజయవంతంగా దూసుకు పోయింది. ఈ కొత్త రాకెట్ మొదటిసారి ప్రయోగంలో విజయవంతమయ్యే అవకాశాలు కేవలం 50 శాతమే అని ప్రయోగానికి ముందు మస్క్ అన్నారు. ఈ ప్రయోగంతో ఫాల్కన్ హెవీ ఇప్పటివరకు ఉన్న లాంఛ్ వెహికల్స్‌లో అత్యంత సామర్థ్యం కలిగిన రాకెట్‌గా మారింది. ఈ రాకెట్‌కు అత్యధికంగా 64 టన్నులు అంటే సుమారు ఐదు డబుల్ డెక్కర్ బస్సుల బరువును అంతరిక్షంలోకి మోసుకెళ్లే సామర్థ్యం ఉంది.
- ఇప్పటివరకు అత్యంత శక్తివంతమైన రాకెట్‌గా భావిస్తున్న డెల్టా ఐవీ హెవీ రాకెట్ దీనిలో సగం బరువును మాత్రమే మోసుకెళ్లే సామర్థ్యాన్ని కల్గి ఉంది. అయితే ఖర్చు విషయంలో డెల్టా ఐవీ తో పోలిస్తే ఫాల్కన్ హెవీ రాకెట్‌కు దానిలో మూడో వంతు మాత్రమే ఖర్చు అయిందని మస్క్ తెలిపారు.
- ఈ ప్రయోగం ద్వారా ఎలాన్ మస్క్ తన టెస్లా స్పోర్ట్స్ కారును అంతరిక్షంలోకి పంపారు. ఆ కారులో స్పేస్ సూట్ ధరించిన ఒక డమ్మీని కూర్చోబెట్టారు. ఫాల్కన్ హెవీని స్పేస్ ఎక్స్‌కు చెందిన మూడు ఫాల్కన్ 9 రాకెట్లను ఏకం చేయడం ద్వారా రూపొందించారు. రాకెట్ ప్రయోగం తర్వాత మూడు బూస్టర్ స్టేజీలు భూమిపైకి తిరిగి వచ్చాయి. రెండు బూస్టర్లు కెనడీ స్పేస్ సెంటర్ దక్షిణ తీరాన్ని చేరుకోగా, మూడోది అక్కడికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రంలో కూలిపోయింది.
- ఈ భారీ రాకెట్ ప్రయోగంతో మస్క్, స్పేస్‌ఎక్స్ సంస్థలకు భారీ ప్రయోజనాలు చేకూరే అవకాశముంది. అమెరికా ఇంటలిజెన్స్, మిలటరీలు మరింత భారీ ఉపగ్రహాలను ప్రయోగించే అవకాశం. ప్రపంచవ్యాప్తంగా బ్రాడ్ బ్యాండ్ సేవల విస్తరణ కొరకు అంతరిక్షంలోకి కొన్ని వేల ఉపగ్రహాలను పంపాలని మస్క్ యోచిస్తున్నారు.

ఉల్పర రిజర్వాయర్‌తో ముంపు ఉండదు

- మంత్రి హరీశ్‌రావు స్పష్టీకరణ
- అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ప్రజాప్రతినిధులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్పర రిజర్వాయర్ తో ముంపు ఉండదని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. అతితక్కువ ముంపుతో,రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టులను రీడిజైను చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. బుధవారం జలసౌధలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం లోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉల్పర రిజర్వాయర్ నిర్మాణం వల్ల ముంపునకు గురవుతామనే భయాందోళనలు అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యంపై చెలరేగుతున్న ఊహగానాలను నమ్మవద్దని ఆయన కోరారు. 3 టీఎంసీలు లేదా 1 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ కడుతున్నారనే ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కేవలం .25 టీఎంసీతోనే ఉల్పర రిజర్వాయర్ ను నిర్మిస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ రిజర్వాయర్ పరిధిలో దాసరాజుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందనే ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఈ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురి కాదన్నారు. భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. డిండి చీఫ్ ఇంజనీర్ సునీల్, రెవెన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తారని మంత్రి హామీ ఇచ్చారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీళ్లందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభించనున్నదని మంత్రి అన్నారు. ప్రస్తుతం పంటలు వేసుకొని ఉన్నందున దిగుబడి వచ్చేవరకు కాలువల తవ్వకం జరగదని కూడా హరీశ్‌రావు చెప్పారు.రెండు, మూడు నెలల తర్వాత ఆర్డీఓ ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ప్రజలతో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కాలువల వెడల్పు తగ్గించి, భూసేకరణ తగ్గించాలని రైతులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రత్యామ్నాయాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. సముద్రానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న ఆమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని అచ్చంపేట శాసన సభ్యుడు బాలరాజు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి అచ్చంపేట నియోజకవర్గానికి 50 వేల ఎకరా లకు సాగునీరందుతుందని, ఈ నియోజకవర్గంలో మొత్తం ఒక లక్ష ఎకరాలకు సాగునీరందించేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఈఎన్‌సీ మురళీధర్‌రావు, ,సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

GOVERNMENT OF INDIA
MINISTRY OF FINANCE
DEPARTMENT OF FINANCIAL SERVICES
DEBTS RECOVERY TRIBUNAL-1
3RD FLOOR, TRIVENI COMPLEX,
ABIDS, HYDERABAD-500 001

R.P. No.451/2017 IN O.A. No.498/2011

Vijaya Bank, Basheerbagh Branch, Hyderabad. ....**Certificate Holder**

And

Mr. M. Prabhakar Rao & Others ....**Certificate Debtor**

To

1. Mr. M. Prabhakar Rao, Prop. M/s. Surya Enterprises, Shop No. 124, 1st Floor, Babukhan Estate, Basheerbagh, Hyderabad.
   Also at: R/o. H.No.1-2-607/32/10, Flat No.28, SBH Colony, Behind DBR Mills, Lower Tank Bund, Hyderabad - 38.
   Also at : Prop : M/s. Surya Travels, Shop No.124, 1st Floor, Babukhan Estate, Basheerbagh, Hyderabad. ...**Certificate Debtor No.1**
2. Mr. Faiz Khan, S/o. Ameer Khan, H.No.6-2-967/B-1, Karthik Towers, Khairatabad, Hyderabad ...**Certificate Debtor No.2**
3. Smt. M. Jaisri Prathibha, W/o. Prabhakar Rao, R/o. H.No.1-2-607/32/10, Flat No.28, SBH Colony, Behind DBR Mills, Lower Tank Bund, Hyderabad - 38. ...**Certificate Debtor No.3**
4. Mr. M. Narender, S/o. M. Balram, R/o. H.No.13-1-1237/50/3, Seetharambagh, Hyderabad - 38. ...**Certificate Debtor No.4**

NOTICE OF DEMAND TO DEFENDANT / CERTIFICATE DEBTOR

Take notice that R.P.No.451/2017 in O.A.No.498/2011 has been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal, and Hyderabad for recovery of an amount of Rs.57,02,943/- (Rupees Fifty Seven lakhs two thousand nine hundred and forty three only) plus interest and costs from you. You, the Defendant is hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of "The Recovery Officer, Debts Recovery Tribunal, Hyderabad" within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.

Date 01.02.2018 **(D. ANAND)**
Place Hyderabad **Recovery Officer**

HBL POWER SYSTEMS LIMITED

CIN:L40109TG1986PLC006745

Regd. Off: 8-2-601, Road No.10, Banjara Hills, Hyderabad – 500 034

Standalone Unaudited Financial Results for the Nine months ended 31st December 2017

(Rs. in Lakhs)

S. No.	Particulars	Quarter ending			Nine months ended		For the Year ended
		31-Dec-17 (Unaudited)	30-Sep-17 (Unaudited)	31-Dec-16 (Unaudited)	31-Dec-17 (Unaudited)	31-Dec-16 (Unaudited)	31-Mar-17 (Audited)
1	Total Income from operations	41399.07	44206.73	37913.03	120964.43	108762.01	152986.23
2.	Net Profit/(Loss) for the period (before Tax and Exceptional items)	1831.62	2019.38	1309.32	4949.40	3284.59	5285.98
3.	Net Profit/(Loss) for the period before tax (after Exceptional items)	1659.99	1658.85	1337.80	4367.43	3270.69	5006.95
4.	Net Profit/(Loss) for the period after tax (after Extraordinary items)	877.29	1092.91	958.26	2719.11	2503.03	3561.42
5.	Total Comprehensive Income for the period (Comprising Profit/(Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax))	741.02	956.64	838.85	2310.30	2144.79	3220.38
6.	Equity share capital (Face Value Re 1/- each)	2771.95	2771.95	2530.00	2771.95	2530.00	2771.95
7.	Reserves (excluding Revaluation Reserves as shown in the Balance sheet for previous year)						71168.42
8.	i. Earnings Per Share (before extraordinary items) (of Re 1/- each) (not annualised):						
	a) Basic	0.27	0.35	0.33	0.83	0.85	1.16
	b) Diluted	0.27	0.35	0.33	0.83	0.85	1.16
	ii. Earnings Per Share (after extraordinary items) (of Re 1/- each) (not annualised):						
	a) Basic	0.27	0.35	0.33	0.83	0.85	1.16
	b) Diluted	0.27	0.35	0.33	0.83	0.85	1.16

1. The above financial results were reviewed by the Audit Committee in its meeting held on February 7, 2018 and approved by the Board of Directors at the meeting held on February 7, 2018 and subjected to Limited Review by the Statutory Auditors.
2. Post the applicability of GST with effect from July 1,2017, Sales are required to be disclosed net of GST. Accordingly, the Sales figures for the quarter and nine months ended December 31, 2017 are not comparable with the previous periods presented in the results.
3. Figures of the previous quarters / periods have been regrouped, wherever necessary.

By order of the Board
For HBL Power Systems Ltd.

Place : Hyderabad
Date : 07/02/2018

Dr. A J Prasad
Chairman & Managing Director

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రిటైల్ అసెట్స్ సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్-2, ఇమేజ్ హాస్పిటల్ లేన్, గఫూర్‌నగర్, మాధాపూర్, హైదరాబాద్-500081.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
రూల్ 8(1) మరియు (2) క్రింద
(స్థిరాస్తి కొరకు)

ఏదైతే,

క్రింది సంతకందారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఏసిపిసి-2, హైదరాబాద్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, తేది: **15.11.2017** నాటి డిమాండ్ నోటీసు మరియు **28.11.2017**న పత్రికా ప్రకటన జారీచేసి రుణగ్రహీతను ఆహ్వానించారు

రుణగ్రహీతల పేరు: 1) శ్రీమతి దీప్తి దినేష్‌పాల్ సింగ్ భర్త శ్రీ దినేష్‌పాల్ సింగ్, ఆఫీసు: ఐబిఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 9వ అంతస్తు, నార్త్ టవర్, ఓరియన్ బిల్డింగ్, దివ్యశ్రీ ఎస్ఎన్ఎస్ ఎల్ ట్రేడ్ ప్లేస్, రాయదుర్గం (గ్రా), హైదరాబాద్-32.
2) శ్రీ దినేష్‌పాల్ సింగ్, తండ్రి శ్రీ దేవేంద్ర సింగ్, ఆఫీసు: బిర్లా సైబర్ టవర్, ఫ్లాట్ సం.23, కెజిట్ సైబర్ టవర్, సెక్టార్-1, హైటెక్ సిటీ ఎంక్లేవ్, మాధాపూర్, హైదరాబాద్-81. **1&2 యొక్క నివాస చిరునామా:** అలియన్స్ ఇట్టెట్ బ్లాక్ డి, ఫ్లాట్ సం.401, ప్రశాంత్‌నగర్ మియాపూర్, హైదరాబాద్-500 049.
ఖాతా నం.32124616295

ఆను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా **11.11.2017 నాటికి రూ.18,52,575.00 (రూపాయలు పద్దెనిమిది లక్షల యాభై రెండు వేల ఐదు వందల డెబ్బై ఐదు మాత్రమే) + 12.11.2017 నుండి వడ్డీ+ వ్యయాలుగా** నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు మొత్తంను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **02.02.2018** న స్వాధీనంచేసుకొన్నారు.
రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటలో సమయం అందుబాటులో ఉన్నందున, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
"ఏదైతే, సెక్యూర్డ్ అసెట్స్‌ను లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీచేయుట కొరకు బహిరంగ వేలం లేదా ప్రజల నుండి కొటేషన్లు కోరుట లేదా టెండరు కొరకు నోటీసు ప్రచురణ తేదీకి ముందు ఏ సమయమునైనా అన్ని ఖర్చులు, చార్జీలు మరియు అతనిచే సంభవించిన వ్యయాలుతోపాటు సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క బాకీ మొత్తాలను చెల్లించవలసి ఉంటుంది".
(1) సెక్యూర్డ్ క్రెడిటర్ ద్వారా అమ్మకం యొక్క లీజు అసైన్‌మెంట్ రూపంలో సెక్యూర్డ్ అసెట్స్‌ను బదిలీచేయలేరు. మరియు
(2) ఈ సబ్-సెక్షన్ క్రింద ఆర్థిక మొత్తం చెల్లించుటకు ముందు అసెట్స్ యొక్క లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపంలో బదిలీచేయుట కొరకు సెక్యూర్డ్ క్రెడిటర్ ద్వారా ఏవేని చర్యలు తీసుకొన్న విషయంలో, సెక్యూర్డ్ అసెట్స్ యొక్క లీజు లేదా అమ్మకం యొక్క అసైన్‌మెంట్ రూపంలో బదిలీచేయుట కొరకు ఆర్థిక సెక్యూర్డ్ క్రెడిటర్ ద్వారా ఏ విధమైన తదుపరి చర్యలు తీసుకోబడవు.
ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపవలసిన వారు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్ఏసిపిసి-2, హైదరాబాద్** వారికి **(హైటెక్ సిటీ శాఖ, మాధాపూర్)** యొక్క ఖాతాలో **రూ.18,52,575.00 + వడ్డీ+** దానిపై వ్యయాలుల మొత్తాలను చెల్లించవలసి ఉంటుంది.

స్థిరాస్తి వివరణ

సబ్ రిజిస్ట్రార్, మెదక్ జిల్లా వారి కార్యాలయం వద్ద రిజిస్టరుచేయబడిన పత్రం నం.**9855/2012, తేది: 20.07.2012** ఆధారంగా శ్రీమతి దీప్తి దినేష్‌పాల్ సింగ్, భర్త శ్రీ దినేష్‌పాల్ సింగ్, 2) శ్రీ దినేష్‌పాల్ సింగ్, తండ్రి శ్రీ దేవేందర్ సింగ్‌కు చెందిన మెదక్ జిల్లా, రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్ గ్రామం వద్ద "అలియన్స్ స్కైస్ ఫేజ్-1" వద్దగల 28.90చ.గ.ల విభజించబడని స్థలభాగంతో ఒక కార్ పార్కింగ్ స్పేస్‌తోపాటు 1344చ.అ.ల సూపర్ బిల్టప్ ఏరియా కలిగి 21వ అంతస్తుపై ఫేజ్-10లో ఫ్లాట్ సం.2158 మొత్తం మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్.

తేది: 07.02.2018 అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సిటీ నెట్‌వర్క్స్ లిమిటెడ్ ("సిటీ కేబుల్") యొక్క వినియోగదారులకు తెలియజేయునది ఏమనగా, చానల్స్ (అనగా., సిఎన్‌బిసి టివి18, సిఎన్‌బిసి ఆవాజ్, సిఎన్ఎన్ న్యూస్18, న్యూస్18 ఇండియా, సిఎన్‌బిసి బజార్, సిఎన్‌బిసి టివి18 ప్రైమ్ హెచ్‌డి, న్యూస్ 18 కేరళ, న్యూస్ 18 తమిళనాడు, న్యూస్18 అస్సాం/నార్త్ ఈస్ట్, ది హిస్టరీ చానల్, ఎఫ్‌వైఐ టివి18, హిస్టరీ టివి 18 హెచ్‌డి, న్యూస్18 లోక్‌మత్, కలర్స్, ఎంటివి, రిష్తే, నిక్, విహెచ్1, సోనిక్, కామెడీ సెంట్రల్, నిక్ జూనియర్, కలర్స్ ఇన్ఫినిటీ, ఎంటివి బీట్స్, రిష్తే సినిప్లెక్స్, కలర్స్ సూపర్, కలర్స్ హెచ్‌డి, కలర్స్ ఇన్ఫినిటీ హెచ్‌డి, కామెడీ సెంట్రల్ హెచ్‌డి, విహెచ్1 హెచ్‌డి, నిక్ హెచ్‌డి+, కలర్స్ మరాఠి హెచ్‌డి, కలర్స్ బంగ్లా హెచ్‌డి, కలర్స్ కన్నడ హెచ్‌డి, ఎంటివి బీట్స్ హెచ్‌డి, ఎంటివి హెచ్‌డి+, సినిప్లెక్స్ హెచ్‌డి, కలర్స్ గుజరాతి, కలర్స్ మరాఠి, కలర్స్ బంగ్లా, కలర్స్ కన్నడ, కలర్స్ ఒడియా, ఈటివి ఉత్తర్ ప్రదేశ్ & ఉత్తరాంచల్, ఈటివి ఎంపి ఛత్తీస్‌గఢ్, ఈటివి రాజస్తాన్, ఈటివి ఉర్దూ, ఈటివి బీహార్ జార్ఖండ్, న్యూస్ 18 కన్నడ, ఈటివి న్యూస్ బంగ్లా, ఈటివి న్యూస్ గుజరాతి, న్యూస్ 18 పంజాబ్/హర్యానా/హిమాచల్ ప్రదేశ్, ఎన్‌డిటివి మరియు ఈటివి ఒడియా) యొక్క కొన్ని లేదా అన్ని సిగ్నల్స్ అనునవి దిగువ కారణాలు (1) బకాయిలు చెల్లించనందున, మరియు (2) నెలవారీ సబ్‌స్క్రైబర్ రిపోర్టులు సమకూర్చుటలో విఫలం చెందినందున అను కారణాలలో ఒకటి లేదా అనేక విషయాలపై సిటీ కేబుల్‌కు మూడు వారాల తరువాత ప్రసారాలు నిలిపివేయబడుతాయి. సిటీ కేబుల్ ద్వారా ప్రసారమవుతున్న దిగువ ప్రాంతాలు ప్రభావానికి గురౌతాయి:
(ఎ) డిఎఎస్ ఫేజ్-1: ఢిల్లీ మరియు ముంబయి యొక్క గుర్తించిన ప్రాంతాలు, (బి) డిఎఎస్ ఫేజ్-2: నేవీ ముంబయి, పూణె, నాగ్‌పూర్, వారణాసి, అలహాబాద్, కాన్పూర్, ఆగ్రా, ఫరీదాబాద్, జైపూర్, ఇండోర్, భూపాల్, జబల్‌పూర్, మైసూర్, సూరత్, వడోదర, అహ్మదాబాద్, రాజ్‌కోట్ మరియు బెంగుళూరు, (సి) ఒరిస్సా రాష్ట్రంలోని పట్టణాలు/నగరాల యొక్క మున్సిపల్ పరిధిలో (1) బెర్హంపూర్, (2) జనమలిపూర్, (3) కటక్, (4) జన్ని, (5) మద్యఘరం, (6) ధెంకనల్, (7) కియోంఝర్, (8) నాల్కో టౌన్‌షిప్ (అంగుల్ జిల్లాలో), (9) పూరి, (10) బరంపూర్, (11) రాయగడ్, (12) రూర్కెలా, (13) సంబల్‌పూర్, (14) కటక్‌పూర్, (15) రాయగడ, (16) సర్బంగ్‌పూర్, (17) జాల్స, (18) ధండిఖోల, మరియు (19) భువనేశ్వర్, మరియు (డి) డిఎఎస్ ఫేజ్-3 మరియు డిఎఎస్ ఫేజ్-4 గుర్తించిన ఏరియాలు : (అన్ని డిఎఎస్ ఫేజ్-3 మరియు డిఎఎస్ ఫేజ్-4 గుర్తించిన ఏరియాలు మినహా) ఎక్కడైతే సిటీ కేబుల్ తిరిగి ప్రసారముకు సిగ్నల్స్‌కు అనుమతిలేదో అనగా., పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒరిస్సా, బీహార్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు (పై పాయింట్ 'సి'లో వివరించినట్లుగా అన్ని ప్రాంతాలు మినహా)).

టివి18 బ్రాడ్‌కాస్ట్ లిమిటెడ్ తరఫున ప్రజాహితార్థం జారీచేసినవారు
ఇండియాకాస్ట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్
703, 7వ అంతస్తు, హెచ్‌డిఐఎల్-కాలిడోనియా, విజయ్ నగర్ ఎదురుగా, సహార్ రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి-400 069

PUBLIC NOTICE

Notice is hereby given that the following Sub-broker is no longer affiliated as Sub-broker of **M/s. Kellton Securities (P) Ltd** (earlier called Sripad Securities (P) Limited) [SEBI Reg. No: INB231336133] as a member with National Stock Exchange of India Ltd, having registered office at Plot No. 1367, Road No.45, Jubilee Hills, Hyderabad-500033. We are submitting sub broker for cancellation of his registration detail as :

Sub broker Name : **SURISETTY CHANDRA SEKHAR AZAD**
Trader Name : **SURISETTY CHANDRA SEKHAR AZAD**
SEBI Registration No. : **INS236935016 /23-09379** Registration Date : **11/02/2009**
Regd. Address : Flat no :108, G 16, Seshadri towers, Madhura Nagar, Hyderabad-500038. Telangana.

People are advised not to deal with them under our affiliation. Any person henceforth dealing with the above mentioned sub-brokers should do so at their own risk. Any client or person having any claim against the sub-broker arising out of their transaction in securities may furnish the details of their claim in writing to Compliance within 6 months of the publication of this Notice.

By order of
Krishna Reddy Chintam
Date : 08/1/2018 Director, **M/s Kellton Securities (P) Ltd.**

SOUTHERN ONLINE BIO TECHNOLOGIES LIMITED

SBT

Regd.Office: Flat No. A3, 3rd Floor, Office Block, Samrat Complex, Saifabad, Hyderabad – 500 004
CIN: L72900TG1998PLC030463

NOTICE

Pursuant to Regulations 29(1)(a) and 47(1)(a) of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations 2015, Notice is hereby given that meeting of the Board of Directors of the Company is scheduled to be held on Wednesday, the **14th day of February, 2018,** inter alia to consider and approve the Un-audited Financial Results for the quarter ended 31st December, 2017.

This notice is also available on the website of the Company **www.sol.net.in**, and also on the website of stock exchange **www.bseindia.com.**

By order of the Board
for Southern Online Bio Technologies Limited
Sd/-
K Radha Krishna
Director & CFO

Place: Hyderabad
Date : 07.02.2018

GATI

రిజిస్టర్డ్ & కార్పొరేట్ ఆఫీస్: ప్లాట్ నం.20, సర్వే నం.12, కొత్తగూడ, కొండాపూర్, హైదరాబాద్ - 500 084.
CIN: L63011TG1995PLC020121
W: **www.gati.com** | E: investor.services@gati.com | T: 040 - 71204284 | F: 040 - 23112318

31 డిసెంబర్, 2017తో ముగిసిన త్రైమాసికం & తొమ్మిది నెలల కాలానికి ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలు

రూ.లక్షల్లో

వివరాలు	త్రైమాసిక ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయని	తొమ్మిది నెలల ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయని	త్రైమాసిక ముగింపు 31-12-2016 ఆడిట్‌చేయని
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	44,851	128,117	42,488
కాలవ్యవధిలో నికర లాభం (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	687	6,126	895
కాలవ్యవధిలో పన్ను ముందు నికర లాభం (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	687	6,126	895
పన్ను తరువాత కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	480	4,390	655
కాలవ్యవధిలో పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధిలో సమీకృత లాభం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం(పన్ను తరువాత)	536	4,321	754
ఈక్విటీ షేర్ క్యాపిటల్	2,167	2,167	1,761
వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/-చొప్పున ముఖ విలువ)(వార్షికం కాని)			
ఎ) బేసిక్:	0.29	3.98	0.63
బి) డైల్యూటెడ్:	0.29	3.97	0.47

గమనికలు: 1.పై ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు ఫిబ్రవరి 07, 2018న నిర్వహించబడిన బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
2. స్టాండలోన్ ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం దిగువ విధంగా: రూ.లక్షల్లో

వివరాలు	త్రైమాసిక ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయని	తొమ్మిది నెలల ముగింపు 31-12-2017 ఆడిట్‌చేయని	త్రైమాసిక ముగింపు 31-12-2016 ఆడిట్‌చేయని
ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	11,082	33,478	13,077
పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం(మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	69	5,865	561
పన్ను తరువాత కాలవ్యవధిలో నికర లాభం (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	39	4,739	527
కాలవ్యవధిలో పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధిలో సమీకృత లాభం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం(పన్ను తరువాత)	122	4,755	612

గమనిక: 3) డిసెంబర్ 31, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కొరకు ఫలితాలు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖచే గుర్తించినట్లు ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఇండ్ ఎఎస్)తో సంబంధించినవి. లైక్ టు లైక్ ప్రాతిపదికన ఇండ్ ఎఎస్ ప్రకారం డిసెంబర్ 31, 2016తో ముగిసిన త్రైమాసికం కొరకు ఫలితాలు అనుసరించి, రీస్టేట్ చేయబడినవి. 4) ఎస్‌ఇబిఐ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్& డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీలతో పూరించిన డిసెంబర్ 31, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి స్టాండలోన్& కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల వివరాల ఫార్మెట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నవి. డిసెంబర్ 31, 2017తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకాలానికి స్టాండలోన్& కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మెట్ www.gati.com, www.nseindia.com & www.bseindia.com వద్ద పెట్టుబడిదారుల కొరకు అందుబాటులో ఉంటాయి.

For **Gati Limited**
మహేంద్రా అగర్వాల్
ఫౌండర్& CEO (DIN No.: 00179779)

ప్రదేశం: హైదరాబాద్
తేది: ఫిబ్రవరి, 07, 2018

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయునది ఏమనగా, జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ZEEL) ద్వారా పంపిణీ చేయబడుచున్న దిగువ ఛానల్స్ యొక్క సిగ్నల్స్: జీ టివి, జీ ఈటిసి, & టివి, జీ కేఫ్, జీ మరాఠి, జీ బంగ్లా, జీ సలాం, జీ కన్నడ, జీ తెలుగు, సార్థక్ టివి, జీ కళింగ, లివింగ్ ఫుడ్స్, జీ సినిమా, జీ స్టూడియో, జీ టాకీస్, జీ క్లాసిక్, జీ యాక్షన్, జీ బంగ్లా సినిమా, & పిక్చర్స్, జింగ్, జీ పంజాబ్ హర్యానా హిమాచల్, జీ బిజినెస్, 24 ఘంట, జీ 24 టాస్, జీ మధ్యప్రదేశ్ ఛత్తీస్‌ఘడ్, జీ రాజస్తాన్ న్యూస్, డబ్ల్యుఐఓఎన్, జీ యువ, జీ సినిమాలు, జీ అన్మోల్, జీ తమిళ్, జీ హిందుస్తాన్, జీ బీహార్ జార్ఖండ్, జీ 24 కలాక్, జీ న్యూస్, జీ అన్మోల్ సినిమా, జీ టివి హెచ్‌డి, జీ సినిమా హెచ్‌డి, జీ స్టూడియో హెచ్‌డి, & పిక్చర్స్ హెచ్‌డి, & టివి హెచ్‌డి, జీ కేఫ్ హెచ్‌డి, & ప్రైవ్ హెచ్‌డి, లివింగ్ ఫుడ్జ్ హెచ్‌డి (వీటిని ఇకమీదట "జీ గ్రూప్ ఛానల్స్"గా పేర్కొనబడును) మరియు టర్నర్ ఇంటర్నేషనల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఛానల్స్ కూడా అనగా., కార్టూన్ నెట్‌వర్క్, పోగో, సిఎన్ఎన్ ఇంటర్నేషనల్, హెచ్‌బిఓ మరియు డబ్ల్యుబి (వీటిని ఇకమీదట "టర్నర్ ఛానల్స్"గా పేర్కొనబడును).
జీ గ్రూప్ ఛానల్స్ మరియు టర్నర్ ఛానల్స్ అనునవి దిగువ నెట్‌వర్క్‌లకు సంబంధించి పైన చెప్పిన ఛానల్స్ కొరకు దిగువ పేర్కొన్న కారణాలతో ఈ రోజు నుండి మూడు వారాల తరువాత నిలిపివేయబడును.

(ఎ) 1. ఏరియా ట్రాన్స్‌క్రిప్షన్, 2. సబ్‌స్క్రైబర్ రిపోర్టు సమర్పించనందున, మరియు 3. ఆడిట్ యొక్క సహకారం లేనందున:

కేబుల్ ఆపరేటర్(ల) పేరు	చిరునామా	డియాక్టివ్ చేయబడు ఛానల్స్ యొక్క సిగ్నల్స్	సేవలందుతున్న ప్రాంతాలు
హైదరాబాద్ కేబుల్ డిజిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్	ఇ.నం.5-5-302, ఫ్లాట్ నం.25, ప్రశాంత్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-500074	జీ గ్రూప్ ఛానల్స్ మరియు టర్నర్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో జిహెచ్ఎంసి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా యొక్క సరూర్‌నగర్& ఇబ్రహీంపట్నం

(బి) బకాయిను చెల్లించనందున:

కేబుల్ ఆపరేటర్(ల) పేరు	చిరునామా	డియాక్టివ్ చేయబడు ఛానల్స్ యొక్క సిగ్నల్స్	సేవలందుతున్న ప్రాంతాలు
హైటెక్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్	ఇ.నం.13-93/16 బి, మాధవనగర్, శంకరంపేట్, మెదక్, తెలంగాణ-502271.	జీ గ్రూప్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో శంకరంపేట్, టింకటి, జుకల్, మూసాపేట్ మరియు మెదక్ జిల్లా
శ్రీసాయి కళ్యాన్ తాండూరు కమ్యూనికేషన్	ఇ.నం.7-2-100/1ఎ, రైల్వే గేటు ఎదురుగా, తాండూరు, రంగారెడ్డి, తెలంగాణ-501141.	జీ గ్రూప్ ఛానల్స్ & టర్నర్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా యొక్క బషీరాబాద్ , తాండూరు, యాలల్ (మం).
శ్రీసాయి కమ్యూనికేషన్	ఇ.నం.13-6, పాత అంగడి బజార్, మహాదేవ్‌పూర్, కరీంనగర్, తెలంగాణ-505504.	జీ గ్రూప్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో మహాదేవపురం మండలం యొక్క మహాదేవ్‌పూర్, సిరారం, కాళేశ్వరం, బెల్లార్, అంబటిపల్లి, బొమ్మాపూర్, అన్నారం గ్రామం
ఆరాధ్య ఎంటర్‌ప్రైసెస్	మున్సిపల్ నం.1-1-609/1, పద్మానగర్, రోడ్ నం.1, శ్రీ భారతీ కాంప్లెక్స్, నిజామాబాద్, తెలంగాణ-503001.	జీ గ్రూప్ ఛానల్స్ & టర్నర్ ఛానల్స్	నిజామాబాద్
శ్రీసాయి గణేష్ మీడియా డిజిటల్ నెట్‌వర్క్	ఇ.నం.6-116, జవహర్ నగర్ కాలనీ, భూపాలపల్లి, వరంగల్, తెలంగాణ-506169.	జీ గ్రూప్ ఛానల్స్ & టర్నర్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ మరియు నాగారం జిల్లాల యొక్క జతపరచిన అనుబంధం-8 ప్రకారం మరియు భూపాలపల్లి, మహాదేవపుర, మంథాని, కాటారం
ఏటూరునాగారం డిజిటల్ కేబుల్ టివి నెట్‌వర్క్	ఇ.నం.12-355/1, ఆకులవారి ఘన్‌పూర్, ఏటూరునాగారం, వరంగల్, తెలంగాణ-506165.	జీ గ్రూప్ ఛానల్స్	తెలంగాణ రాష్ట్రంలో ఏటూరునాగారం, రామగుండం, రోహీర్ మరియు వరంగల్ జిల్లా.

ZEE Extraordinary Together

జారీచేసిన వారు:
జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్
ఎస్సెల్ హౌస్, బి-10, లారెన్స్ రోడ్, ఇండస్ట్రియల్ ఏరియా, ఢిల్లీ-110 035

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం, 2002 (ది యాక్ట్) మరియు ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ లోని సెక్షన్ 13 (2) కింద నోటీసు

క్ర. సం.	రుణగ్రహీత(లు) పేరు మరియు చిరునామా(లు) (ఎ)	అప్పు మొత్తం (రూ.) (బి)	తాకట్టు ఆస్తి వివరాలు (సి)	బకాయిపున్న మొత్తం (రూ.) (డి)
1.	1. శ్రీ శశేంద్ర శివాజీ వి 2. శ్రీమతి పరిగంటి జానీ శశేంద్ర వీళ్ళ చిరునామా: హౌస్ నం. 8-7-179/4, ఫ్లాట్ నం. జి2, వివేక్ భండారి రెసిడెన్సీ, రామ్‌లాల్ నగర్, మిలిటరీ డయిరీ ఫామ్ రోడ్డు, ఓల్డ్ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్-500011 తెలంగాణ. వీళ్ళ మరొక చిరునామా: ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-1, 2వ అంతస్తు, వివేకా భండారి రెసిడెన్సీ, హౌస్ నం. 8-7-179/4 మరియు 6, ప్లాట్ నంబర్లు 105, 106 మరియు 107, సర్వే నం. 51, ఓల్డ్ బోయిన్‌పల్లి విలేజ్, కూకట్‌పల్లి మున్సిపాలిటీ, బాలా నగర్ మండలం, ఆర్.ఆర్.జిల్లా, హైదరాబాద్-500005, తెలంగాణ అడ్రస్ నం. 1 వీళ్ళ మరొక చిరునామా: సేల్స్- బిజినెస్ హెడ్ ఛాత్ కాస్మిక్ ట్రావెర్స్ లిమిటెడ్, ప్లాట్ నం. 2, పికెట్ మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ విగ్రహం దగ్గర, సికింద్రాబాద్.	మొత్తం రూ. **17,90,000/-** (పదిహేడు లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే) కోసం రుణ ఖాతా నం. **HHLHYD00117978**	ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-1, 2వ అంతస్తు, వివేకా భండారి రెసిడెన్సీ, హౌస్ నం. 8-7-179/4 మరియు 6, ప్లాట్ నంబర్లు 105, 106 మరియు 107, సర్వే నం. 51, ఓల్డ్ బోయిన్‌పల్లి విలేజ్, కూకట్‌పల్లి మున్సిపాలిటీ, బాలా నగర్ మండలం, ఆర్.ఆర్.జిల్లా, హైదరాబాద్-500005, తెలంగాణ (దీనికి జతచేసిన షెడ్యూలు-ఎలో మరింత వివరంగా వివరించబడింది).	**23.01.2018** నుండి వాస్తవంగా చెల్లింపు చేసే తేదీ వరకు సంవత్సరానికి **@10.40%** చొప్పున భవిష్యత్తు వడ్డీతో పాటు **22.01.2018** నాటికి రూ. **17,05,955/-** (పదిహేడు లక్షల అయిదు వేల తొమ్మిది వందల యాభై అయిదు మాత్రమే)

పైన పేర్లు ఇవ్వబడిన రుణగ్రహీత(లు) రుణ ఖాతాలో ఆర్థిక క్రమశిక్షణను పాటించడంలో విఫలమయ్యారు మరియు కంపెనీ నిర్వహించే మామూలు వ్యాపార నిర్వహణలో తీసిందేముంటే నిర్వహించబడే ఖాతాల పుస్తకాల ప్రకారం, ప్రతి రుణగ్రహీత పేరుకు ఎదురుగా కాలమ్ 'డి' లో బకాయిపున్న మొత్తం ఇవ్వబడింది. రుణగ్రహీత(లు) అప్పు మొత్తాన్ని తిరిగిచెల్లించడంలో పదేపదే విఫలమవుతున్న కారణంగా, రుణగ్రహీత(లు) యొక్క రుణ ఖాతాను నిర్ణీత నిబంధనలకు లోబడి కంపెనీ దీనిని నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది. ప్రతి రుణగ్రహీత(లు)కు చట్టంలోని సెక్షన్ 13 (2) ప్రకారం నోటీసులు కూడా జారీచేయడమైనది.

పై విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుంచి 60 రోజుల లోపల అప్పటి వరకు అయిన వడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో సహా, పైన కాలమ్ డిలో సూచించబడిన చెల్లించవలసిన బకాయిలు మొత్తాన్ని చెల్లించడం ద్వారా కంపెనీ పట్ల ఉన్న అతని/ఆమె బాధ్యతలను పూర్తిగా నెరవేర్చవలసిందిగా పై రుణగ్రహీత(లు)ను కంపెనీ కోరుతుంది, అలా చెల్లించని పక్షంలో, పైన కాలమ్ 'సి'లో తెలియజేసిన తనఖా ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు కంపెనీకి హక్కువుంది మరియు చట్టంలో కంపెనీకి లభించే ఎలాంటి ఇతర చర్యలను కూడా తీసుకుంటుంది.

సర్ఫేసి చట్టం సెక్షన్ 13 లోని ఉప-సెక్షన్ (8) నిబంధనల ప్రకారం, "బహిరంగ వేలం ద్వారా, ప్రజల నుంచి కొటేషన్, టెండర్ పిలవడం ద్వారా లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా సెక్యూర్డ్ ఆస్తి(ల)ను విక్రయించేందుకు నోటీసు ప్రచురితమైన తేదీ వరకు సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా మాత్రమే అయిన వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు అవుట్‌స్టాండింగ్ బకాయిల పూర్తి మొత్తాన్ని రుణగ్రహీత సమర్పించవచ్చు. పైన తెలియజేసిన వ్యవధిలోగా ప్రిస్క్రయిబ్ చేసిన కాల వ్యవధి లోపు సెక్యూర్డ్ ఆస్తిని రిడీమ్ చేసుకోవడంలో రుణగ్రహీత విఫలమైతే, ఆస్తిని రిడీమ్ చేసుకునేందుకు రుణగ్రహీతకు హక్కు లేదని కూడా గమనించాలి."

కంపెనీ నుంచి ముందుగా లిఖితపూర్వక అనుమతి తీసుకుంటే తప్ప తనఖా ఆస్తిని ఏ విధంగానూ అన్యాక్రాంతం చేయకుండా (బదిలీచేయడం, విక్రయించడం, లీజుకు ఇవ్వడం లేదా ఇతరత్రా) లేదా తృతీయ పక్షానికి ప్రమేయం కల్పించకుండా లేదా ఈ ఆస్తితో లావాదేవీలు జరపకుండా నిలువరించడమైనదని రుణగ్రహీత(లు)కు వివరంగా తెలియజేయడమైనది. ఈ విషయంలో ఏమాత్రం ఉల్లంఘన జరిగినా ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా ఉభయ శిక్షలూ అనుభవించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

షెడ్యూలు-ఎ
(సెక్యూరిటీగా ఉంచిన ఆస్తి వివరాలు)

ఓల్డ్ బోయిన్‌పల్లి విలేజ్, కూకట్‌పల్లి మున్సిపాలిటీ, బాలా నగర్ మండలం, ఆర్.ఆర్.జిల్లా, హైదరాబాద్.-500005, తెలంగాణ లోని సర్వే నం. 51, ప్లాట్ నంబర్లు 105, 106 మరియు 107, హౌస్ నం. 8-7-179/4 మరియు 6 చిరునామాలోని 30 చదరపు గజాల (800 చదరపు గజాల్లో) భూమిలోని అవిభక్త వాటాతో 1110 చదరపు అడుగుల కామన్ ఏరియాతో బిల్ట్ అప్ ఏరియాతో ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-1, 2వ అంతస్తు మొత్తం భూమికి హద్దులు

ఉత్తరం : రోడ్డు
దక్షిణం : ప్లాట్ నం. 99 మరియు 100
తూర్పు : రోడ్డు
పశ్చిమం : ప్లాట్ నం. 104

ఫ్లాట్ నం. ఎస్ఎఫ్-1కి హద్దులు

ఉత్తరం : ఓపెన్ టు స్కై
దక్షిణం : కారిడార్
తూర్పు : కారిడార్
పశ్చిమం : కారిడార్

స్థలం: సికింద్రాబాద్ / హైదరాబాద్ (తెలంగాణ)

ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున,
అధీకృత అధికారి

డిమాండ్ నోటీసు

ఏదైతే, **అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్** (తరువాత "ఆర్సిల్"గా తెలిపినది) సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీగా కంపెనీల చట్టం, 1956 క్రింద నెలకొల్పబడినది మరియు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఆక్ట్, 2002 క్రింద రిజర్వు బ్యాంక్ ఇండియాతో నమోదుచేసుకొన్నది (తరువాత "ది ఆక్ట్"గా తెలిపినది) మరియు దిగువ పేర్కొనిన కాలం నం.3లో పేర్కొనినట్లుగా రుణగ్రహీత/ సహరుణగ్రహీతలు బసిబసిల బ్యాంక్ నుండి రుణం పొందినారు మరియు ఏదైతే **ఆర్సిల్**, దిగువ పేర్కొనిన చార్టు యొక్క కాలం నం.2లో పేర్కొనిన రుణఖాతాలకు సంబంధించి ఫైనాన్షియల్ అసెట్స్ పొందియున్నారు. మరియు ఏదేతై ఆర్సిల్, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నియమం 3తో చదువగల సదరు చట్టం యొక్క విభాగము ఎస్.13(2) క్రింద సంక్రమించిన అధికారాలతో చట్టం క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ గావించబడినారు. కాలం నం.3లో పేర్కొనినట్లుగా రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలను నోటీసులో పేర్కొనిన మొత్తం తదుపరి వడ్డీతో సహా ఈ ప్రకటన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా ఆహ్వానిస్తూ డిమాండ్ నోటీసులు జారీచేయడం జరిగినది, కానీ నోటీసులు వివిధ కారణాల ద్వారా మీకు చేరకనే వెనుతిరిగినది.

క్ర. నం.	Lan No.	రుణగ్రహీత పేరు	బాకీపడిన మొత్తం (రూ.లో)	నోటీసు తేది	ఈ తేది నాటికి మొత్తం బాకీ	హామీచూపిన ఆస్తి చిరునామా	బ్యాంకు
1	30007162428	శ్రీ సి.సూర్యశేఖర్ శ్రీ చౌతాకూర్ రాజశేఖర్ Ms.స్నేహాదాదరి	20,19,788.93	30-Dec-17	29-Dec-17	హైదరాబాద్‌లోని జాంబాగ్‌రోడ్‌లోని మున్సిపల్ నెంబర్ 5-1-479 మరియు 481 ఆవరణలో ఉన్న స్థలం , మాతృశ్రీ నివాసల్‌లోని 26 చదరపు యార్డ్‌లో ఉన్న స్థలం , మూడో అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెంబర్ 301, పూర్తి విస్తీర్ణం 830 చదరపు అడుగులు. సరిహద్దులు : ఉత్తరం : దారి, దక్షిణం : ఓపెన్ స్కై, తూర్పు : స్టేర్‌కేస్, ఓపెన్ స్కై, పడమర : ఫ్లాట్ నెంబర్: 302	SBI

కాలం నం.3లో ఇచ్చినట్లు రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమేమనగా సంబంధిత రుణగ్రహీత/ సహరుణగ్రహీత పేర్లకు ఎదురుగా కాలం నెం.4లో చూపిన పూర్తి మొత్తంను ఈ ప్రకటన తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించుటకు ఆహ్వానిస్తున్నారు. రుణ మొత్తం కాలం నెం.2లో చూపిన తేదినాటికి సంబంధిత రుణఖాతాకు సంబంధించి చెల్లించవలసి ఉంటుంది. పూర్తి మొత్తం వడ్డీతో సహా చెల్లించునాటికి ఖర్చులతో సహాగా స్పష్టంచేయడం జరిగింది. చెల్లించని యెడల, ఆర్సిల్ కాలం నం.7లో పేర్కొనినట్లుగా ఆస్తులపై ఆర్సిల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ సరైన చర్యలు తీసుకొనబడును. చట్టం మరియు నియమాలలో పేర్కొనినట్లుగా ఇతర రూపాలలో నోటీసు అందించుటకు చర్యలు తీసుకొనబడును.

తేది: 05.02.2018
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి,
అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్

Arcil Arms


అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీస్: ది రూబీ, 10వ అంతస్తు, 29 సేనాపతి బాపట్ మార్గ్, ముంబయి-400028, మహారాష్ట్ర. www.arcil.co.in
సంప్రదించాల్సిన చిరునామా: ఫ్లాట్ నం.207, భువన టవర్, మంజుథియేటర్ ప్రక్కన, సిపిఎంఆర్ ఎక్స్‌క్లూసివ్ సైన, ప్యాట్నీ, సికింద్రాబాద్-500003, తెలంగాణ.
ఫోన్:040-66028013/14. www.arms.net.in CIN-U65999MH2002PLC134884.

సంపాదకీయం

మాల్దీవుల సంక్షోభం

మనకు పొరుగునే ఉన్న మాల్దీవుల్లో అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది చివరిలో జరగనుండగా ప్రభుత్వానికి, న్యాయ వ్యవస్థకు మధ్య తలెత్తిన ఘర్షణ ఈ చిన్న పర్యాటక దేశాన్ని తీవ్ర రాజకీయ సంక్షోభంలోకి నెట్టడం దురదృష్టకరం. దేశంలో శాంతిని కాపాడేందుకు పదిహేను రోజుల పాటు ఎమర్జన్సీ విధిస్తున్నట్టు అధ్యక్షుడు యమీన్ ప్రకటించడం, ఆ వెంటనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో సహా ఇద్దరు న్యాయమూర్తులను అవినీతికి పాల్పడ్డారన్న అభియోగంపై అరెస్టు గావించడం, ప్రభుత్వానికి, ప్రతిపక్ష నిరసనకారులకు మధ్య ఘర్షణతో రాజధాని మాలే ఉద్రిక్తంగా మారడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య ప్రియులకు ఆందోళనకు గురిచేసేవే. క్రిమినల్, ఉగ్రవాద ఆరోపణల కింద జైలు పాలై, ప్రస్తుతం లండన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ అధ్యక్షుడు నషీద్‌తో సహా తొమ్మిది మంది ప్రతిపక్ష నాయకులపై గతంలో విధించిన శిక్షలను రద్దు చేయడంతోబాటు, అనర్హత వేటు పడిన మరో 12 మంది ప్రతిపక్ష ఎంపీల సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ గత గురువారం సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో మొదలైన ఈ సంక్షోభం ఎమర్జన్సీ విధింపుతో పతాక స్థాయికి చేరింది. సైన్యం, పోలీసులు కోర్టు ఉత్తర్వుకు వ్యతిరేకంగా, అధ్యక్షునికి మద్దతుగా నిలవడం గమనార్హం. యమీన్ చర్య అప్రజాస్వామికమని అమెరికా, బ్రిటన్, కెనడా ఖండించాయి. అంత తీవ్ర స్వరంతో కాకున్నా భారత్ కూడా యమీన్ చర్యపై అసమ్మతి తెలిపింది. మిగతా దేశాలు వేచి చూసే ధోరణిని అనుసరిస్తున్నాయి.

మోడీ మాత్రం శ్రీలంక, షిచెల్లీస్ పర్యటన అనంతరం మాల్దీవులను సందర్శించాల్సి వుండగా, అకస్మాత్తుగా రద్దు చేసుకున్నారు. అమెరికా మెప్పుకోసం మాల్దీవుల సంక్షోభంలో తొందరపడి భారత్ జోక్యం చేసుకోవడం మన దేశానికే నష్టం చేకూర్చే అవకాశం ఉంది.



2012 ఎన్నికల్లో నషీద్‌ను ఓడించి యమీన్ అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుంచి ఆయనను గద్దె దించడమే లక్ష్యమని ప్రకటించినవారిలో అధ్యక్షుని సవతి సోదరుడు మహమ్మద్ గయూమ్ ప్రముఖుడు. ఈయన మూడు దశాబ్దాల పాటు దేశాన్ని నిరంకుశంగా పాలించాడు. 2008లో బహుళపార్టీ ప్రజాస్వామ్య పద్ధతిలో తొలిసారి జరిగిన ఎన్నికల్లో మాల్దీవ్స్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) నేత అయిన నషీద్ చేతిలో గయూమ్ ఓడిపోయాడు. 2012 ఎన్నికల్లో నషీద్‌ను యమీన్ ఓడించాడు. ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణపై పదమూడేండ్ల జైలు శిక్ష పడింది. కొద్ది కాలం శిక్ష అనుభవించి, తరువాత అమెరికా సాయంతో ఆయన ప్రవాసంపై లండన్‌కు వెళ్లిపోయాడు. యమీన్, గయూమ్, నషీద్ ఎవరు అధికారంలో వున్నా మాల్దీవుల ప్రజలకు ఒరిగిందేమీ లేదు. మాల్దీవుల పాలకవర్గాల్లో తలెత్తిన అంతర్గత విభేదాలు సంక్షోభ చిచ్చును రగిలిస్తే, పశ్చిమ దేశాలు దీనికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. తూర్పు ఆసియా వ్యవహారాలను చూసే అమెరికా విదేశాంగశాఖ సహాయ మంత్రి అలీస్ వెల్స్ ఇటీవల అమెరికన్ కాంగ్రెస్ ఆసియా-పసిఫిక్ సబ్ కమిటీకి సమర్పించిన నివేదికలో దక్షిణాసియాపై పట్టు పెంచుకోవాలంటే మాల్దీవుల్లో జోక్యం తప్పనిసరి అని వాదించారు. మాల్దీవుల జనాభా నాలుగు లక్షలకు మించి ఉండదు. వైశాల్యం కూడా చాలా తక్కువే. అయినా, ఈ ప్రాంతం ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకోవడానికి కారణం అది భౌగోళికంగా, వ్యూహాత్మకంగా కీలకమైన స్థానంలో వుండడమే. తూర్పు ఆసియా, దక్షిణాసియా, మధ్య ప్రాచ్యం, ఆస్ట్రేలియా, భారత్, చైనా, జపాన్ దక్షిణ కొరియా తదితర దేశాల నౌకలు, చమురు కంటైనర్లు చాలా వరకు ఈ దీవుల గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. మాల్దీవుల భద్రత కోసం యమీన్ ప్రభుత్వం అటు అమెరికాతో, ఇటు భారత్, చైనాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఆ క్రమంలోనే వన్ బెల్ట్ వన్ రోడ్డు ప్రాజెక్టులో చేరడానికి అంగీకరిస్తూ చైనాతో గత ఏడాది ఒప్పందం కుదుర్చుకుంది. చైనాను ఒంటరిపాటు చేయాలని చూస్తున్న ట్రంప్ సర్కారుకు ఇది రుచించలేదు. ఇటీవల యమీన్ ప్రభుత్వం చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడం కూడా అమెరికా ఆగ్రహానికి కారణమై ఉండవచ్చు. యమీన్ ప్రభుత్వాన్ని కూలదోసి, దాని స్థానే కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలన్నది అమెరికా పన్నాగం. అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహంలో భాగస్వామిగా చేరడంలో అత్యుత్సాహం చూపిన మోడీ ప్రభుత్వం, మాల్దీవుల సంక్షోభంలోనూ అమెరికాకు వంతపాడే వైఖరిని అనుసరిస్తోంది. యమీన్ అధికారంలోకి వచ్చిన తరువాత మొట్టమొదటి విదేశీ పర్యటన భారత్‌తోనే ప్రారంభించారు. మోడీ మాత్రం శ్రీలంక, షిచెల్లీస్ పర్యటన అనంతరం మాల్దీవులను సందర్శించాల్సి వుండగా, అకస్మాత్తుగా రద్దు చేసుకున్నారు. అమెరికా మెప్పుకోసం మాల్దీవుల సంక్షోభంలో తొందరపడి భారత్ జోక్యం చేసుకోవడం మన దేశానికే నష్టం చేకూర్చే అవకాశం ఉంది.

ప్రజావాణి

ఇవేనా వార్షికోత్సవాలు..?

ఒకప్పుడు పాఠశాల వార్షికోత్సవాలు జరుగుతున్నాయంటే అది ఆ ఊరంతా పండగే. వార్షికోత్సవాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేవి. పాటలు, నాటికలు, సంప్రదాయ నృత్యాలు, ఏకపాత్రాభినయం, హరికథ, బుర్రకథ మొదలైనవి ఉండేవి. కానీ నేడు వార్షికోత్సవాలు మన సంస్కృతీ సాంప్రదాయాలను దెబ్బతీస్తున్నాయి. ఎక్కువగా ప్రయివేట్ పాఠశాలల్లో ప్రతీఏడూ పాఠశాల వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. అతి కొద్ది ప్రభుత్వ పాఠశాలల్లోనే వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. అయితే ప్రయివేట్ పాఠశాలల్లో చాలా వరకు డాన్స్‌లకే పరిమితం అయ్యాయి. వార్షికోత్సవాలు సందర్భంగా సినిమా పాటలు క్లాస్, మాస్ అనకుండా, సాహిత్య విలువలతో సంబంధం లేకుండా, కొత్త సినిమా పాటలకు రోజుల తరబడి డాన్స్ ప్రాక్టీసులు చేయించి, ప్రదర్శింప జేస్తున్నారు. కొన్నిచోట్ల డుయెట్ డాన్సులు చేయించడం శోచనీయం. (చిన్న పిల్లల చేత) ఈ పద్ధతి మారాలి. ఇప్పటి తెలుగు పుస్తకాలలో రకరకాల ప్రక్రియలలో పాఠ్యాంశాలు వస్తున్నాయి. వాటిని కళా రూపాలుగా మార్చి వార్షికోత్సవాలలో ప్రదర్శించ వచ్చు. తప్పనిసరిగా పాఠశాల వార్షికోత్సవా లలో నాటకాలు, సంప్రదాయ నృత్యాలు, వివిధ కళలు ప్రదర్శించాలి.

సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్.

నాస్తిక మేళాకు కుటుంబాలతో తరలిరండి

'చార్వాక' నాస్తిక సమాజం ఆధ్వర్యంలో 26వ ఏడాది నాస్తిక మేళా గుంటూరుజిల్లా మంగళగిరి సమీపంలోని నిడమర్రు గ్రామంలోని చార్వాక ఆశ్రమంలో ఫిబ్రవరి 10, 11 తేదీలలో జరుగనున్నది. సంస్కృత అధ్యాపకులైన బొడ్డు రామకృష్ణ ప్రభుత్వ కళాశాల ఉద్యోగానికి రాజీనామా చేసిన 70వ దశకంలో చార్వాక విద్యాపీఠాన్ని నెలకొల్పి శాస్త్రీయ విద్యావిధానాన్ని అందించి అనేక మంది విద్యార్థులకు ప్రశ్నించే తత్వం నేర్పించారు. నాస్తిక సమాజం పేరుతో సంస్థను స్థాపించి పెరియార్, పూలే, అంబేద్కర్, త్రిపురనేని భగవతాసింగ్, కార్ల్‌మార్క్స్ వంటి మహానుభావుల సిద్ధాంతాల్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసి మూఢనమ్మకాల నిర్మూలనకు కృషిచేశారు. అద్వానీ రామజన్మ రథయాత్ర ప్రత్యామ్నాయంగా శంభూక రథయాత్రను నడిపారు. బాబాల ఆగడాలను, మోసాలను ఎదిరించారు. నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టు కుటుంబాలకు ప్రత్యేక పండుగ కావాలంటూ 1992లో ఆయన రూపొందించిన నాస్తికమేళా ఆయన మరణించి పదేండ్లు దాటినా ఉద్యమ వారసులు, శిష్యులు నేటికీ కొనసాగిస్తున్నారు. ప్రతి యేటా ఫిబ్రవరి రెండవ శని, ఆదివారాలలో జరిగే మేళాకు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వెయ్యి మందికి పైగా తరలివస్తుంటారు. వివిధ అంశాలపై చర్చలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ వంటి కార్యక్రమాలు జరుగుతాయి. భౌతికవాదం, నాస్తికత్వం, హేతువాదం, కమ్యూనిజం పట్ల ఆసక్తిఉన్నవారు రావాలని కోరుతున్నాం.

- మోతుకూరి అరుణకుమార్

లైంగికదాడులకు ఆడవారి బట్టలు కారణమా?



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఆడవాళ్ళు రెచ్చగొట్టే దుస్తులు ధరిస్తున్నారు. అందుకే లైంగికదాడులు జరుగుతున్నాయి. ఇది మను మృగాళ్ళ మాట. చిన్నారులనూ చిదిమేస్తున్నారు. ముసలోళ్ళనూ హింసిస్తున్నారు. అంగాలే ఎదగని నెలల పిల్లల గౌన్లు, ముడత శరీరాలను కప్పిన కంపు చీరలు కూడా "మగతనాన్ని" ఆకర్షిస్తాయా? రెచ్చగొడతాయా? ప్రగతిశీలుర ప్రశ్న?

ఏ దుస్తులు ధరించావు?: అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన అమెరికా కాన్సాస్ యూనివర్సిటీ విద్యార్థులు ఒక సృజనాత్మక పథకం పాటించారు. దీని స్ఫూర్తితో లైంగికదాడి సమయంలో స్త్రీలు ధరించిన బట్టలతో బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో 'ఏ దుస్తులు ధరించావు?' అన్న శీర్షికతో ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇది బాధితుల భయంకర కన్నీటి గాథలను కథనీకరించింది. మగమత్తులో మనసు మూసుకు పోయినవారి కండ్లు తెరిపించింది. మహిళల దుస్తులు లైంగిక దాడులను ప్రేరేపిస్తాయన్న ఆలోచనను పటాపంచలు చేసింది. బ్రసెల్స్‌లో నివారణ సేవల్లో పనిచేసే మహిళ డెలైన్ గూసెన్స్ తన, తన తోటి ఉద్యోగుల బట్టలను సేకరించి, తాను పనిచేసే బ్రసెల్స్ జిల్లా మోలెన్ బీక్ మార్టిటైమ్ కమ్యూనిటీ సెంటర్‌లో కాన్సాస్ ప్రదర్శనను ప్రతిబింబించే ప్రదర్శనను జనవరి 8 నుండి 20 వరకు ఏర్పాటు చేశారు. ప్రదర్శనలోని 18 రకాల దుస్తుల్లో పైజామాలు, స్నానాల బట్టలు, ట్రాక్ సూట్లు, పాఠశాల యూనిఫాం, పోలీసు వేషధారణ ఉన్నాయి. విజాతి ఆకర్షణలేని స్వజాతి మగదుస్తులే ఎక్కువ. ఈ దుస్తులు చూసిన తర్వాతనైనా హింసకు, లైంగికదాడులకు గురైనవారి పట్ల ప్రజల మనస్తత్వం మారుతుందని ఆశిస్తానని, బట్టల ప్రభావమేమీ లేదని, లైంగికదాడి ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా జరగవచ్చని నిర్ధారణ అయిందని ప్రదర్శన తిలకించిన మహిళ లీస్బెత్ వర్స్ట్రేవెన్ అన్నారు. అత్యాచార సంస్కృతిపై పురుష సమాజంలో వ్యాపించిన అవాస్తవ ఊహాగాథలకు ప్రతిస్పందనగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశానని గూసెన్స్ చెప్పారు. ఆడపిల్లలకు జాగ్రత్తగా బట్టలేసుకొమ్మని చెపుతాం. మగపిల్లలకు మర్యాదగా మసలుకోమని బోధించం. ఏ బట్టలూ లైంగికదాడులను ఆపవనీ, మహిళలు (మగవారిలాగే) ఇష్టమొచ్చిన దుస్తులు ధరించవచ్చని, తమ దుర్మార్గాలకు మృగవారు బట్టల సాకు చూపవద్దని ఆమె వ్యాఖ్యానించారు.

> **అత్యాచార మగాళ్ళు రొమ్ములిరుసుకొని తిరుగుతారు. దాడులకు గురైన స్త్రీలు, వారి పిల్లలు శారీరక, సామాజిక, సమస్యలకు, బాధలకు గురవుతారు. మగాళ్ళు మహిళలను అణగదొక్కడంలో చూపించే అతితెలివిని వనితా వికాసానికి ఉపయోగిస్తే ప్రపంచం మరో విధంగా ఉండేది. ఆడవారి బట్టలు వాంఛను రెచ్చగొట్టవు. మగబుద్ధి మారాలి. అమ్మా, చెల్లీ ఆడవారేనని, స్త్రీలు సమాజ నిర్మాతలని, తోటి మానవులని గుర్తించాలి.**

ఇది నా తప్పా?: ఇవన్నీ మహిళలందరూ వేసుకునే సాధారణ దుస్తులు. ఐనా లైంగిక దాడులు ఆగలేదు. "ఇది నా తప్పా?" అత్యాచారాలకు గురైన అమాయక స్త్రీలు బాధతో ప్రశ్నిస్తున్నారు. "చిన్ని గౌను కూడా అత్యాచారాన్ని ప్రేరేపించిందా?" బాధితులకు మద్దతు పలికే సామాజిక సేవా సంస్థ 'సీఏడబ్ల్యూ' సభ్యురాలు లీస్బెత్ కెన్స్ ప్రశ్నించారు. "ఇది మగాళ్ళ సమాజం. స్త్రీలు, పిల్లలు కూడా మగప్రభావాలలో కొట్టుకు పోతున్నారు. ఆడపిల్లలు రెచ్చగొట్టే బట్టలేసుకుంటారని, సరసాలాడుతారని, పొద్దుపోయి సైకిళ్ళపై ఇండ్లకు చేరుకుంటారని అంటారు. లైంగికదాడులకు, వేధింపులకు ఒకే ఒక వ్యక్తి బాధ్యుడు. అతనే వాటిని ఆపగలడు. అతనే నేరస్తుడు." అని ఆమె వాపోయారు.

మగవాంఛ ప్రపంచవ్యాపితం: లైంగికదాడులు ప్రపంచవ్యాపిత సార్వజనిక సమస్య. మానవాళిపై మాయని మచ్చ. 2015లో యూరోపియన్ యూనియన్‌లో 2,15,000 లైంగిక హింసలు నమోదయ్యాయి. అందులో 72వేలు లైంగికదాడులు. బెల్జియన్ స్త్రీలలో 56శాతం మంది లైంగిక హింసకు, 25శాతంమంది బహిరంగ ప్రదేశాల భౌతిక వేధింపులకు గురయ్యారు. "బెల్జియంలో 10శాతం లైంగికదాడులే పోలీసులకు నివేదించబడతాయి. 10శాతం నిందితులే శిక్షించబడతారు. బాధితుల చేదు అనుభవాల వ్యక్తీకరణను సమాజం నిరుత్సాహపరుస్తుంది. జపాన్‌లో నిశ్శబ్ద సంస్కృతి వ్యాపించింది. అత్యాచారాలకు గురైన మహిళలెవరూ ఫిర్యాదు చేయరు. చేసినా నేరస్తున్ని నిర్బంధించరు, శిక్షించరు. లైంగికదాడికి గురైనవారిలో 70శాతం మంది మిత్రులకు, కుటుంబ సభ్యులకు, సమీప ఆప్తులకు చెప్పుకోలేక పోయామన్నారు. 4శాతం కంటే తక్కువమంది పోలీసుల దగ్గరికెళ్ళారు. "జపాన్ మహిళలు తమపై జరిగిన లైంగికదాడులకు తమనే నిందించుకుంటారు. తామే తప్పు చేశామనుకుంటారు." అని ఓచనోమిజు విశ్వవిద్యాలయ లింగాంశాల అధ్యయన గౌరవాచార్యులు తామీ కైనో బాధపడ్డారు. మాధ్యమాల అభ్యాసిని 28ఏండ్ల షియోరి ఇటొపై ప్రసార పాత్రికేయుడు 51ఏండ్ల నోరియుకి యమగుచి లైంగికదాడి చేశాడు. ఇటొ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యమగుచి టోక్యో ప్రసార వ్యవస్థకు వాషింగ్టన్ బ్యూరో చీఫ్. జపాన్ ప్రధాని షింజో అబె జీవిత చరిత్ర రాశారు. విచారణ, దర్యాప్తు అధికారులు యమగుచిపై కేసు ఎత్తేశారు.

2017 డిసెంబర్‌లో యొకొహామాలో ఆరుగురు విశ్వవిద్యాలయ విద్యార్థులు సహ విద్యార్థినిని బలవంతంగా మద్యం తాపి సామూహిక అత్యాచారం చేశారు. విచారణాధికారులు కేసు వదిలేశారు. జపాన్‌లో అత్యాచారం చేసిన నిందితుల దోష నిర్ధారణ జరిగినా శిక్షలు పడవు. నేరస్తులు జైలుకుపోరు. జనవరిలో టోక్యో దగ్గరి చిబా విశ్వవిద్యాలయంలో ఇద్దరు విద్యార్థులు తోటి విద్యార్థినిని మద్యం తాగించి లైంగికదాడి చేశారు. టోక్యో యూనివర్సిటీలో ఇంకొక విద్యార్థి సహ విద్యార్థినిని లైంగికదాడి చేశాడు. వీరి నేరాలు రుజువైనా శిక్షలు రద్దయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్‌లో ఆడవారిపై లైంగికదాడులు పెరిగాయని ప్రధాని అబె అన్నారు. 2014లో జపాన్‌లో 15మందిలో ఒక మహిళ, అమెరికాలో 5మందిలో ఒకరు లైంగికదాడికి గురయ్యామని ఫిర్యాదు చేసినట్టు ప్రభుత్వ సర్వేలలో తేలింది. అమెరికాలో 33శాతం మంది మహిళలు తమపై జరిగిన లైంగికదాడులను పోలీసులకు తెలిపారు. మా దేశంలో లైంగికదాడులు తులనాత్మకంగా తక్కువని జపాన్ ప్రభుత్వం గొప్పలు పోతుంది. దక్షిణ నైజీరియాలో ఒక దరిద్రపు మూఢాచారముంది. భర్త చనిపోతే భార్యను శుద్ధి ప్రక్రియకు గురిచేస్తారు. భర్త శవంలో శరీర భాగాలను కడిగిన నీటిని భార్య తాగాలి. ఆ తర్వాత 7రోజులు తిండి లేకుండా గదిలో బంధిస్తారు. ఆమె బతికితే అతని చావుకు ఆమె కారణం కాదని, మరణిస్తే భర్త అదృశ్య శక్తులు ఆమెను చంపేశాయని నిర్ణయిస్తారు.



మన రాజకీయులు, చట్టనిర్మాతలు, మనువాదులు, మతాధిపతులు ఆడవారు లైంగికదాడులకు లోనయినప్పుడు మొద్దుగా బుద్ధులు మరిచి మాట్లాడుతుంటారు. నిర్భయ అఘాయిత్య సందర్భంలో హిందూ గురు ఆశారాం బాపు, సంఘ్ ప్రముఖుడు మోహన్ భాగవత్, మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాస్ విజయవర్గీయ, మహిళా శాస్త్రవేత్త డా.అనితా శుక్లా, బిఎస్‌పి ఎంపీ షఫీక్ రహ్మాన్ బర్, తృణముల్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తీదార్, జమాత్ ఇ ఇస్లాం మతసంస్థ పెద్దలు అమానవీయంగా వ్యాఖ్యానించారు. "భర్తలు, తండ్రులు లేకుండా సూర్యాస్తమయం తర్వాత బయటికి పోయే ఆడవారు గౌరవార్హులు కారు. పెట్రోలు మంటకు కారణమవుతుంది. చక్కెర చీమలను ఆకర్షిస్తుంది." సమాజ్‌వాదీ పార్టీ నేత అబుఅజ్మీ గతేడాది సూత్రీకరించారు. 2014లో మహారాష్ట్ర మహిళా హక్కుల సంఘం సభ్యురాలు ఆశా మిర్గే లైంగికదాడులకు ఆడవారి బట్టలే కారణమని నిందించారు. నిర్భయ రాత్రి సినిమాకెందుకెళ్ళాలి? ముంబై శక్తి మిల్స్ సామూహిక లైంగికదాడికి గురైన మహిళ అక్కడికెందుకెళ్ళింది? అని ప్రశ్నిస్తూ ఆడవారి బట్టలు, ప్రవర్తన, వారు తగని స్థలాలకు పోవడమే లైంగికదాడులకు కారణమని తీర్మానించారు.

వనితా వలువలు కాదు.. మగ మనసులు మారాలి: "ఆడవారిని లైంగికదృష్టితోనే చూడరాదు. మానవులుగా పరిగణించాలి. వారు శారీరక వాంఛలు తీర్చే వస్తువులు కాదు. మగాళ్ళ చేతి కీలుబొమ్మలు కాదు." అని సంప్రదాయ ముస్లిం దేశం నైజీరియా రచయిత అబూబకర్ ఆదాం ఇబ్రహీం అన్నారు." లైంగిక దాడులకు స్త్రీల దుస్తులే కారణమని చాలాకాలంగా సాకులు చెపుతున్నారు. ఇది తమ నియంత్రణాశూన్యతను, పశుశక్తి ప్రయోగాన్ని కప్పిపుచ్చుకోడానికి నేరస్తులు చేసే అపనింద. బాధ్యతను బాధితులపై నెట్టే బాధ్యతా రాహిత్యం." మానసిక శాస్త్రజ్ఞులు, లైంగిక దాడులు, లైంగిక వేధింపుల అధ్యయన నిపుణులు సంద్రశుల్మన్ విశదీకరించారు. అత్యాచార మగాళ్ళు రొమ్ములిరుసుకొని తిరుగుతారు. దాడులకు గురైన స్త్రీలు, వారి పిల్లలు శారీరక, సామాజిక, సమస్యలకు, బాధలకు గురవుతారు. మగాళ్ళు మహిళలను అణగదొక్కడంలో చూపించే అతితెలివిని వనితా వికాసానికి ఉపయోగిస్తే ప్రపంచం మరో విధంగా ఉండేది. ఆడవారి బట్టలు వాంఛను రెచ్చగొట్టవు. మగబుద్ధి మారాలి. అమ్మా, చెల్లీ ఆడవారేనని, స్త్రీలు సమాజ నిర్మాతలని, తోటి మానవులని గుర్తించాలి.

సెల్:9490204545

సహస్ర

భారత్ ఆరోస్థానమంటే ఎలా..?


'సంపన్నుల భారత్' అంటూ ప్రపంచంలో ఆరో స్థానమంటూ లెక్క తేల్చిన మేధావి ఎవరోమరి? పాలకపక్షాల బాకాలుగా మోడీ భజనపరులుగా మారిన భారత్ మీడియా ప్రపంచంలో అభివృద్ధి చెందిన ఆడో దేశంగా వక్రీకరించి ప్రచారం చేసుకుంటున్నది. ఈ సర్వేలోనే తప్పుంది. అభివృద్ధి దేశాల జాబితాలా? సంపన్న దేశాల జాబితానా? సంపన్నులు.. వాళ్ల ఆస్తులు పెరిగితే దేశం పెరిగినట్టా? దేశం అభివృద్ధికి గీటురాయా? నా దృష్టిలో దోపిడీ దేశంగా ఆరోస్థానంగా పేర్కొనవచ్చు. నిజానికి దోపిడీ దేశంలో ఆరోస్థానం కాదు, నెంబర్ వన్‌లో ఉంటుంది. అమెరికా మొదటి నుంచి అగ్రరాజ్యం. ఆర్థికంగా నిలదొక్కుకున్న దేశం. ఆ దేశం మొదటి స్థానంలో ఉండటం ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ప్రపంచంలోని దేశాలన్నీ ఆ దేశంలోని పెట్టుబడిదారుల దోపిడీకి వత్తాసుగా ఉంటే.. అమెరికా అలా కాదు. ప్రపంచ దేశాలను దోపిడీచేసి పైకి వచ్చినదేశం. ప్రపంచ ప్రజల చెమటను, ప్రతిభను వాడుకొని ధనికదేశంగా, అగ్రదేశంగా పేరొందిన దేశం. చైనా అలాకాదు. కమ్యూనిస్టు దేశమా? ప్రపంచంలో అగ్రదేశం కావాలని, సోషలిజం దారిని వదిలి పెట్టుబడుల దారిలోకి మళ్లి.. తన దేశ వనరులను, తన దేశ మానవశక్తిని ప్రపంచీకరణకు అనుకూలంగా మార్చుకొని.. సంపన్నులను పెంచుతూ రెండో సంపద దేశంగా ఎదిగింది. దేశంలో ఆకలి ఉంది. ఆర్థిక అంతరాలున్నాయి. కుబేరులున్నారు. పెట్టుబడి దేశంగా ఎదుగుతున్నందున.. తప్పక దోపిడీ ఉంటుంది.

భారతదేశంలో 130 కోట్ల పైగా జనాభా ఉంటే.. కొన్ని వేల మంది కోటీశ్వరులయ్యారని, కొన్ని వందల మంది సంపద లెక్కచేసి.. ప్రపంచంలో 6వ సంపన్న దేశమని కితాబు యివ్వటం ఎంత దుర్మార్గం? ఈ లెక్కల రాయుళ్లకు దేశంలోని బీదలు.. అప్పులు.. సమస్యలు.. కన్నీళ్లు.. వారి ఆత్మహత్యలు కనిపించవు. వీటికి లెక్కలు దొరకవు. దొరికినా.. ప్రచారమివ్వరు. ఒకవేళ ఎవరైనా బాధపడి ప్రచారం చేస్తే దేశం పరువు తీసారని, దేశ గౌరవ మర్యాదలకు భంగం కలిగించారని గగ్గోలు మొదలవుతుంది. ఏది దేశం? ఎవరి దేశం? ఎలా సంపన్నుల దేశంగా అంటున్నారు? సంపద ఊరికేరాదు. ప్రజలను వారి చెమటను, వారి శ్రమను దోచుకుంటే వస్తుంది. వీరి కీర్తన ఈ లెక్కల రాయుళ్లకు.. కార్పొరేట్ మీడియా సామ్రాజ్యానికి అవసరం. వీరికి చారిత్రక జ్ఞానం లేదు. సామాజిక విజ్ఞానం లేదు. ప్రపంచ చరిత్ర శ్రామికవర్గ చరిత్రగా గుర్తించని వీళ్లు.. సంపన్నుల భోజన రాయుళ్లు.. సంపన్నుల పెద్ద చేసే పాలకుల కీర్తనా రాయుళ్లు.

సంపన్నుల ప్రపంచంలో భారత్ ఆరో దేశంగా కితాబుయిచ్చిన ఈ సంస్థకు ఒక విజ్ఞప్తి విద్యావంతులైన పెద్దలారా? సంపన్నుల దృష్టితో అంచనాలు వేసే పరిశోధకులారా? ఒక విజ్ఞప్తి.. దయచేసి భారతదేశానికి రండి! ఢిల్లీ, బొంబాయి, హైదరాబాద్ లాంటి పట్టణాలు దాటి రండి! అదానీ, అంబానీ, విప్రో, టాటా వీళ్లను దాటి దేశానికి ప్రాణమైన పల్లెలలోకి రండి! పల్లె పరిస్థితిని, పల్లె ప్రజలను, వారి జీవితాలను మధ్య తరగతి ప్రజల మౌనాన్ని లెక్కల్లోకి తీసుకోండి! లెక్కలేయండి! ఎందరు దరిద్రులున్నారు? ఎందరు ఆకలితో మాడుతున్నారు? ఎందరు అప్పులలో ఉన్నారు? ఎందరు భయం మధ్య బతుకుతున్నారు? ఎన్ని జీవితాలు అమావాస్యలుగా ఉన్నాయి? వ్యవసాయ దేశమైన భారత్‌లోని రైతుల పరిస్థితి ఏమిటీ? వారి కన్నీటి చుక్కలు లెక్కించండి. లక్షలాది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకొన్నారో ఈ ఆత్మహత్యలకు.. సంపన్నులు.. ఇంకా ఇంకా సంపన్నులు కావటానికి ప్రపంచంలోనే ఆరోస్థానంలోకి రావటానికి కారణముందా? విశ్లేషించండి!

> **ఒక్క 2017లోనే ఒక్క సంవత్సరంలోనే మోడీకాలంలోనే 8,23,000 కోట్లకు చేరింది. సంపన్నుల సంపద 2017 ఒకే ఏడాదిలో 25శాతం పెరిగింది. మోడీ రాజ్యం ఎవరి రాజ్యం. మోడీ సంస్కరణలు సంపన్నుల కోసం కాదా?**

సంపన్న దోపిడీ షోకుల మోజుల్లో



శ్రమజీవుల ఆకలిని మర్చిపోకండి! సంపన్నులు మరీ మరీ సంపన్నులై భారతదేశం ఆరో సంపన్న దేశంగా కీర్తించబడటానికి.. మీ కీర్తనలు అందుకోవటానికి ఎవరు కారకులు? ఎవరి సంపదలతో వీళ్ల సంపన్నులయ్యారు? ఎవరి శ్రమతో వీళ్ల సంపద పెంచుకున్నారు? వీళ్ల తమ సంపదను ఆకాశమెత్తు పెంచుకొని.. ఆరో సంపన్న దేశంగా కీర్తించబడటానికి.. వీరి దోపిడీ, అక్రమార్జన, నల్లడబ్బు, పాలకపక్ష దోపిడీ కారణం కాదా?

ఒక విశ్లేషణ చేయవల్సిన అవసరముంది. ఆ విశ్లేషణ మామూలుగా కాదు, పునాదులతో సహా శాస్త్రీయ ధృక్పథంతో.. భారతదేశంలో ఆర్థిక అంతరాలు విపరీతం కావటానికి కోట్లాది ప్రజలు శ్రమపడుతూ కూడా పేదలుగా.. మరీ పేదలు కావటానికి వీరి సంపద పెరగటానికి కారణం కాదా? అంటే శ్రామిక జనం రక్తం తాగి వీరు సంపదను పెంచుకొని.. ఆకలిదేశాన్ని, చీకటి దేశాన్ని.. వెలుగులేని ప్రజల దేశాన్ని సంపన్న దేశంగా ప్రపంచ దృష్టిలోకి తెచ్చి శ్రామిక సౌందర్యానికి అన్యాయం చేశారు. ప్రజాస్వామ్య ప్రియుల్ని మోసం చేస్తున్నారు. అమాయక ప్రజలను ఓటర్లను దగా చేస్తున్నారు.

భారతదేశ జనాభా 130 కోట్ల పైగా.. 5.23 కోట్ల కోట్లతో ప్రపంచంలో ఆరోస్థానమని కీర్తన.. వంచన. 5.23 కోట్ల కోట్లు ఎవరి దగ్గరున్నాయి? ప్రజలందరి దగ్గరున్నాయా? కొందరి దగ్గరున్నాయా? ఈ కొందరే భారతదేశమా? ఈ కొందరే భారతదేశమైతే ప్రజల ఓటుకు విలువలేనట్టే.. ప్రజల ఆధార్‌కార్డులు పనికిరానివని లెక్క... ఈ ప్రజాస్వామ్యం బోగస్ అని అర్థం చేసుకోవాలి. మరో రెండు అర్థాలు మన ముందు నిల్చున్నాయి. ఈ 70ఏండ్ల పాలకులు సంపన్నులను బాగా బాగా సంపన్నులు చేయటానికి ఈ ప్రజాస్వామ్యాన్ని వాడుకున్నారు. ప్రజాస్వామ్య భావజాలం, సమానత్వం, స్వేచ్ఛ లక్ష్యంగా రాసిన రాజ్యాంగాన్ని దగా చేస్తున్నారు.

భారత్ ప్రపంచ ఆరో సంపన్న దేశంగా ఈ లెక్కలను చూస్తే.. ఎవరి తప్పు? ఎవరి మోసానికి ప్రతిఫలం? ఏ పాలకులు మనలను మోసం చేస్తున్నారు? లెక్క తీయాల్సిన అవసరం మనకుంది. భారత్‌లో పదిలక్షలకు పైగా నికర ఆస్తులు ఉన్నా వారి సంఖ్య 3,30,400 మన జనాభా ఎంత? వంద ముప్పదికోట్ల పైగా.. మిగతావారు..? భారతదేశంలో కోటీశ్వరుల సంఖ్య 20,730 మాత్రమే... ఇంకో విచిత్రం, విషాదం చెప్పాలా? 100 కోట్లకు పైగా ఉన్నవారు 119 మంది మాత్రమే... దేశంలోని 90శాతం సంపద పది మంది చేతుల్లో ఉంది. ఇందులో ముకేశ్ అంబానీ ఆస్తి ఎంత? ప్రధాని కుర్చీలోకి నరేంద్రమోడీ వచ్చిన తర్వాత అంబానీ, అదానీ ఆస్తులు ఎంత పెరిగాయి? 130 కోట్ల జనాభాలో 119 మంది మాత్రమే 100 కోట్లపైగా ఉన్న సంపన్నులు.. ఈ సంపన్నుల దోపిడీ చేతుల్లో పాలకులు.. ప్రజలు.. భారతదేశం ఇది సంపన్నుల దేశం.

మన దేశంలోని సంపన్నుల సంపద ఏ లెక్కలో పెరిగిందో ఒకసారి చూద్దాం.. సంపద పెరగటం.. గాలిలో సంపద రాదు. సంపదను ప్రజలు శ్రమజీవులు సృష్టిస్తారు. సృష్టించిన సంపదలో సంపన్నులు మరీ మరీ సంపన్నులయ్యారు. అదే శాతంలో బీదలు మరీ మరీ బీదలయ్యారు. ఏ శాతంలో సంపన్నుల శాతం పెరిగిందో ఆదే శాతంలో ప్రజలు పేదలయ్యారు. ఈ పరిణామాన్ని పాలకుల పాలసీ సృష్టించింది. అంటే పాలకులు సంపన్న వర్గాల తొత్తులుగా ఉన్నారు. సంపన్నుల సంపద ఏశాతంలో పెరిగిందో అదేశాతంలో దోపిడీ ఉందని అర్థం.. అంటే ఇది సంపన్నుల దేశం కాదు. దోపిడీ దేశం.

మనదేశంలోని సంపన్నులు సంపద 2007-2017 మధ్య 160 శాతం పెరిగింది. 2007లో సంపన్నుల సంపద 3,16,500 కోట్లు. 2016లో 6,58,400 కోట్లు. పదేండ్లలో వందశాతం పెరిగింది. ఒక్క 2017లోనే ఒక్క సంవత్సరంలోనే మోడీకాలంలోనే 8,23,000 కోట్లకు చేరింది. సంపన్నుల సంపద 2017 ఒకే ఏడాదిలో 25శాతం పెరిగింది. మోడీ రాజ్యం ఎవరి రాజ్యం. మోడీ సంస్కరణలు సంపన్నుల కోసం కాదా? ■

మెయిల్ @ నవతెలంగాణ

రబీకి ఎస్ఆర్ఎస్పీ, డీబీఎం 38 ద్వారా నీరందించాలి



సి. శ్రీనివాస్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) దాని ఉపకాల్వ అయిన 38డీబీఎం జిల్లాలోని ములుగు మండలం మల్లంపల్లి దగ్గర మొదలై రేగొండ మండలం వెంకటేశ్వర్ల పల్లి మీదుగా చిట్యాల మండలం గరిమిళ్లపల్లి వరకు వందలాది గ్రామాల మీదుగా ఈ కాల్వల నిర్మాణం చేయబడి ఉంది. అయితే ప్రస్తుతం జిల్లా రైతాంగం వరి నారు పోసి, నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. మరికొంతమంది ఇప్పటికే నాట్లు వేయడం జరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాల్వల ద్వారా వ్యవసాయరంగానికి నీటిని విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జిల్లాలోని మోరంచవాగు మీద చెక్ డ్యాం నిర్మాణం చేసి భూపాలపల్లి, గణపురం, చిట్యాల మూడు మండలాల రైతులకు ఉపయోగపడే విధంగా కాల్వల ద్వారా నీటినందించాలి. మల్లంపల్లి నుండి గరిమిళ్లపల్లి వరకూ ఉండబడిన 38డీబీఎం ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా కాల్వ పొడవునా ఉన్న వందలాది గ్రామాల చెరువులు, కుంటలు నింపుకొని వ్యవసాయం చేయడానికి వీలుగా ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరందిస్తామన్న వాగ్దానాలు నీటి మూటలయ్యాలి. ఈ 38 డీబీఎం ద్వారా నీటిని విడుదల చేయడం ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులను నింపుకోవడం ద్వారా, మొత్తం 60,418 హెక్టార్ల భూమి వరి పంటలకు అనుకూలంగా ఉంటుంది. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా జిల్లాలోని మొత్తం వ్యవసాయాధారిత భూమిని సస్యశ్యామలం చేయడం జరుగుతుంది. **సెల్ : 9603471199**



ఓ చిన్నారి కథ...

ఎప్పటిలాగే ఆ రోజూ పాపను తీసుకొచ్చేందుకు స్కూలుకు పోయిన. ముందు హాల్లో టీచర్స్ కూర్చున్నారు. లోపలి నుంచి ఓ చిన్నారి ఏడుపు వినిపిస్తోంది.
'పొద్దుటి నుంచి ఒకటే ఏడుపు ఆ పిల్ల' చిరాకు పడుతోంది ఒక టీచర్.
అంతలోనే మా పాప పరుగులాంటి నడకతో వచ్చేసింది.
తన వెనకాలే ఏడుస్తున్న పాప... సరిగ్గా మా పాప వయసే.
"ఇంటికి పోత... అమ్మ కావాలి" అని గుక్కపట్టింది. ఒకటే ఏడుపు.
మా పాపను దగ్గరకు తీసుకుంటూ "ఏడవకు చిన్నతల్లి.. అమ్మ వస్తుందిలే" అన్న.
"రాదండి. వాళ్లమ్మ చనిపోయింది" అంది బాధగా ఇందాక చిరాకుపడ్డ టీచర్.
"వారం రోజులయ్యింది స్కూల్‌కు రాబట్టి... అయినా ఏడుపు మాత్రం ఇంకా కంట్రోల్ కావడం లేదు. కొట్టలేము. కసరలేము. ఆ పాపను చూస్తుంటే మాకే దుక్కమొస్తుంది" ఆయా చెబుతూ పోతూ ఉంది.
నా కళ్లు మసకబారాయి.



అంతలోనే మరో ఆయా వచ్చి ఆ పాపను దగ్గరకు తీసుకుంది. "అమ్మమ్మ వస్తుందిలే" అని ఊరడిస్తోంది.
'ఏడవకు తల్లీ అమ్మమ్మ వచ్చి బయటకు తీసుకెళ్తుందిలే" అని చెప్పి మా పాపను తీసుకుని బయటికి వచ్చాను.

ఆఫీసుకు వచ్చాను. పని చేసుకున్నాను. తిరిగి పాపను తీసుకుని ఇంటికి బయలుదేరాను. ఆ చిన్నారి ముఖమే వెంటాడుతోంది. ఆ పసిపాప ఏడుపే చెవుల్లో మారుమోగుతోంది. "ఇంటికి పోత... నాకు అమ్మ కావాలి" మాటలు పదే పదే చెవుల్లో.
బండి మీద కొద్ది దూరం వచ్చాను... ఎదురుగా వచ్చిన ఓ బైక్ గుద్దినంత పనిచేసింది. పాప ఒక్కసారే "అమ్మా.." అని హత్తుకుంది.

ఇంటికొచ్చాను. అన్ని పనులు పూర్తి చేసుకుని పాపకు అన్నం పెట్టాను.
తినిపిస్తుంటే ఎంత గోల. ముద్దముద్దకు ఎంతో మారాం. తిన్న తరువాత ఆడి ఆడి... పాట పాడుతంటే వెచ్చగా ఒడిలో పడుకుంది. ఇంతలోనే ఉలిక్కిపడింది. మరింత దగ్గరకు తీసుకుని పొట్టలోకి పొదువుకున్నాను.
బండిమీద భయంలో "అమ్మా..." అని అరిచిన క్షణాన..
గోరుముద్దలు తింటూ చేసిన మారాంలో...
కలవరింతల, ఉలికిపాట్ల నిదురలో...
ప్రతిసారి ఆ చిన్నారి ముఖమే కళ్లెదుట.
"ఇంటికి పోతా... అమ్మ కావాలి" అన్న మాటలే!
ఆ తల్లి ఎలా చనిపోయిందో తెలియదు. అనారోగ్యమో, ప్రమాదమో, హత్యో, ఆత్మహత్యో!
కానీ ఆ చిన్నారికి తల్లిలేని లోటు తీరేదెలా!?
నోట్: ప్రతి తల్లికి ఒక విన్నపం. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకండి. అప్రమత్తంగా ఉండండి. ఇంటా, బయటా ప్రమాదం ఉన్నచోట ప్రతిఘటించండి. ఆత్మహత్యలు చేసుకునేంత పిరికిగా మారకండి. పిల్లల గురించి ఒక్కసారి ఆలోచించండి. పిల్లలకు తల్లిదండ్రులు ఇద్దరూ ముఖ్యమే. తల్లి మరింత అవసరం. ఎట్టి పరిస్థితుల్లోనూ దూరం కాకండి! ❄

అటుకులు ఆరగిద్దామా!

చిన్నగా ... క్రాంచిగా, టేస్టిగా ఉండే అటుకులను ఇష్టపడని వారు చాలా అరుదు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అటుకుల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. కాబట్టి సాయంత్రం సాక్స్ మాదిరి, ఉదయాన్నే టిఫిన్‌లోకి వండుకోవచ్చు. అటుకులతో చేసిన పాయసం ఎంతో రుచిగా ఉంటుంది. ఇక పోహా ఉప్మా, దోశ, వడల గురించి ప్రత్యేకంగా చెప్పకోవాల్సిన అవసరం లేదు. రుచిగా ఉండే అటుకులతో చేసిన వంటకాలను ఓ సారి ప్రయత్నించి చూడండి!

అటుకుల దోశ...



కావాల్సిన పదార్థాలు: నానబెట్టిన బియ్యం - ఒక కప్పు, అటుకులు - 100 గ్రా॥, నూనె - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు.
తయారీ విధానం : ఒకరోజు ముందు మజ్జిగలో బియ్యం, అటుకులను ఎనిమిది గంటలు నానబెట్టుకోవాలి. మర్నాడు ఉదయం మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా తయారు చేసుకున్న దోశ పిండిలో చిటికెడు పసుపు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి, కొద్దిగా నూనె రాసుకొని చిన్న చిన్న దోశలు వేసుకుంటే సరిపోతుంది. పల్లీ, కొబ్బరి చట్నీతో బాగుంటాయి.

పోహా ఉప్మా...



కావాల్సిన పదార్థాలు: అటుకులు-రెండు కప్పులు, జీడి పప్పు-కొద్దిగా, కరివేపాకు రెమ్మలు - రెండు, అల్లం ముక్కలు - కొద్దిగా, పొడవుగా కట్ చేసిన పచ్చిమిర్చి - నాలుగు, కొత్తిమీర తురుము - కొద్దిగా, మినపప్పు - సగం చెంచా, ఆవాలు-సగం చెంచా, జీలకర్ర-సగం చెంచా, నూనె - రెండు చెంచాలు, నిమ్మరసం - కొద్దిగా, ఉల్లిగడ్డ- ఒకటి, పసుపు-ఒక చెంచా, ఉప్పు-తగినంత.
తయారీ విధానం: ముందుగా అటుకులను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నూనె పోసుకోవాలి. నూనె వేడి కాగానే దాంట్లో మినపప్పు, ఆవాలు, జీలకర్ర వేసుకోవాలి. ఇవి దోరగా వేగగానే జీడిపప్పు, పచ్చిమిర్చి, ఉల్లిముక్కలు, కరివేపాకు, పసుపు, అల్లం ముక్కలు వేసుకోవాలి. ఇవి కాస్త మగ్గిన తర్వాత ముందుగా శుభ్రం చేసుకున్న అటుకులను వేసి బాగా కలుపుకోవాలి. చివరగా నిమ్మరసం, కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. అంతే నోరూరించే పోహా రెడీ..

పాయసం...



కావాల్సిన పదార్థాలు: అటుకులు-ఒక కప్పు, పాలు-అర లీటర్, చక్కెర-సగం కప్పు, నానబెట్టిన సగ్గుబియ్యం-సగం కప్పు, డ్రై ఫ్రూట్స్-కొద్దిగా, యాలకులపొడి-ఒక చెంచా, నెయ్యి-రెండు చెంచాలు, తురిమిన బాదం-కొద్దిగా, బెల్లం చిన్న ముక్క.
తయారీ విధానం: ముందుగా స్టవ్ మీద పాన్ పెట్టి దాంట్లో నెయ్యి వేసుకోవాలి. నెయ్యి కాస్త వేడి కాగానే జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి వేయించుకొని పక్కన పెట్టుకోవాలి. అదే నెయ్యి లో అటుకులను వేయించుకొని పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత మరో పాత్రలో చక్కెర, యాలకుపొడి, నానబెట్టిన సగ్గు బియ్యం వేసి మరిగించుకోవాలి. పాలు మరిగాక దాంట్లో అటుకులు, కొద్దిగా బెల్లం ముక్క, వేయించుకున్న డ్రై ఫ్రూట్స్, తురిమిన బాదం వేసుకుంటే సరిపోతుంది. కమ్మగా ఉండే అటుకుల పాయసం రెడీ!

పోహా వడలు...

కావాల్సిన పదార్థాలు: అటుకులు-రెండు కప్పులు, నానబెట్టిన శనగ పప్పు-ఒక కప్పు, ఉప్పు-రుచికి తగినంత, పచ్చిమిర్చి-నాలుగు, అల్లం ముద్ద-కొద్దిగా, జీలకర్ర-ఒక చెంచా, ఉల్లిముక్కలు-ఒక కప్పు, కారం-ఒక చెంచా, పసుపు-సగం చెంచా.



తయారీ విధానం: నానబెట్టుకున్న శనగ పప్పులో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర వేసి మెత్తగా గ్రైండ్ చేసుకొని దాంట్లో నానబెట్టుకున్న అటుకులను, ఉల్లిగడ్డ ముక్కలు, పసుపు, ఉప్పు, కారం వేసి మరోసారి వడల పిండిలాగా కలుపుకోవాలి. చివరగా స్టవ్ మీద పాత్ర పెట్టి దాంట్లో నూనె పోసుకొని వడలను దోరగా వేయించుకుంటే సరిపోతుంది. అటుకులతో తయారు చేసుకున్న వడలు రుచిగా ఉంటాయి.



కొన్ని మార్పులు...

ఒంటరితనం అనేది మానసిక సమస్యల్లో ఒకటి. ఇంటి పనులు, ఆఫీసు పనులు, పిల్లల చదువులు, ఆర్థిక పరిస్థితులు ఇలా ఒక్కటేమిటి అన్నింటిని అధికమించు కుంటూ ముందుకెళ్ళాలంటే ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కొన్నిసార్లు ఏది చేతకాక ఒంటరిగా ఉండాలనిపిస్తోంది.
ఒంటరి తనం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి భౌతిక ఒంటరితనం అంటే చుట్టూ ఎవరు లేకుండా ఒక్కరే ఇంట్లో ఉండటం. దీన్నే భౌతిక ఒంటరితనం అంటారు.
రెండవది మానసిక ఒంటరితనం అంటే చుట్టూ మనుషులు ఉండి కూడా మానసికంగా ఒంటరితనాన్ని అనుభవించడం. ఒంటరితనం అనేది అతి పెద్ద మానసిక సమస్య. ఈ బాధ నుంచి బయట పడటం అంటే అంతతేలిక కాదు.
ప్రతి ఒక్కరు ఏదో ఓ సందర్భంలో ఒంటరితనాన్ని అనుభవించే ఉంటారు. అయితే ఒంటరితనం నుంచి బయటపడాలంటే జీవన శైలిలో కొన్ని మార్పులు తప్పని సరి! దాంతో పాటు కొన్ని సూచనలను క్రమం తప్పకుండా పాటిస్తే ఒంటరితనానికి కాస్త దూరంగా ఉండవచ్చు. ఒంటరితనం అనే భావన వెంటాడుతుంటే వెంటనే స్నేహితుల దగ్గరకు వెళ్లి మాట్లాడండి. ప్రతి విషయాన్ని సానుకూల ఆలోచించండి. ఎవరన్న మంచి పని చేస్తే ప్రోత్సహించండి. దానిలోని లోపాలను, తప్పులను వెతకకుండా ఉండటం మంచిది. దాంతో పాటు అభిరుచులను, ఆసక్తులను ఎప్పటికప్పుడు వ్యక్తం చేస్తూ ఉండాలి. లేదంటే ఒక రకమైన ఒత్తిడికి గురవుతారు. ప్రతిరోజు వ్యాయామం, పోషకాహారం తప్పకుండా తీసుకోవాలి. అలాగే కుటుంబ సభ్యులతో శుభాకార్యలకు, స్నేహితులతో కలిసి టూర్‌కు వెళ్లడం, సినిమాలకు వెళ్లడం వంటివి చేయండి. నలుగురితో కలిసే సందర్భాలు ఒంటరితనాన్ని దూరం చేస్తాయి. ❄



వివక్షను ఎదిరించి..

ఒక వ్యక్తికి ఉద్యోగం పోతే ఆ వ్యక్తి కుటుంబం ఇబ్బందులు పడుతుంది. ఒక సంస్థ మూతపడితే.. అందులో పనిచేసే వందలాది మంది కార్మికుల కుటుంబాలు వీధిన పడుతాయి. తండ్రి ఉద్యోగం పోయినప్పుడు తమ కుటుంబం పడిన బాధ ఆమెకు మార్గదర్శకమైంది. ఖాయిలా పడిన పరిశ్రమలను తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా పనిచేస్తూ.. కూలీ నుంచి కోటీశ్వరురాలిగా ఎదిగారు. కష్టాన్ని నమ్ముకోవడంతో పాటు సకాలంలో స్పందించడం.. తోటి వారికి అండగా ఉండటం ఎంతో ముఖ్యమని ఆమె అంటారు. పేదరికం, కులవివక్ష, ఆడపిల్ల అణిగి ఉండాలన్న సామాజిక కట్టుబాట్ల నుంచి బయటపడిన ఆమె కేంద్రప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు అందుకునే వరకు ఎదిగారు. కష్టాలను పరిచయం చేసే జీవితం వాటిని ఎదిరించి నిలబడినప్పుడు ఎన్నో విజయాలు వరిస్తాయని నిరూపించారు. ఆమే కల్పనా సరోజ్. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమె మానవితో పంచుకున్న ముచ్చట్లు..

విదర్భ మా సొంత ఊరు. దళితుల కుటుంబంలో పుట్టాను. నాన్న పోలీస్ కానిస్టేబుల్. అమ్మ హౌజ్‌వైఫ్. మొత్తం ఆరుగురు పిల్లల్లో నేను మూడోదాన్ని. పోలీసు క్వార్టర్స్ లో ఉండేవాళ్లం. కులాల కంచె క్వార్టర్స్‌లో కనిపించేది. అయితే ఇండ్ల మధ్యన కాకుండా మనషుల మధ్య ఈ కంచె ఉండేది. ఇంటి చుట్టూ ఉన్న పిల్లలు, బడిలో పిల్లలు నాతో కలిసి ఆడుకోవడానికి వాళ్ల పెద్దవాళ్లు అనుమతిచ్చేవారు కాదు. బడిలో నన్ను వేరుగా కూర్చోబెట్టేవారు. చదువంటే ఎంతో ఇష్టమున్నా.. అక్కడి వాతావరణం నాకు చదువుపై ఆసక్తిని తగ్గించింది. ఏడో క్లాస్‌లో ఉన్నప్పుడే పెండ్లీ చేశారు.

నేను పుట్టి పెరిగిన సామాజిక వాతావరణంలో బాల్య వివాహం అతి సాధారణం. పన్నెండుమంది ఉంటే ఉమ్మడి కుటుంబంలో ఇంటి పనంతా నేనే చేయాల్సివచ్చేది. క్షణం తీరకలేని జీవితంలో మానసిక వేధింపులు. ఇంటెడు చాకిరీ చేసినా.. ఏదో ఒక వంకతో దెబ్బలు పడేవి. మానసికంగా, శారీరకంగా చిత్రవధ. పెండ్లైన ఆరునెలలకు నన్ను చూడడానికి మా నాన్న వచ్చారు. చిక్కి సగమైన నన్ను చూసి ఆయన పరిస్థితి అర్థం చేసుకున్నారు నన్ను తనతో పాటు ఇంటికి తీసుకువచ్చారు. అత్తవారింటి నుంచి వచ్చేయడం మా కుటుంబానికి, సామాజిక వర్గానికి తలవంపులు తెచ్చినట్టుగా కులపెద్దలు భావించారు. ఆధునిక భావాలతో పెంచిన మా నాన్నకు బరువు కాకూడదని నిర్ణయించుకుని .. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాను. కానిస్టేబుల్ సెలక్షన్‌కు వెళ్లాను. నర్స్ శిక్షణకు దరఖాస్తు చేశాను. ఏడో తరగతితోనే చదువులు ఆపేయడంతో ఏ ఉద్యోగం రాలేదు. నాన్న నన్ను మళ్లీ బడికి వెళ్లమని ప్రోత్సహించారు. ఆయన ఇచ్చిన ధైర్యంతో చదువుకునే ప్రయత్నం చేశాను. ఇంటి నుంచి కాలు బయట పెట్టగానే అవమానాలు, ఈసడింపులు కుంగదీసేవి. దాంతో ఇంట్లోనే ఉండి టైలరింగ్ నేర్చుకుని జాకెట్లు కుట్టేదాన్ని. ఒక్క జాకెట్‌కు పదిరూపాయలు వచ్చేవి. నా కాళ్లపై నేను నిలబడి ఇంటికి ఆసరాగా ఉన్నా..చుట్టూ ఉన్నవారి సూటిపోటి మాటలు మాత్రం తగ్గలేదు.. మరింత ఎక్కువయ్యాయి. ఈ బాధలు భరించలేక ఆత్మాహత్యాయత్నం చేశాను. ఆసుపత్రిలో చేర్చారు. ప్రాణాలతో బయటపడ్డాను. చావును దగ్గరగా చూసిన నేను కుమిలిపోతూ జీవితాన్ని వథా చేసుకోవద్దని నిర్ణయించుకున్నాను.

అమ్మానాన్నలకు నచ్చజెప్పి, ముంబయిలోని చిన్నాన్న దగ్గరకి వెళ్లాను. టైలరింగే ఆధారమైంది. కొన్ని కారణాలతో నాన్న ఉద్యోగం పోయింది. దాంతో కుటుంబానికి అండగా ఉన్నాను.

ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకుని, మహాత్మా జ్యోతిభాయి పూలే పథకానికి రుణం కోసం దరఖాస్తు చేశాను. ఫర్నీచర్ వ్యాపారాన్ని ఆరంభించాను. ముడిసరుకులు ఎక్కడ దొరుకుతాయి, ఎంత ధరకు అమ్మితే లాభాలు వస్తాయి.. వంటి అంశాలను నేర్చుకుంటూ మార్కెట్ పై అవగాహన పెంచుకున్నాను. లెటెస్ట్‌గా వస్తున్న ట్రెండ్స్ గుర్తిస్తూ.. నాణ్యతతో కూడిన ఫర్నీచర్ వినియోగదారులకు అందించడం మొదలు పెట్టాం. దాంతో చాలా తక్కువ సమయంలోనే మంచి పేరు వచ్చింది. నేను తెలుసుకున్న అంశాలను నాలాంటి మరెందరికో తెలియచేసేలా ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాను. ప్రభుత్వ రుణ పథకాల గురించి, చిన్నతరహా పారిశ్రామికరంగంలో మహిళ కోసం బ్యాంకులు ఇస్తున్న రుణాల గురించి సమాచారం సేకరించి ఔత్సాహిక వ్యాపారవేత్తలకు వివరంగా చెప్పేదాన్ని. వ్యాపార, పరిశ్రమ రంగాల్లోకి వచ్చేవారికి తగిన సమాచారాన్ని అందిస్తూ.. వార స్వయం సమ ద్ధి సాధించేలా ప్రోత్సహించేదాన్ని.

ఫర్నీచర్ వ్యాపారాన్ని విస్తరించడానికి బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు తీరిన తర్వాత మరో వ్యాపారం ప్రారంభించాలనుకున్నాను. ఇలా లోగా వివాదాల్లో చిక్కుకున్న భూమిని తక్కువ ధరకు ఆ భూమి యజమాని అమ్మేస్తున్న విషయం తెలిసింది. ఆ భూమిని కొనడంతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. కోర్టు నుంచి తీర్పు నాకు అనుకూలంగా రావడంతో కాస్త వెసులుబాటు లభించింది. అయితే కోర్టు చుట్టూ తిరిగే సమయంలో చట్టం గురించి అనేక విషయాలను తెలుసుకోగలిగాను.

ప్రముఖ వ్యాపారవేత్త రాంజీభాయ్ కమానీ పరిశ్రమలు కొన్ని వివాదాల్లో చిక్కుకున్నాయి. అప్పటికే రెండు సంస్థలు మూత పడ్డాయి. మరోసంస్థ మూసేయడానికి సిద్ధంగా ఉంది. అక్కడ పనిచేసే కార్మికులు నా వద్దకు వచ్చారు. వివాదస్పద భూమిలో కేసు గెలవడంతో చాలామంది మా ఎన్జీవో వద్దకు తమ సమస్యల పరిష్కారం కోసం, సహాయం కోసం వచ్చేవారు. అలాగే కమానీ కంపెనీల కార్మికులు వచ్చారు. కంపెనీని నిలబెట్టి తమ జీవితాలు రోడ్డునపడకుండా చూడాలని కోరారు. ఆ కంపెనీ మూత పడితే 566 కుటుంబాలు రోడ్డున పడతాన్న విషయం చాలా బాధ కలిగించింది. మా నాన్న ఉద్యోగం పోయినప్పుడు మేం పడిన బాధ మరే కుటుంబానికి రాకూడదని పించింది.

నాకు తెలిసిన కొంతమంది నిపుణులను ఒక కమిటీగా నియమించి.. ఆ కంపెనీని రక్షించడానికి తీసుకోవల్సిన చర్యలను పరిశీలించమని చెప్పాను. సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించినందున బ్యాంకర్లతో మంచి పేరు ఉండేది. దాంతో మాకు సహాయం చేయడానికి వారుకూడా ముందుకు వచ్చారు. అందరి సహకారంతో.. బోర్డు ప్రెసిడెంట్ అయ్యాను.

ఆరేండ్ల పాటు కోర్టు చుట్టూ తిరిగి, ప్రభుత్వం నుంచి అనుమతి, బ్యాంకుల నుంచి వడ్డీ వెలుసుబాటు తీసుకువచ్చి కార్మికుల జీవితాలను నిలబెట్టాం. కమానీ ట్యూబ్స్ కంపెనీ పని ప్రారంభించడంతో కార్మికులు ఎంతో సంతోషపడ్డారు. సంస్థ బాధ్యతలను కోర్టు నాకు ఇస్తూ.. ఏడేళ్లలో బ్యాంకు రుణాలు చెల్లించాల్సిందిగా ఆదేశించారు. కార్మికుల సహకారంతో బ్యాంకు రుణాలను ఏడాదిలోపలే చెల్లించేశాం. ఇప్పుడు మూతపడిన మరో రెండు సంస్థలను స్వాధీనం చేసుకుని కార్మికులకు ఉపాధి కల్పించే పనితో బిజీగా ఉన్నాను. ❄

వంటగదిలో బొద్దింకల బెడద ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా చేసి చూడండి. బిర్యానీ ఆకును పౌడర్‌గా చేసి బొద్దింకలు వచ్చే ప్రదేశంలో చల్లండి. ఆ వాసనకే బొద్దింకలు చనిపోతాయి.
- ⇔ వంటగదిలో చీమలు ఎక్కువగా ఉంటే దోసకాయను ముక్కలుగా కట్ చేసి చీమలు తిరిగే చోట ఉంచండి.
- ⇔ కూరల్లో మసాలా ఎక్కువైతే రెండు లేదా మూడు టమాటాలను ఉడికించి అందులో కలపండి. మసాలా ఘాటు తగ్గి మంచి రుచి వస్తుంది.
- ⇔ చెక్క చెంచాలు, పాత్రలు వాసన వేస్తుంటే వాటిని వెనిగర్ కలిపిన నీటిలో పది నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత శుభ్రంగా కడిగి వాడుకుంటే సరిపోతుంది. చెక్క వస్తువులకు ఉండే వాసన పూర్తిగా తొలగిపోతుంది.
- ⇔ వంట చేసేటప్పుడు చేతులు కాలితే వెంటనే ఆలుగడ్డ ముక్కలతో రుద్దితే మంచి ఫలితం కనిపిస్తుంది.

సింపుల్ టిప్స్...



- ⇔ గులాబ్ జామ్ తయారు చేసేందుకు పిండి కలిపేటప్పుడు పిండిలో కాస్త పన్నీర్ కలపండి. అవి మృదువుగా రుచిగా ఉంటాయి.
- ⇔ చపాతీ పిండిలో కొన్ని పాలు లేదా గోరువెచ్చని నీళ్ళు లేదా కాస్త నూనె కలిపి గంటపాటు నానబెడితే చపాతీలు మృదువుగా వస్తాయి.
- ⇔ చపాతీ పిండిలో ఉడికిన బంగాళదుంపను బాగా కలిపి, ఆ పిండితో చపాతీలు చేస్తే, చపాతీలు మృదువుగా ఎక్కువ సేపు ఉంటాయి.
- ⇔ చపాతీలు వత్తేటప్పుడు మధ్యలో కాస్త నూనెవేసి మడతలతో చేసి హాట్ ప్యాక్‌లో ఉంచితే 6 నుండి 7 గంటలపాటు మెత్తగా ఉంటాయి.
- ⇔ రాగి పాత్రలు నల్లబడితే నిమ్మరసం చల్లి ఉప్పుతో రుద్దితే కొత్త వాటిలా మెరిసిపోతాయి.
- ⇔ బియ్యం, తృణ ధాన్యాలను నిల్వ ఉంచిన డబ్బాలో నాలుగు పసుపు కొమ్ములు లేదా వెల్లుల్లి రెబ్బలు వేస్తే పురుగు పట్టకుండా ఉంటాయి.
- ⇔ కూరలో ఉప్పు ఎక్కువైతే కాస్త బియ్యపిండి కలిపితే సరిపోతుంది. దోశల పిండి బాగా పులిస్తే అందులో రెండు చెంచాల గోధుమ పిండిని కలిపితే దోశలు రుచిగా వస్తాయి. ❄

బాల్యానికి భరోసా కావాలి


సిలువేరు హరినాథ్

నేటి బాలలే రేపటి పౌరులు. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దినప్పుడే వారు సమాజానికి ఒక నిధిగా భవిష్యత్తులో ఉపయోగపడుతారు. అలాంటి బాలలను మన పాలకులు ఏ మేరకు రక్షిస్తున్నారు? ఎంతవరకు వారికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తున్నారనేది ప్రశ్న. బాలల రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగ హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం వల్ల నేడు వారిపై అనేక అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మనదేశం ముందు వరుసలో ఉన్నప్పటికీ బాలల విషయంలో ఎలాంటి పురోగతీ సాధించలేకపోతున్నది. గత పంచవర్ష ప్రణాళికలో బాలల కోసం ప్రత్యేక ప్రణాళికలు పొందుపర్చినా అవి ఆచరణలో అమలు కాకపోవడం వల్ల బాలలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న మన దేశాన్ని దారిద్ర్యం ఇంకా పట్టి పీడుస్తుంది. సంక్షోభం, పేదరికం వంటి సమస్యలతో సతమతమవుతున్న ఉత్తర కొరియా, బంగాదేశ్ లాంటి దేశాల కంటే భారత్‌లోనే ఆకలి తీవ్ర రూపం దాల్చుతుందని అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ ఇటీవల విడుదల చేసిన 2015-16 ప్రపంచ ఆకలి సూచిక నివేదికలో స్పష్టంగా పేర్కొంది. 2008 నుండి గత ఏడాది వరకు ఆకలి సూచికలో భారత్ ప్రమాణాలు దిగజారుతూ వస్తున్నాయి. తొమ్మిదేండ్ల కిందట 35.6 పాయింట్లతో ఉన్న భారత్ ఇప్పుడు 31.4 పాయింట్లకు పతనమైంది. ఆ స్కోరు 28.5కి చేరితే మాత్రం ఆందోళనకరణమైన విషయంగా పరిగణించాల్సి ఉంటుంది.

పౌష్టికాహార లోపంతో భారతదేశంలో వందమంది చిన్నారుల్లో 38.7 శాతం మంది ఎలాంటి ఎదుగుదల లేకుండా బతుకు పోరాటం చేస్తున్నారు. అత్యంత వెనుకబడిన దేశాలకంటే మనదేశంలోనే చిన్నారుల ఎదుగుదల ప్రశ్నార్థకంగా ఉంది. ప్రపంచంలో 152 దేశాల్లో పిల్లల ఎదుగుదలలో లోపాలు ఉంటే అందులో భారత్ 114వ స్థానంలో ఉంది. అంగన్‌వాడి, పౌష్టికాహార కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. చిన్నారి శరీరాలకు అవసరమైన సూక్ష్మపోషకం అయోడిన్. అది సరైన స్థాయిలో లభించక అనారోగ్యం బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతుందని అయోడిన్ లోపం క్రమరాహిత్యం నియంత్రణ సర్వేలో స్పష్టమైంది. ప్రపంచవ్యాప్తంగా ఆడపిల్లల జననాలు భారీగా తగ్గిపోతున్నాయి. భారతదేశంలో గత 50 ఏండ్లలో ఎన్నడూ లేనంతగా ఆడశిశు జననాలు తగ్గడం ఆందోళన కల్గిస్తున్న అంశం. దేశ రాజధాని మొదలుకొని ఈశాన్య రాష్ట్రాల దాకా అన్నిచోట్ల ఇదే పరిస్థితి. దేశంలో ఆరేండ్ల లోపు 1000 మంది బాలురకు 914 మంది బాలికలు ఉన్నారంటే ఎంతటి వ్యత్యాసం ఉందో అర్థం చేసుకోవచ్చు. 2001 నుండి 2011 మధ్య కాలంలో 5.05 మిలియండ్ల పిల్లలు 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గలవారు తగ్గిపోవడం జరిగింది. అందులో 2.06 మిలియన్లు మగపిల్లలు కాగా 2.99 మిలియన్లు ఆడపిల్లలు ఉన్నారు. అంటే 0.93 మిలియన్ల ఆడపిల్లలు తగ్గిపోయారు. ఈ వ్యత్యాసం ఇంత దారుణంగా ఉండటానికి అనేక కారణాలున్నాయి. ఆర్టికల్ 47లో నిర్దేశించినట్టుగా ప్రజా ఆరోగ్యాన్ని కాపాడి జీవనప్రమాణం పెంచడానికి మంచి పోషన ఆహారం అందించాలి. కానీ అలా చేయకపోవడం వల్ల బాలల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయి. భారత ఆరోగ్య శాఖ 2016-17 గణాంకాల ప్రకారం దేశంలో పుట్టిన ప్రతి వెయ్యిమంది చిన్నారుల్లో 48 మంది ప్రతిరోజూ మరణిస్తున్నారు. అలాగే ఐదేండ్ల లోపు చిన్నారులు ప్రతి ఏటా సుమారు 1,26,000 మంది చనిపోతున్నారు. దేశంలో 21 లక్షల మందికి ఎయిడ్స్ రోగం ఉంటే అందులో 13 లక్షల మంది బాధితులు చిన్నారులే! ప్రజా ఆరోగ్యం మెరుగుపడేందుకు నేషనల్ పాపులేషన్ పాలసీ (2000), నేషనల్ హెల్త్ పాలసీ (2002), నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (2015-17), పన్నెండవ పంచవర్ష ప్రణాళిక (2012-17)లో అనేక సంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది.

దేశంలో 12-18 సంవత్సరాల వయస్సుగల వారిలో ప్రతి ఇద్దరు బాలికల్లో ఒకరు లైంగిక వేధింపులకు గురవుతున్నట్టు వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ తన సర్వేలో నిగ్గు తేల్చింది. దేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక బాలిక తప్పిపోతున్నట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ గత ఏడాది జనవరిలో ప్రకటించింది. ఇంతవరకు కొన్ని లక్షల మంది ఈ విధంగా వంచనకు గురై ఉంటారని కార్మిక సంస్థ అభిప్రాయపడింది. జాతీయ నేరాల నమోదు సంస్థ వివరాల ప్రకారం 2014లో మనుషుల అక్రమ రవాణా కేసులు 2014లో 5466 నమోదు కాగా 2015లో 6857 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అస్సాంలో నమోదు కాగా తరువాతి స్థానంలో పశ్చిమబెంగాల్ ఉంది. మనుషుల అక్రమ రవాణా భారత్‌లో ఒక వ్యాపార రూపంలో కొనసాగుతున్నది. ముఖ్యంగా 76 శాతం లైంగిక సంబంధిత నేరాలే. అందులో ముఖ్యంగా యుక్తవయస్సు నిండని బాలికలే అత్యధికులు. అంతేకాదు దేశంలో వెట్టిచాకిరి కింద అనేక మంది బాలికలు నలిగిపోతున్నారు. 2016లో వెలువడిన ప్రపంచ బానిసత్వ నివేదిక ప్రకారం భారత్‌లో బాలికలు అత్యధికంగా బానిస జీవితాలు గడుపుతున్నట్లు స్పష్టమైంది. 1.3 బిలియన్ జనాభాలో 18.35 మిలియన్ జనాభా వెట్టి చాకిరిలోనే మగ్గిపోతున్నారు. 1.2 మిలియన్ల బాలికలు బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టివేయబడుతున్నారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

అంతర్జాలం వేదికగా బాలలపై జరుగుతున్న వేధింపులు తక్కువేమీ కాదు. దేశవ్యాప్తంగా మూడు కోట్ల మంది బడికెళ్లే పిల్లలు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నట్లు ఒక సర్వేలో వెల్లడైంది. సాంకేతిక ఆసరా చేసుకొని కొంతమంది లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. బ్లూవేల్ ఆన్‌లైన్ క్రీడ ద్వారా ఎంతోమంది బాలలు ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది. అమెరికా వంటి దేశంలో పిల్లలపై ఆన్‌లైన్ ద్వారా జరిగే వేధింపులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు విభాగాలు ఉన్నాయి. మన దేశంలో 2012లో ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్ చట్టాన్ని తీసుకొచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. జాతీయ నేర సంస్థ 2015 గణాంకాల ప్రకారం గతంలో ఎన్నడూ లేని విధంగా బాలలపై నేరాలు పెరిగిపోతున్నాయి. దేశంలో 2013లో 58,224 మంది బాలలపై వివిధ రకాల అఘాయిత్యాలు జరిగితే 2015లో ఈ సంఖ్య 94,172కి చేరింది అంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇందులో ప్రధానంగా 10,854 మంది చిన్నారులపై అత్యాచారాలు జరిగాయని, అలాగే 4,358 మంది అపహరణకు గురయ్యారని కేసులు నమోదయ్యాయి. అంటే పోలీసు వ్యవస్థ చిన్నారుల రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనేది అర్థమవుతుంది. 2015లో పోలీసులు కేవలం 27.36 శాతం మంది నేరస్థులను మాత్రమే తమ కస్టడీలోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టగా 20.21 శాతం మంది నేరస్థులకు కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. అంటే న్యాయస్థానాలు కూడా కఠిన సత్వర పరిష్కారం చూపక, నేరస్థులకు శిక్షలు పడకపోవడం వల్ల నేరస్థులకు భయం లేకుండా పోవడమే కాకుండా మరిన్ని అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. మరోవైపు విద్యా హక్కు చట్టం 2010 నుండి ఉన్నప్పటికీ విద్యారంగ అవకాశాలు బాలలకు అందని ద్రాక్షగా మిగిలాయి. ఎఎస్ఇఆర్ 2016 రిపోర్టు ప్రకారం పాఠశాలల స్థాయిలో 96.6 శాతం ఎన్‌రోల్‌మెంట్ నమోదు కాగా బాలిక డ్రాపౌట్ పరంపర కొనసాగుతూనే ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో 9.9 శాతం, రాజస్థాన్‌లో 9.7 శాతం, మధ్యప్రదేశ్‌లో 8.5 శాతం మేర బాలికలు బడికి దూరంగా ఉన్నారు. వీరికి పేదరికం తోడై బాలకార్మికులుగా మారిపోయి వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1986 చైల్డ్ లేబర్ యాక్ట్‌ను నిర్వీర్యం చేయడం వల్ల బాల్యం లేని వయస్సులోనే చితికిపోతున్నది. తప్పిపోయిన బాలబాలికలను రక్షించేందుకు కేంద్రప్రభుత్వం 2015లో హోంశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ ప్రారంభించింది. ఇది ఆయా రాష్ట్రాల సహకారంతో మంచి ఫలితాలు ఇస్తున్నది. ఇప్పటివరకు సుమారు 70 వేల మంది తప్పిపోయిన బాలబాలికలను రక్షించినట్లు హోంశాఖ ప్రకటించింది. అదే తెలంగాణలో ఆపరేషన్ స్మైల్ కింద 4,033 మందిని, ముస్కాన్ ఆపరేషన్ కింద 2,496 మంది బాలబాలికలను రక్షించడం జరిగింది. వీరిలో అత్యధికులు ఒరిస్సా, బీహార్, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వారిగా గుర్తించారు అధికారులు. అందుకు నూతన ప్రణాళికలు తయారు చేయడమే కాకుండా తప్పకుండా పాటించాలి. అప్పుడే వారికి భరోసా దొరుకుతుంది.

సెల్ : 9949030630

సమాన విద్య కోసం పోరాడుదాం


వలిగి కృష్ణ

'ఉదయించే సూర్యకాంతిని అరచేతిని అడ్డుపెట్టి ఆపగలం అనుకోవడం ఎంత సత్యదూరమో, అట్లాగే చరిత్రలో తొక్కిపెట్టిన వాస్తవాలను బయటకు తీయలేరు అనే మాట కూడా అంతే సత్యదూరం." వక్రీకరించబడ్డ చరిత్రను పునర్నిర్మించుకోవడం అవసరం, ఆవశ్యకం. భావవాద, బ్రాహ్మణవాద, మనువాద, భూస్వామ్య భావజాల పునాదుల పై నిర్మించబడ్డ భారతదేశ చరిత్రను పరిశీలిస్తే నాయకుల చేత బిరుదులు పొందిన మహాత్ముల చరిత్ర మాత్రమే కనిపిస్తుంది. కానీ, నిజంగా ప్రజలచేత మహాత్ములని పించుకున్న వారి చరిత్ర కనిపించదు. ఈ కోవలోకి చెందిన వారే సావిత్రిబాయి పూలే, వారి సహచరుడైన మహాత్మా జ్యోతిబాపూలేలు. 19వ శతాబ్దం తొలినాళ్లలో చాతుర్వర్ణ వ్యవస్థలోని నాలుగో వర్ణమైన శూద్రులకు, తర్వాత కాలంలో సష్టించబడ్డ పంచములకు (అస్పృశ్యులు), మహిళలకు (అగ్రవర్ణ మహిళలకు కూడా) విద్య నిషేధంగా ఉండేది. అదే సమయంలో ఆంగ్లేయులు వారి పాలనా సౌలభ్యం కోసం భారతదేశంలోని ముఖ్యమైన ప్రాంతాలలో మిషనరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆ పాఠశాలల్లో శూద్రులు కూడా చదువుకున్నారు. అట్లా ఉద్భవించినవాడే మహాత్మా జ్యోతిబాపూలే. మహాత్మా జ్యోతిబాపూలే తన చిన్నతనం నుండే చదువుపట్ల శ్రద్ధ వహిస్తూనే సమాజంలోని అసమానతలను, వివక్షను, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ ప్రశ్నించాడు. ఆధునిక భారతదేశంలో సావిత్రిబాయిపూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారు. ఆ విధంగా పూలే దంపతులు బాలికా విద్యకు శ్రీకారం చుట్టినప్పుడు ఆనాటి సమాజంలోని అన్ని వర్గాలనుండి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. హెచ్చరికలు, బెదిరింపులు చేశారు. సావిత్రీ బాయిపూలే పాఠశాలకు వెళ్లే క్రమంలో మనువాద బ్రాహ్మణులు దళిత మహిళలకు చదువు చెప్పడమేంటని ఆమెపై రాళ్లు, చెప్పులు, పేడతో దాడులు చేశారు. అవమానించారు, కించపరిచారు, దూషించారు. అయినా లెక్క చేయకుండా తమ ఆశయ సాధనలో ముందుకు నడిచారు. తదనంతర కాలంలో పూలే దంపతులు దేశ వ్యాప్తంగా యాభై రెండు పాఠశాలలు నెలకొల్పి మహిళా విద్యకు పాటుపడ్డ గొప్ప మహనీయులు. వీరు 1873లో "సత్య శోధక్ సమాజ్"ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఆనాడు సమాజంలో ఉన్న సాంఘీక దురాచారాలకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేశారు. బాల్య వివాహాలను అడ్డుకోవడం, వితంతు పునర్వివాహాలు జరిపించడం, అనాధాశ్రమాలు, వద్ధాశ్రమాలు నిర్వహించడం, అగ్రవర్ణ వితంతు బాలింతలను చేరదీసి వారికి సపర్యలు చేయడం, కరువు కాటకాలు సంభవించినప్పుడు ప్రజలకు ఆహార పదార్థలు అందివ్వడం వంటి కార్యక్రమాలు చేశారు. ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన బిడ్డను (యశ్వంత్) దత్తత తీసుకొని ఉన్నత చదువులు చదివించి డాక్టరును చేశారు. మహిళలు సంఘబానిసలుగా జీవించక తప్పని కాలంలో తన స్వరాన్ని వినిపించిన ధీరురాలు సావిత్రిబాయి పూలే. నేటి మహిళలకు ఆమె ఒక స్ఫూర్తి. సావిత్రిబాయి పూలే స్వతహాగా రచయిత్రి. తన కలం, గళం ద్వారా ఎన్నో రచనలు, కవితలు, వ్యాసాలు, పుస్తకాలు, ఉపన్యాసాలు రాసి, మాట్లాడి సమాజాన్ని మేల్కొలిపారు. 1897లో పూణేలో అంటువ్యాధులు విజంభించినప్పుడు రోగులకు సేవ చేయడంలో సావిత్రిబాయి రాత్రింబవళ్లు పనిచేసింది. ఆ పనిలో భాగంగా ప్లేగువ్యాధి సోకి చివరికి 1897 మార్చి 10న ఆమె మరణించారు. పూలే దంపతులు శతాబ్దం క్రితం ప్రారంభించిన సంస్కరణోద్యమం దళితుల్లో, మహిళల్లో కొంతమేరకు చైతన్యం, మార్పు తీసుకొచ్చినప్పటికీ మనువాద భావజాలం నిండిన భారత సమాజంలో దళితులకు, మహిళలకు హక్కులుంటాయా? అంటూ అణిచివేతకు గురిచేస్తున్న ఆధిపత్య వర్గాలకు పాలకవర్గాలు కొమ్ముకాస్తూ, హక్కులను హరించివేస్తూ పాలన కొనసాగిస్తున్నారు. పూలే దంపతుల ఉద్యమానికి కొనసాగింపుగా డా॥ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగ కమిటీ అధ్యక్షుడిగా దళితులకు, వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగంలో వారి హక్కులకు ఎన్నో రక్షణ అవకాశాలు పొందుపరిచారు. కానీ, వాటి అమలు విషయంలో మన పాలకులు "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు" అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. దీనికి చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ బిల్లు 2008 నుండి నానుతూ వస్తుంది. దీనిని బట్టి మహిళలపట్ల మన పాలకులకు ఉన్న చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. 19వ శతాబ్దంలో పూలే దంపతులు ఏ వివక్షకైతే వ్యతిరేకంగా పోరాడారో, ఏ నూతన సమాజం కోసం పరితపించారో అవే వివక్షలు నేడు 21వ శతాబ్దంలో కూడా కొనసాగుతున్నా పూలే దంపతులు కోరుకున్న వివక్షలు లేని సమాజం, అసమానతలు లేని సమాన విద్య, సమాన గౌరవం నేడు కనిపించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కులాలకు, మతాలకు, వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరికీ ఒకేరకమైన, నాణ్యమైన విద్య అందుతుందని ఆశపడ్డాం. కానీ, ఆశాభంగమే మిగిలింది. ఒక ఆదర్శవంతమైన విద్యావిధానం వస్తుందనుకుంటే దానికి భిన్నంగా కులాల పేరుతో, మతాల పేరుతో గురుకులాలు వెలిశాయి. ఒక విద్యావిధానంలోనే కాదు సమాజంలోని ప్రజల మధ్య కులాల విభజన, కులాలతో వృత్తుల విభజన జరుగుతున్నది. ఇది సమాజానికి క్షేమకరం కాదు, శ్రేయస్కరం కాదు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం ఉధతంగా నడుస్తున్నప్పుడు ప్రపంచమే ఆశ్చర్యపోయేలా "కేజీ టు పీజీ" విద్యను కులాలకు, మతాలకు, వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని ఊదరగొట్టారు. ఈ విషయంలో తెలంగాణ సమాజం మోసపోయింది. మోసగించబడింది. భూస్వామ్య భావజాలం ఉన్నవారెవరైనా సమానత్వం గురించి ఆలోచించరు. ఆ కోవకు చెందిన కేసీఆర్ మాత్రం ఎందుకు ఆలోచిస్తాడు. అందరినీ ఒకే దగ్గర కూర్చోబెట్టి, ఒకేరకమైన చదువును చెప్పించడం అధిపత్య వర్గాలకు వ్యతిరేకం. అందుకే ఉపాధ్యాయ మిత్రులారా, మేధావుల్లారా ఒక్కసారి ఆలోచించండి. ఉపాధ్యాయుడనేవాడు "సామాజిక వైద్యుడు. సమాజ పునర్నిర్మాత." పాఠశాల ఒక సామాజిక వైద్యశాల. అక్కడే సమాజంలో ఉండే అన్ని రకాల వివక్షలు, అసమానతలు, మూఢనమ్మకాలు అనే రుగ్మతలకు ఉపాధ్యాయుడనే వైద్యుడు సరైన మందులు వేసి వాటిని నయం చేయాలి. తద్వారా ఒక నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, సమాజ మార్పును కోరే మేధావులుగా, మనం పూలే దంపతుల స్ఫూర్తిగా అసమానతలు లేని, వివక్షల్లేని హక్కులకు, ఆదర్శవంతమైన, ఆచరనీయమైన, నాణ్యమైన గుణాత్మక విద్యకు, అసమానతలు లేని సమాజం కోసం పాటుపడుదాం. సమాన విద్య(కామన్ స్కూల్ విద్యావిధానం) కోసం పోరాడుదాం. మహనీయుల ఆశయాల బాటలో పయనిద్దాం.

సెల్ : (9490411831)

గల్ఫ్ బాధితుల కన్నీటి గాధలు తుడిచేదెవరు?


దామరపల్లి నర్సింహ్మారెడ్డి

పల్లె తరిమింది. గల్ఫ్ రమ్మంది. ఉన్న ఊర్లో బతుకుదెరువు కరువై జానెడు పొట్టను నింపుకోవడానికి గల్ఫ్ దేశాలకు వలసెళ్లిన కార్మికుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తెలంగాణ వచ్చి మూడున్నర ఏండ్లు గడిచినా ఇంత వరకు గల్ఫ్ బాధిత కుటుంబాలలో వెలుగులు నింపలేదు. తెలంగాణ పల్లెల నుంచి వలసలు ఆగలేదు. నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో యువత గల్ఫ్ దేశాలలో అత్యంత దయనీయమైన దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. ఇక్కడి నుంచి గల్ఫ్ వెళ్లడానికి లక్షల్లో అప్పులు చేసి, వాటిని తీర్చలేక, నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు వేలాది కుటుంబాలు వీధులపాలయ్యాయి. మరికొంతమంది గల్ఫ్ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గల్ఫ్ ఏజెంట్ల విజిటింగ్ వీసాలు తెప్పించి కంపెనీ వీసాలుగా నమ్మించి ఇక్కడి నుంచి అక్కడికి పంపించడంతో నకిలీ వీసా కింద అరెస్టు అయ్యి 2017 జనాభా లెక్కల ప్రకారం మన భారతీయులు 32 వేల మంది జైళ్లలో బిక్కుబిక్కుమంటున్నారు. గల్ఫ్ దేశాలలో ప్రధానంగా అరేబియా, బెటారన్, కలూర్, సౌదీ, మస్కట్, ఇరాన్, ఇరాక్, గయా లాంటి దేశాలలో మగ్గిపోతున్నారు. కన్న తల్లిదండ్రులకు దూరమై, భార్యా పిల్లలకు కాకుండా క్షణక్షణం నరకయాతన అనుభవిస్తున్నారు. మరికొంతమంది భారతీయుల ఆచూకీ తెలియడం లేదు. ఇంతకీ వారు బతికి ఉన్నారా? లేక చనిపోయారా? అనే సమాచారమూ లేదు. కంపెనీలలో సమాచారం తెలుసుకోవడం కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించినా సమాధానం ఇచ్చేందుకు యాజమాన్యాలు ససేమిరా అంటున్నాయి. ఇలాంటి ఘటనలు కోకొల్లాలు. జాడలు తెలియనిగల్ఫ్ బాధితుల బిడ్డల కోసం తల్లిదండ్రుల నిరీక్షణ తమ తండ్రి ఎప్పుడు తిరిగొస్తాడని పిల్లల ఎదురుచూపులు. తమ భర్త ఎలాగైనా వస్తాడా అని భార్యల అరణ్యరోదనలు. గల్ఫ్ బాధితుల కన్నీళ్లు తుడిచేదెవరు. వారి బాధలను పట్టించుకునేదెవరు. 2016 సెప్టెంబర్ 4న నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన మహేష్ ట్రావెల్స్ ఏజెన్సీ యజమాని దుబాయ్‌లో తన మిత్రుడికి అందించమని మత్తు మందు ప్యాకెట్‌ను తడపాకల గ్రామానికి చెందిన పూసల శ్రీనివాస్‌కు ఇచ్చి పంపించాడు. శ్రీనివాస్‌కు ఆ పార్సిల్‌లో ఏముందో తెలియదు. శ్రీనివాస్ తనవెంట పట్టుకెళ్లాడు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీల్లో దొరికిపోయాడు. చేయని నేరానికి ఏడేండ్లు జైలు శిక్ష విధించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోరు. ఎన్ఆర్ఐ సెల్‌కు ఫిర్యాదు చేయడంతో సీఐడీ అధికారులు కదిలారు. విచారణ జరిగింది. కానీ ఇంత వరకు ట్రావెల్స్ యజమానిపై చర్యలు తీసుకోలేదు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రవణ్ ఆరు నెలల క్రితం కలూర్ వెళ్లాడు. అక్కడ దిగగానే ఏజెంట్లు పాస్‌పోర్టును తీసుకొని కలూర్ నుంచి శ్రవణ్ పేరిట మరో వ్యక్తి భారతదేశానికి వచ్చాడు. వచ్చింది ఎవరని తెలియదు. కామారెడ్డికి చెందిన రాజేశ్వరరావు సౌదీ అరేబియా దేశానికి పని కోసం వెళ్లాడు. అక్కడ కంపెనీ యజమాని చిత్రహింసలకు గురిచేయడంతో పని మానేసి మరో చోట పని చేసుకుంటున్నాడు. ఈనేపథ్యంలో రాజేశ్వర్‌రావును అన్యాయంగా దొంగతనం కేసులో ఇరికించారు. ఇరాక్ దేశంలో ఎర్బిల్ పట్టణ సమీపం బార్డర్‌లో ఐఎస్ఐ ఉగ్రవాదులకు కురుదు బలగాలతో అంతర్యుద్ధం జరుగుతుంటుంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన 200 మంది గల్ఫ్ బాధితులు అక్కడ ఇరుక్కుపోయారు. భారత్ నుంచి ఇరాక్‌కు వచ్చారంటూ అక్కడి ప్రభుత్వాలు రూ.రెండు లక్షల జరిమానా విధించాయి. ఆ మొత్తం చెల్లించలేక ఉద్యోగం దొరకక, ఉపాధి కొరవడి స్వదేశానికి రాలేక, ఉందామంటే గూడు లేక, తినడానికి తిండి లేక రోడ్లపై అట్టముక్కలు ఏరుకుంటూ బతుకుతున్నారు.

క్షమాబిక్ష ప్రసాధించినా విడుదల కాని భారతీయులు


దసరా పండుగ పర్వదినాన 119మంది భారతీయులకు క్షమాభిక్ష ప్రసాదించి, మరో 15 మందికి మరణ శిక్ష నుంచి జీవిత ఖైదుగా మారింది. వీరంతా కువైట్ జైళ్లలో మగ్గిపోతున్నారు. 119 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు. వీరంతా డ్రగ్స్ అక్రమ రవాణా, దొంగతనం తదితర కేసుల్లో కువైట్ జైళ్లలో మగ్గిపోతున్నారు. ఇందులో 65 మంది డ్రగ్స్ కేసుల్లో అరెస్టయి కారాగార జీవితాన్ని గడుపుతున్నారు. క్షమాభిక్ష ప్రసాదించడంతో బాధితుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. కువైట్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించినా భారతీయులు విడుదల కాలేకపోయారు. క్షమాభిక్షపై విడుదలయ్యే ఖైదీల జాబితాను కువైట్ నుంచి భారతీయ దౌత్య కార్యాలయానికి పంపించినప్పటికీ భారత దౌత్య కార్యాలయం నుంచి స్పందన కొరవడింది. సరైన పత్రాలు లేక కుటుంబాల్లో ఎవరిని కలువాలో తెలియక అధికారులు పట్టించుకోకపోవడం వల్లే 119 మంది భారతీయులు కువైట్ జైలు నుంచి విడుదల కాలేకపోతున్నారు.

గల్ఫ్‌లో ఉద్యోగ సంక్షోభం

గల్ఫ్ దేశాలలో అనేక సంస్థలు నష్టాల్లో కూరుకుపోవడంతో ఉద్యోగం, ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారుతున్నారు. చమురు ధరలు అమాంతంగా పడిపోవడం వల్ల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. చమురు సంస్థలు మూతపడుతున్నాయి. పారిశ్రామిక ఉత్పత్తి సంస్థల పెట్రో గల్ఫ్ ఎల్ఎల్‌సీ ఉత్పత్తులను నిలిపేయడంతో తెలంగాణకు చెందిన మూడు వేల మంది ఉద్యోగాలు ఊడిపోయాయి. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాలకు చెందిన వారు 2009 నుంచి ఈ సంస్థలలో పని చేస్తున్నారు. వీరంతా దౌత్య కార్యాలయం సహాయంతో తిరిగి వచ్చేశారు. స్వరాష్ట్రానికి దీనిపై బమన్ లేబర్ కోర్టులో దౌత్య కార్యాలయం ద్వారా కేసు నడుస్తున్నది. మరో 30వేల మంది కార్మికులు సౌదీ నిర్మాణ సంస్థ సౌదీబిన్ లాడన్ గ్రూపులలో ఉద్యోగాలు కోల్పోయారు. ముడి చమురు ధరలు పడిపోవడం, గల్ఫ్ దేశాల్లో వేల సంఖ్యలో తెలంగాణ కార్మికుల ఉద్యోగాలు ఊడిపోయాయి. తెలంగాణ కార్మికులను గల్ఫ్ నుంచి సొంత పల్లెలకు తిరిగి పంపించడం, తెలంగాణ ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. గల్ఫ్ దేశాలలోని భారతీయ ఉద్యోగులలో తెలంగాణకు చెందిన వారు 12 లక్షల మంది వరకు ఉన్నారు. గల్ఫ్ బాధితులకు తెలంగాణ రాష్ట్రంలో బతుకుదెరువు దొరుకుతుందని అనుకుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మాకు దిక్కెవరని ఆ అభాగ్యులు ప్రశ్నిస్తున్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవడానికి ఉమ్మడి ప్రభుత్వం 256 జీవోను తెచ్చింది. జీవో ద్వారా 29 కుటుంబాలకు రూ.29 లక్షల సహాయం అందించారు. రెండో విడతలో 300 మందికి సహాయం అందలేదు. 2014 నుంచి ఈ జీవోను అటకెక్కించారు.

సెల్ : 9581358696

నీటి కష్టాలు తీర్చేమార్గం లేదా?


వినోద్‌కుమార్

"జన సంరక్షణకు ఎంత ప్రాధాన్యత ఇస్తాడో జల రక్షణకు కూడా అంతే ప్రాధాన్యతనిచ్చిన వాడు అసలు సిసలు పాలకుడు" అని ఆ కాలంలోనే 'వేమన' చెప్పిన మాటలు సజీవ సత్యాలు. "భవిష్యత్తు జగడాలు జలం కోసమే"ననే ఐరాస వ్యాఖ్యలు అప్పట్లో ఆశ్చర్యానికి గురి చేసినా నేడు అది నిత్యకత్యమైపోయింది. ముఖ్యంగా రెండు దశాబ్దాల క్రితం వరకు కాసింత మట్టి (ఇసుక) తొలగిస్తేనే 'చెలిమెల' నుండి ఉబికి వచ్చిన జలం నేడు వందల నుండి వేల ఫీట్లు లోనికి వెళ్లినా చుక్కనీరు కానరాని పరిస్థితి నిజంగా ఘోరం. "ప్రకతి మనిషి అవసరాలను తీర్చగలదే కానీ మనిషి కోరికలు తీర్చలేదు" అన్న మాటలు పెడచెవిన పెట్టి ఆధునికత ప్రభావంతో చుక్కనీటి కోసం పోరు చేయాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి.వాస్తవానికి పారిశ్రామికీకరణ ఫలితంగా కాలుష్యం పెరగడం సహజమే అయినా ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమల స్థాపన, వ్యర్థ పదార్థాల తొలగింపుపై అలసత్వం, క్షీణిస్తున్న అడవులపై దష్టి పెట్టకపోవడం, అంతా 'కాంక్రీట్ జంగిల్'గా మారిన నగర జీవనం, విచ్చలవిడిగా భూకబ్జాలు, మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం, మోటారు వాహనాల ద్వారా విడుదలవుతున్న కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ లోపం, నగరాలకు జల వసతిని కల్పించే నీటి వనరులను మాయం చేసేశాయి. గతంలో దాదాపు వెయ్యి చెరువులు/ సరస్సులు గల నగరంగా విలసిల్లిన మన భాగ్యనగరం నేడు వేళ్లతో లెక్కించే స్థాయికి చెరువుల సంఖ్య కుచించుకుపోయింది. మరోవైపు గ్రామాల్లోనూ చెరువులు నిరాదరణకు గురై పూడిక పేరుకుపోవడం, మరమ్మతులపై అలసత్వం, నిర్మాణ లోపాలు, చెరువు భూముల ఆక్రమణ, వాగులలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు, చెరువులకు నీరు తెచ్చే నీటి ప్రవాహ మార్గాల ఆక్రమణ, చెరువులను మట్టితో నింపేయటం, వరద నీటికి అడ్డుకట్టలు, సమర్థ నీటి యజమాన్యం లేకపోవడం, వంటచెరుకుకే కాకుండా అటవీ వనరులు ఆర్థిక లాభాల దష్ట్యా అమ్మేయడం, అటవీ సంరక్షణపై నిర్లిప్తత, భూగర్భజల సంరక్షణకు కార్యక్రమాలు చేపట్టకపోవడం, వాటర్‌షెడ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడం, రియల్ ఎస్టేట్ విస్తరణ, గుట్ట వాలులపై చిన్న నీటి పథకాలు అమలు చేయకపోవడం, భూగర్భజలంపై విపరీతంగా ఆధారపడాల్సిన దుస్థితికి రైతులను నెట్టివేయడం వంటి వాటి ఫలితంగా ఉపరితల నీరే కాకుండా భూగర్భజలం సైతం దొరకని దుస్థితి నేడు పల్లెల్లో దాపురించింది. వేసవి కాలం వచ్చిందంటే చాలు అష్టకష్టాలు పడైనా నీరు దొరకబుచ్చుకోవాలని పట్టణాల్లోనైతే, బస్తీల్లో, పల్లెల్లో మహిళలకు జల జగడాలు షరా మామూలయ్యాయి.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాజుల కాలంనాడు దూరదష్టితో తవ్విన చెరువుల అభివద్ధికి "మిషన్ కాకతీయ" పథకం చేపట్టడం హర్షణీయమే అయినా భూగర్భజల సంరక్షణకు, చిన్న నీటి వనరుల సంరక్షణకు, పడిన ప్రతి చుక్కనీటి బొట్టును ఒడిసిపట్టేలా కార్యక్రమాన్ని మరింతగా మార్చితే సమర్థ నీటి సంరక్షణ జరిగి భవిష్యత్తు తరాలకు భరోసా ఏర్పడుతుంది. రోగాలలో ఎక్కువశాతం అపరిశుభ్రమైన జల వాడకం ద్వారానే వ్యాపిస్తున్నాయనే విషయాన్ని గమనంలోకి తీసుకుని ప్రతి ఇంటికీ పరిశుద్ధ జల పంపిణీ కోసం చేపట్టిన మిషన్ భగీరథ పథకం కూడా ఫలితాలకు దగ్గరలోనే ఉన్నది. "హరితహారం" కార్యక్రమం కూడా అత్యవసరమే అయినప్పటికీ ప్రజలలో మరింత అవగాహన రావాల్సిన అవసరం ఎంతైనా కలదు. వాస్తవానికి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, హరితహారం లాంటి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కార్యక్రమాలను మిళితం చేసి సమన్వయంతో గ్రామగ్రామాన ప్రకతి ప్రేమికులను 'ప్రకతి మిత్ర' పేరుతో నియామకాలు చేపట్టాలి. వీరిని ఇతర శాఖలతో సమన్వయపరుస్తూ ప్రకతి సంరక్షణ చర్యలైన ఇంకుడు గుంతల తవ్వకం, వరద నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణ లాంటి చర్యలు అప్పచెప్పాలి. వీరికి భూగర్భజలమట్టం పెంపు, పెరిగిన వన(చెట్ల) సంరక్షణ ఆధారంగా ప్రోత్సాహకాలు, వేతనాల పెంపు ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీటిపై నిరంతర పర్యవేక్షణ, ప్రజలకు అవగాహన కల్పన, భవిష్యత్ అవసరాల అంచనాలు, ప్రకతి వైపరీత్యాలను ఎదుర్కొనేలా వ్యూహాలు, ప్రజలతో మమేకం కావడం లాంటి వాటితో పాటుగా వ్యవసాయ, రెవెన్యూ, వైద్య అధికారులతో కలిసి వ్యవసాయంలో రసాయనాలను, క్రిమిసంహారకాల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లేలా, వ్యాధుల నివారణపై అవగాహన పెరిగేలా కషి చేయాలి. వీరికి ఉత్సాహవంతులైన గ్రామీణులతో కమిటీలు ఏర్పరిచి వారి సహకారంతో(గంగదేవిపల్లి మాదిరిగా) ముందుకు పోవాలి. అలాగే విద్యార్థి దశ నుండే నీటి సమర్థ వాడకం, నీటిని వథా కానియకపోవటం, వనసంరక్షణ - ప్రయోజనాలు, జల చక్రం ప్రక్రియ వివరంగా నేర్పడం, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా లాభాలు వంటి అంశాలపై అవగాహన పొంది భావిభారత పౌరునిగా తన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చేలా పాఠశాలల నుండి మరింత తర్ఫీదు ఇవ్వాలి. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు వారు పైవిషయాల గూర్చి బోధించేలా విద్యార్థులకు ప్రేరణ ఇవ్వాలి. భూగర్భ జలాల పెంపు, వన సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటం, నీటి కాలుష్యం తగ్గించే మార్గాలు, నీటి ప్రవాహ మార్గాల రక్షణ, కాలుష్యం తగ్గుదలకు కషి చేయడం ద్వారా భావి తరాలకు భరోసా ఉండేలా తక్షణం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పైనే భారం వేయకుండా ప్రజలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా ఆలోచించి అందరూ సమిష్టిగా కషి చేస్తే పాతాళంలో ఉన్న గంగ పైకి ఉబికి రావడం ఖాయం.

సెల్ : 9908312949

నవ భారత నిర్మాణానికి పాటుపడాలి


శ్రీనివాస్ చిరిపోతుల

"అత్యున్నత లక్ష్యం నిర్దేశించుకుని, ప్రతి క్షణం దాని సాధనకోసం పరిశ్రమించు. మధ్యలో వచ్చే అలలను చూసి బెంబేలెత్తిపోకు... సముద్రాన్ని చూసి స్థిరత్వం అలవర్చుకో" అన్న వివేకానందుడి వ్యాఖ్యలు సర్వదా ఆచరణీయం. ఏ దేశానికైనా బలం, బలహీనత యువశక్తే. సత్తా ఉన్నా సరైన మార్గనిర్దేశం లేక వీధుల్లో సోమరుల్లా, నిస్సత్తువ నిలువెత్తున గూడుకట్టుకొని అర్థరహితంగా బతికి ఉన్న యువత జాతికి మోయలేని భారం. వివేకానందుడు కోరుకున్న ఉక్కు నగరాలు, ఇనుప కండరాల బలం గల నిఖార్సయిన యువతరం దేశమంతటా ఉంది. ఇప్పుడు కావలసిందల్లా ఈ యువశక్తిని గరిష్టంగా సద్వినియోగం చేసుకోగల తెలివితేటలే. ప్రపంచంలో అత్యధిక యువశక్తి నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న దేశం మనది. దేశంలో సుమారు ఏడు కోట్లకుపైగా యువత ఉపాధి కల్పన కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకొని ఉద్యోగాల పిలుపుకోసం వేచి చూస్తున్నారు. ప్రపంచీకరణ కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలోనూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇంతమంది పడిగాపులు కాస్తున్నారంటే వ్యవస్థలో మౌలిక లోపం ఉందనే అర్థం. విద్యా వ్యవస్థ, వత్తి విద్యలపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం మరీ తీసికట్టుగా ఉండడం వల్లే ఈ దుస్థితి తలెత్తింది. స్థూల దేశీయోత్పత్తిలో విద్యపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చు ఏనాడూ రెండున్నర శాతం దాటకపోవడం వల్లే దేశంలో యువజనం కొత్త సవాళ్లను దీటుగా ఎదుర్కొనే స్థాయికి చేరుకోలేకపోతున్నారు. ఇనుముకు పట్టిన తుప్పు క్రమంగా దాని అస్తిత్వాన్ని మింగేసినట్టే... మనిషిలోని బలహీనతలు అంతకంతకూ అతన్ని బానిసగా మార్చేసుకుంటాయి. చుట్టూ ఉన్న పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా లేకపోయినా ఏకాకితనంలోకి జారిపోయి చచ్చిపోతే ఇన్ని సమస్యలు ఉండవు కదా...ఈ తరహా నిర్వేదం వారిని చుట్టుముడుతుంది. యువత ఆశలకు, ఆశయాలకు అభిరుచులకు పట్టం కట్టి క్రమశిక్షణ, నైతిక స్థైర్యం, విలువలే పెట్టని కోటలన్న విషయాలను విడమరచి చెప్పే విద్యా వ్యవస్థ సర్వత్రా విస్తరించాలి.

సెల్ : 96034 71199

రాజకీయం వైపు సినీరంగం


అంబీరు శ్రీకాంత్

కొత్త పార్టీలు కొంగొత్త నాయకులు .....సినిమా తెర మీద నుండి రాజకీయ రణరంగంలోకి తారలు .... జయాపజయాలు. దక్షిణ భారతదేశంలో నాటి ఎంజీ రామచంద్రన్ నుండి నేటి రజనీకాంత్ కమలహాసన్ వరకు సినిమా, రాజకీయం ముడిపడి ఉన్నాయి. ఒక్క తమిళనాడు రాష్ట్రంలో మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో కూడా సినిమా నుండి రాజకీయంలోకి వచ్చిన తారలున్నారు. తమిళనాడులో నాడు ఎంజీ రామచంద్రన్ మొదట కాంగ్రెస్ పార్టీలో గాంధీ ప్రభావితుడిగా ఉన్నప్పటికీ తరువాతి కాలంలో డీఎంకే అన్నాదురై పార్టీలో చేరారు. తదనంతరం సొంతంగా ఏఐఏడీఎంకే పార్టీ స్థాపించి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మరణానంతరం శిష్యురాలు జయలలిత పార్టీని నడిపించి ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు. కరుణానిధి కూడా తమిళ సినిమా రచయితగా ఉంటూ రాజకీయాల్లో రాణించారు. డీఎంకే పార్టీ ద్రావిడ రాజకీయం పేరుతో ప్రజల మన్ననలు పొంది ముఖ్యమంత్రి అయ్యారు. కెప్టెన్ విజయకాంత్ కథానాయకుడు కూడా. డీఎండీకే పార్టీ స్థాపించి ప్రతిపక్ష పాత్ర పోషించారు. ఆర్.శరత్‌కుమార్ ఏఐఏఎస్ఎంకే పార్టీ స్థాపించి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. జయలలిత మరణానంతరం ఏర్పడిన రాజకీయ అనిశ్చితి కారణంగా అనూహ్యంగా తమిళ తలైవర్ సూపర్ స్టార్ రజనీకాంత్ 31 డిసెంబర్ 2017న వచ్చే ఎన్నికల్లో 234 స్థానాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ఇక కమలహాసన్ కూడా రాజకీయాల్లోకి వస్తున్నట్టు చెప్పారు. పార్టీ ప్రకటన చేస్తానని తెలిపారు. ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారనేది తెలియాల్సి ఉంది. తెలుగు నాట ఆంధ్రప్రదేశ్‌లో నాడు ప్రముఖ నటులు నందమూరి తారక రామారావు 1983లో పార్టీ పెట్టిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. 2009లో మెగాస్టార్ చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పటికీ సాధారణ ఎన్నికల్లో 18 స్థానాలు గెలిచి తరువాత కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఇక 2014 సాధారణ ఎన్నికల ముందు మార్చిలో మరో నటుడు పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ పెట్టినా ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ, బీజేపీలకు మద్దతుగా ప్రచారం చేశారు. 2019 ఎన్నికల్లో అసలు జనసేన బలం ఎంతో తెలుస్తుంది. కర్ణాటకలో సినిమా నటుడు ఉపేంద్ర కేపీజేపీ పార్టీ స్థాపించి 2018 అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకుని ప్రజలలోకి వెళ్లి ఎన్నికల బరిలో గెలిచి అధికారంలోకి రావచ్చు. కానీ ముఖ్యంగా సినిమా తారలు రావడానికి గల కారణం వారికి ఉన్న ఆకర్షణ ద్వారా ప్రజలలోకి వెళ్లడం సులువు. అంతే కాకుండా రాజకీయంగా ఉన్న అస్థిరత్వం కూడా దోహదపడుతుంది. అయితే వారు ఏ విధానాలు అనుసరిస్తారన్నదే కీలకమైన అంశం.

ambeerisrikanth@gmail.com

కుకవుల కపిత్వం


విరాజిత

రాయల కవితోత్సవం పేరుతో శతాధిక కవిసమ్మేళనం, రాయల కీర్తి పురస్కారాల పేరుతో మరికొంత మందికి వివిధ రంగాలలో విశేష కషి చేసినందుకు గాను పురస్కారాలు ఇచ్చారు. అందులో సాహిత్యానికి గాను గోరటి వెంకన్న గారికి ఇవ్వడం శుభపరిణామం. ఇంకా అసలు కవులు కాని వారిని కూడా కవి అని చెప్పి అక్కడ కవిత చదివించడం దారుణమైన విషయం. ఇకపోతే సాహిత్యానికి సంబంధించిన వ్యక్తుల కంటే వేదికపై ఇతరులు ఉండటం వారి ఉపన్యాసాలు అక్కడి వారు వినలేక విసుగుచెందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి గారు కొద్ది సమయమే తన విలువైన ఉపన్యాసం ఇచ్చారు. కవిత్వం-విమర్శ తప్పక వినాల్సిన ఉపన్యాసం. కానీ నిర్వాహకులు సమయం లేని కారణంగా ఆయన కొద్ది సమయం మాత్రమే ఉపన్యసించడం బాగాలేదు. సడ్లపల్లె చిదంబరరెడ్డి, మల్లెల నర్సింహామూర్తి ఉమ్మడిశెట్టి రాధేయ గారి కవితలు అమోఘంగా ఉన్నాయి. అసలు కవి సమ్మేళనాల నిర్వాహకులు వ్యక్తిగత మైలేజి పెంచుకోవడం కోసమే నిర్వహిస్తున్నారు. ఒకరు శతాధిక అంటే మరొకరు సహస్ర కవి సమ్మేళనం అని పోటీలు పడుతున్నారు. దీనికి కవులు కూడా వారి మాయలో పడి మోసపోతున్నారు. కొంతమంది రక్షణ వేదిక 'పేరుతో మీకు అవార్డ్స్ ఇస్తాం' అని నమ్మబలికి సదరు కవులను తమ వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించుకుంటారు.

రాయల కవితోత్సవంలో అధ్యక్ష పదవిలో ఉన్న ఒక పెద్ద కవి తన సెల్ఫ్ డబ్బా కొట్టుకోవడం చూసి కవులు విస్మయం చెందారు. అసలు కవి సమ్మేళనం పూర్వం ఎందుకు జరిగేవి, ఒకరి కవిత్వం ఒకరు వినడానికి దానిపై సద్విమర్శలు చేసుకొని ఒకరి ఎదుగుదలకు ఒకరు కారణమవుతూ ఆనందంగా ఉండేవారు. కొంతమందికి మెమెంటోలు కూడా ఇవ్వకుండా పంపారు. అసలు వేలు ఖర్చుపెట్టుకొని కవులు ఇలాంటి కవి సమ్మేళనాలకి ఎందుకు వెళ్తున్నారో, వరుస కట్టి సన్మానాల కోసం ఎందుకు పాకులాడుతున్నారో వారి దుస్థితి చూస్తే జాలేస్తున్నది. కవికి ఉండాల్సిన ఆత్మగౌరవం కూడా లేకపోయింది. ఏది ఏమైనా నేటి కవి సమ్మేళనాలు నిర్వాహకుల వ్యక్తిగత మైలేజి కోసం ఉపయోగపడుతున్నాయి. కానీ సరైన సాహిత్యం బయటికి రావడం లేదు. అందుకే తెలుగు సాహిత్యం ప్రపంచాన్ని ఆకర్శించలేక పోతున్నది.

సెల్ : 9700747280

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :


email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

ప్రజా విశ్వాసం కోల్పోతున్న టీడీపీ : జనసేన

- వామపక్షాల బంద్‌కు సంపూర్ణ మద్దతు
- జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం : పవన్ కల్యాణ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

విభజన హామీలు సాధించడంలో అధికార పార్టీపై ప్రజలకు నమ్మకం సడలుతోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీకి జరుగుతున్న అన్యాయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ సమాన భాగస్వామ్యం ఉందన్నారు. రెండు పార్టీలు మాటలు గారడీ చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వామపక్షాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పలు అంశాలపై మీడియాతో మాట్లాడారు. విభజన హామీలు అమలవుతాయని నాలుగేండ్లుగా ఎదురుచూశానని, ఇప్పుడు కూడా మళ్లీ అదే పునరావృతమైందని అన్నారు. రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగిందని, అన్యాయానికి గురైన ఏపీ ప్రజలకు న్యాయం జరగాలనే 2014 ఎన్నికల్లో బీజేపీ-టీడీపీకి మద్దతు ఇచ్చానని చెప్పారు. యూపీఏ ప్రభుత్వం సరైన న్యాయం చేయకపోవడం వల్ల మోడీని కలవాల్సి వచ్చిందన్నారు. మోడీ ద్వారా రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని నమ్మానని...అందుకే సంయమనాన్ని పాటించానన్నారు. దేన్నైతే ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టారో దాన్నే బీజేపీ పక్కనపెట్టిందన్నారు. గత నాలుగేండ్లుగా జరిగే తాజా బడ్జెట్‌లోనూ పునరావృతం అయ్యిందన్నారు. విభజన హామీలు, హోదాపై వెనక్కి వెళ్లిందని, అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనలు చేయాల్సిన్నారు. అయితే విభజన హామీలు సాధించడం కోసం జనసేన ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తిరుపతి, కాకినాడల్లో సభలు నిర్వహించడంతో కేంద్రం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. హోదా కంటే ప్యాకేజీనే మంచిదని



చంద్రబాబు నాయుడు కూడా చెప్పడం జరిగిందని పవన్ గుర్తు చేశారు. అయితే ప్యాకేజీపై ఎవరికీ స్పష్టత లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర విభజన తరువాత ఏ వనరులు లేని రాష్ట్రాన్ని అనుభవజ్ఞులని చంద్రబాబు నాయుడు చేతిలో పెడితే...అవినీతి రాష్ట్రంగా మార్చిన తీరు అత్యంత బాధాకరమని అన్నారు. విభజన హామీల అమలుకు పార్టీలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని రాజకీయ పార్టీ ఏ విధంగానైతే ఒక్కటై పోరాటం చేశాయో...ఇప్పుడు ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాల కోసం కూడా ఒక జేఏసీ ఏర్పాటు చేయాలని తాము భావిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం ఉండవల్లి అరుణ్‌కుమార్, జయప్రకాశ్ నారాయణ వంటి మేధావులను త్వరలో కలవబోతున్నట్లు చెప్పారు.

మే 23, 24 తేదీల్లో ఐసెట్ పరీక్ష

- ఈసారి ఆన్‌లైన్‌లో : ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి

నవతెలంగాణ-బాల సముద్రం

మే 23, 24 తేదీల్లో ఐసెట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మెన్ పాపిరెడ్డి ప్రకటించారు. టీఎస్ ఐసెట్-2018 ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌ను వరంగల్‌లో గల కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ బిల్డింగ్ సెమినార్ హాల్‌లో బుధవారం ఆయన బుధవారం విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఫిబ్రవరి 22న నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు.

మార్చి ఆరో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 30 వరకు అభ్యర్థులు అప్లై చేసుకోవచ్చునని చెప్పారు. మే ఐదో తేదీ వరకు రూ. 500, మే 10 వరకు రూ. 2 వేలు, మే 14 వరకు ఐదు వేల రూపాయల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

మే ఏడో తేదీ నుంచి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. పరీక్షలు మే 23వ తేదీన రెండు సెషన్‌లలో, 24వ తేదీన ఒక సెషన్‌లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రాథమిక కీ మే 25న విడుదల చేస్తామన్నారు. కీపై అభ్యర్థులకు అభ్యంతరాలుంటే జూన్ నాలుగు వరకు స్వీకరిస్తామని, జూన్ ఆరో తేదీన అంతిమ కీ మరియు ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ, నర్సాపూర్ (మెదక్), నిజామాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, వరంగల్, కర్నూల్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఆదిలాబాద్‌లో రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-గుడిహత్నూర్/వేములవాడ/కథలాపూర్

ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌తోపాటు తండ్రీ కొడుకు చనిపోయారు. తల్లీకూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ అహ్మద్ కూరగాయలు, పండ్ల ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసేవాడు. భార్య ఫర్హానా బేగం, కొడుకు సయ్యద్ ఉమర్ (10), కూతురు మెహెందియాతో కలిసి సొంత గ్రామమైన నిజామాబాద్ జిల్లా ముప్కాల్ గ్రామానికి డ్రైవర్ బిలాల్ బిన్ అబ్దుల్లా (27)ను తీసుకొని కారులో బయలుదేరారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో కారు ముందు కూర్చున్న సయ్యద్ అహ్మద్, అతని కొడుకు సయ్యద్ ఉమర్, డ్రైవర్ బిలాల్ బిన్ అబ్దుల్లా అక్కడికక్కడే మృతి చెందారు. ఫర్హానా బేగం, మెహెందియాకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ టైర్ పంక్చర్ అవడంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారని, ఇండికేటర్స్ వేయకపోవడంతో ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. మృతిచెందిన వారి కుటుంబసభ్యులను మంత్రి జోగు రామన్న పరామర్శించారు.

తెలంగాణ ప్రజలకు
మోడీ క్షమాపణలు చెప్పాలి : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



పార్లమెంటు తలుపులు మూసి తెలంగాణ బిల్లు పెట్టారంటూ ప్రజలను కించపరిచే విధంగా వెకిలిగా మాట్లాడిన దేశ ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగిరే నైతిక హక్కులేదని చెప్పారు. బుధవారం అసెంబ్లీలోని మీడియా హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌పై ప్రధాని మోడీ మాట్లాడిన తీరు రచ్చబండ దగ్గర సామాన్య పౌరుడు మాట్లాడినట్టుగా ప్రధాని చౌకబారుగా ఉందన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కటీ తెలుగు రాష్ట్రాల్లో అమలు చేయలేదని విమర్శించారు. రెండు రాష్ట్రాల్లోని ప్రజా సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల ప్రజలకు నష్టం జరుగుతోందన్నారు. ప్రధాన మంత్రికి విదేశీ పర్యటన మీద ఉన్న మోజు ప్రజా సమస్యల పరిష్కారంలో లేదన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఏనాడైనా కూర్చోబెట్టి మాట్లాడారా? అని ప్రశ్నించారు. గుజరాత్ ఎన్నికల్లో అవమానకరమైన రీతిలో బీజేపీ గెలుపొందడం, రాజస్థాన్‌లో ఘోరంగా ఓటమి పాలు కావడంతో వచ్చే ఎన్నికల్లోనూ ఇదే విధంగా బీజేపీ ఓడిపోతుందన్న భావనతో పార్లమెంటులో ప్రధాని చౌకబారుగా మాట్లాడారని మండిపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌పై ఆయన విమర్శలు చేశారు. అమెరికాలో బాత్‌రూమ్‌లు కడిగే వారని చెప్పారు. 371 (డీ) ప్రకారం తెలంగాణలో కేటీఆర్‌కు చప్రాసీ నౌకరు కూడా రాదని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నందు వల్లే కేటీఆర్ క్యాబినెట్ మంత్రి దక్కిందని విమర్శించారు.

ఫలించిన అభ్యర్థుల ఆందోళన

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బాధ్యతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అభ్యర్థుల ఆందోళన ఫలించింది. తెలంగాణ స్టడీ సర్కిల్‌లో అవినీతికి పాల్ప డ్డ అధికారిని తొలగించాలంటూ గత ఆరు రోజులుగా ఆందోళన చేపడుతున్న విష యం తెలిసిందే. అభ్యర్థుల ఆందోళన గురించి "నవతెలంగాణ" దినపత్రికలో వార్త లు ప్రచురితం కావడంతో ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రసాద్ బుధ వారం అభ్యర్థులతో చర్చలు జరిపారు. వెంటనే ప్రస్తుతం ఉన్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ గా ఉన్న హన్మంత్ నాయక్‌ను తొలగించారు. ఆయన స్థానంలో గురుకు లాల కార్యదర్శి ఐపీఎస్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఆశా వర్కర్ల వేతనాలు నేరుగా ఖాతాల్లోకే'

నవతెలంగాణ-మెదక్‌అర్బన్

'కార్పొరేట్‌ను తలదన్నే విధంగా రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో సేవలు అందిస్తున్నాం. రెండు నెలల్లో వైద్యఆరోగ్య శాఖలో ఖాళీలను భర్తీ చేస్తాం.. ఆశా వర్కర్లకు వచ్చే నెల నుంచి బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ చేస్తాం' అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని, ఎంసీహెచ్ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఐదు పార్టీలు.. రూ.299.54 కోట్లు

- ఆడిట్ రిపోర్టులు సమర్పించని బీజేపీ, కాంగ్రెస్

న్యూఢిల్లీ: దేశంలో ఐదు జాతీయ పార్టీల ఆదాయం 2016 -17 మధ్యకాలంలో రూ.299.54 కోట్లుగా ఉన్నదని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) వెల్లడించింది. జాతీయ పార్టీలు ప్రతి ఏటా తమ ఆదాయ ఆడిట్ రిపోర్టులను కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది. కాగా.. దేశంలోని ఏడు జాతీ య పార్టీల్లో ఐదు మాత్రమే తమ రిపోర్టులను ఈసీకి సమర్పించాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ తమ రిపోర్టులను అంద జేయకపోవడం గమనార్హం. పార్టీల ఆడిట్ అకౌంట్ల సమర్పణకు గతేడాది అక్టోబర్ 30 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది.

అయితే.. నిర్ణీత గడువులోపు బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ), సీపీఐ (ఎం), తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు మాత్రమే రిపోర్టులను సమర్పించాయి. సీపీఐ 22 రోజులు, ఎన్‌సీపీ రెండు నెలల ఆలస్యంగా ఆడిట్ అకౌంట్లను ఈసీకి అందజేశాయి. పార్టీల ఆదాయంలో బీఎస్పీ అగ్రస్థానంలో ఉన్నది. మొత్తం ఆదాయంలో ఆ పార్టీ వాటా 57.95 శాతం(173.58 కోట్లు)గా ఉన్నది.

9న డిపోలు, 23న బస్‌భవన్ వద్ద ధర్నాలు

- ఎస్‌డబ్ల్యూఎఫ్

హైదరాబాద్ : ఆర్టీసీ కార్మికులు పేస్కేలు వెంటనేచేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, పని భారం తగ్గించాలని, మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీలు భర్తీ చేయాలని కోరుతూ ఈ నెల 9న అన్ని డిపోల వద్ద భోజన విరామ సమయంలో ధర్నాలు చేయాలని తెలంగాణ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) పిలుపునిచ్చింది. 23న బస్‌భవన్ వద్ద ధర్నాలు జయప్రదం చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రాం చందర్, వీఎస్ రావు కార్మికులకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

'గల్ఫ్' కష్టాలు తీర్చకపోతే సీఎం ఆఫీస్ ముట్టడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రాంతం నుంచి గల్ఫ్ దేశాలకు పెద్ద ఎత్తున కార్మికులు వల సపోతున్నారని, అక్కడ సరైన ఉద్యోగాలు లేక ఉపాధి కరువై ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియా చెప్పారు. ప్రభుత్వాలు స్పందించకపోతే ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అంతర్జాతీయ బ్రాండ్‌గా 'పోచంపల్లి'



- చేనేత సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..
- కార్మికుల జీవన స్థితిగతులను పరిశీలించిన గవర్నర్
- పోచంపల్లి, చౌటుప్పల్‌ల్లో పర్యటన
- అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ- భూదాన్‌పోచంపల్లి/ చౌటుప్పల్

మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త, కొత్త డిజైన్లు రూపొందించుకొని అంతర్జాతీయ స్థాయికి పోచంపల్లి చేనేత ఎదగాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. డిమాండ్‌కు తగిన రీతిలో ఉత్పత్తి చేసి అమ్మకాలు పెంచుకొని ఆర్థికంగా, సామాజికంగా చేనేత కార్మికులు అభివృద్ధి చెందాలన్నారు. చేనేత కార్మికుల జీవన స్థితిగతులను, వస్త్ర తయారీ విధానం గురించి తెలుసుకునేందుకు యాదాద్రి జిల్లాలోని పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లో గవర్నర్ దంపతులు బుధవారం పర్యటించారు. వారికి పోచంపల్లి వద్ద మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ అనితారామచంద్రన్, రాచకొండ కమిషర్ మహేష్ భగవత్ స్వాగతం పలికారు.

అనంతరం పోచంపల్లి మండల కేంద్రంలోని టూరిజం పార్కులో ఉన్నతాధికారులు, చేనేత కార్మికులు, బ్యాంకర్లు, సొసైటీ ప్రతినిధులతో గవర్నర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా మానవతా దృక్పథంతో బ్యాంకర్లు చేనేత కార్మికులకు విరివిగా ముద్ర రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. చేనేత సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారానికి 7రోజులు చీర నేసే కార్మికులకు నెలకు రూ.10 వేలు కాకుండా రూ.20 వేల వరకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల ప్రతినిధులకు సూచించారు. నూలు ధరలు పెరిగినా చీర ధర పెరగలేదని, తద్వారా ఆశించిన లబ్ది చేకూరడం లేదని, వస్త్రాల అమ్మకాలకు మార్కెటింగ్ సౌకర్యాలు పెంపొందించాలని చేనేత కార్మికులు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని చేనేత కార్మికుడు గొట్టిముక్కల ఇస్తారి ఇంటికి వెళ్లి వారి జీవన స్థితిగతులను గవర్నర్ పరిశీలించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, మగ్గం ద్వారా ఆదాయ మార్గాలు, చౌకధర బియ్యం, గ్యాస్ కనెక్షన్ తదితర ప్రభుత్వ పథకాలపై అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. కుటుంబం అంతా కష్టపడితేగాని పూట గడవదని కార్మికులు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు తమలాంటోళ్లకు అందటం లేదని వాపోయారు. అనంతరం గవర్నర్ రామానందతీర్థ గ్రామీణ సంస్థకు చేరుకొని ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, గార్మెంట్స్, ఎలక్ట్రికల్ రంగాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉన్నందున చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తొలుత గవర్నర్ పోచంపల్లి మండలం కనుముక్కల గ్రామంలోని హ్యాండ్‌లూం పార్కును సందర్శించి వస్త్ర తయారీని పరిశీలించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ సెంటర్, రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు.

నవచిత్రం

మరో పుష్పక విమానం


వెంకటేష్

సినిమా ప్రారంభం మూకీగానే జరిగిన విషయం విదితమే. కేవలం నటీనటుల భావోద్వేగాలు, యాక్షన్ ప్రధానంగా సినిమాలుండేవి. సౌండ్ వచ్చాక మూకీ చిత్రాలకు కాలం చెల్లింది. ఈ నేపథ్యంలో తాజాగా తెలుగులో ఓ మూకీ సినిమా రాబోతుందనే వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతున్నాయి. వెంకటేష్ హీరోగా దర్శకుడు అశోక్ ఈ మూకీ సినిమాను తెరకెక్కించాలని గతంలో ప్లాన్ చేశారు. ఆ తర్వాత అది పక్కకు వెళ్ళిపోయింది. ఇటీవల 'భాగమతి'తో మంచి విజయాన్ని అందుకున్న అశోక్ తాజాగా ఈ మూకీ కథను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారట. కథలో కొన్ని మార్పులు చేసి సమకాలీన అంశాల మేళవింపుగా వైవిధ్యభరితంగా సినిమాను రూపొందించాలనుకుంటున్నారట. దీంతో ఇది మరో 'పుష్పక విమానం' అవుతుందని చిత్ర వర్గాలు అంటున్నాయి. వెంకీ ప్రస్తుతం తేజ దర్శకత్వంలో ఓ సినిమాలో నటించబోతున్నారు. త్వరలోనే ఇది రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. దీంతోపాటు అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'ఫన్ అండ్ ఫ్రాస్టేషన్'(ఎఫ్ 2)అనే మల్టీస్టారర్‌లో వరుణ్ తేజ్‌తో కలిసి నటించనున్నారు.


నాగార్జున, ధనుష్

విభిన్న కాంబినేషన్ !

విభిన్న కథా చిత్రాలు చేయడంలో నాగార్జున ముందుంటారు. తాజాగా ఆయన తమిళ హీరో ధనుష్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నట్టు తెలుస్తుంది. హీరోగా, నిర్మాతగా రాణిస్తున్న ధనుష్ 'పవర్‌పాండి' చిత్రంతో దర్శకుడిగా మారాడు. త్వరలోనే ఆయన నాగార్జున చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తేనాండాల్ ఫిల్మ్ పతాకంపై రూపొందే ఈ చిత్రంలో ధనుష్ దర్శకత్వం వహించడంతోపాటు ఓ ముఖ్య పాత్రలో కూడా కనిపిస్తారట. ఆగస్ట్‌లో ఈ సినిమా ప్రారంభం కానున్నట్టు తెలుస్తుంది. అయితే ముందుగా చిరంజీవి హీరోగా సినిమా తీయాలని భావించారు. చిరంజీవితో చర్చలు విఫలం కావడంతో ఇప్పుడు నాగార్జునను సంప్రదించారట. అందుకు నాగ్ సుముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది. ఇదిలా ఉంటే నాగార్జున తన అభిమానులకు ఓ సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాడు. తొలిసారిగా బయోపిక్‌లో నటించబోతున్నట్టు తెలుస్తుంది. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జీవితంపై 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి ఓ చిత్రాన్ని రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో వైఎస్ఆర్‌గా నాగార్జునను నటింప చేయాలని భావిస్తున్నారు. మొదట మలయాళ నటుడు మమ్ముట్టిని అనుకున్నా తాజాగా నాగార్జునను కలిసి స్క్రిప్ట్ వినిపించారట. కథ విని నటించేందుకు నాగ్ ఒప్పుకున్నారని తెలుస్తుంది. అయితే ఈ సినిమాను 2019 ఎలక్షన్‌కు ముందు విడుదల చేయకూడదని, అది రాజకీయంగా వివాదాలకు కారణమయ్యే ఛాన్స్ ఉందని నాగ్ చెప్పాడట. పొలిటికల్ బయోపిక్‌గా రాబోతున్న ఈ సినిమాను భారీ స్థాయిలో రూపొందించాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. నాగార్జున ప్రస్తుతం వర్మ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో నటిస్తున్నారు. అలాగే శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నానితో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమా చేయనున్నారు.


రాశీఖన్నా

నాకూ తొలిప్రేమ ఉంది ...!

'నా మొదటి సినిమా 'ఊహలు గుసగుసలాడే' తర్వాత నాకు బాగా నచ్చిన లవ్ స్టోరీ ఇదే. నా మనసుకు బాగా దగ్గరైన ప్రేమ కథ ఇది' అని అంటోంది రాశీఖన్నా. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా నటించిన 'తొలి ప్రేమ' చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశీఖన్నా బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 'ఓ జంట తొలి ప్రేమను తెలిపే చిత్రమిది. ఈ జనరేషన్‌లో టీనేజ్‌లో పుట్టే మొదటి ప్రేమ ఎలా ఉంటుంది. వయసుతోపాటు పెరిగే మెచ్యూరిటీ వల్ల ప్రేమ ఎలా మారుతుందనేది చిత్ర కథాంశం. పవన్ కళ్యాణ్ నటించిన 'తొలి ప్రేమ'కు దీనికి ఎలాంటి సంబంధం లేదు. దేనికదే భిన్నమైనవి. పవన్ 'తొలిప్రేమ' ఇటీవలే చూశా. నాకు బాగా నచ్చింది. ఇటీవల విడుదలైన మా చిత్ర టీజర్, ట్రైలర్ మంచి ఆదరణ పొందాయి. ఇందులో నేను వర్ష పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో మూడు షేడ్స్ ఉంటాయి. 19ఏండ్ల వయసులో ఒకలా, లండన్‌లో ఉన్నప్పుడు మరోలా, కాలేజ్ డేస్‌లో ఒకలా కనిపిస్తాను. నా వాస్తవ జీవితానికి దగ్గరగా ఉండే పాత్ర ఇది. ఎందుకంటే 17ఏండ్ల వయసులో నాకూ ఓ ప్రేమ కథ ఉండేది. సీనియర్ ఒకరు నాకు ప్రపోజ్ చేశాడు. అదే నా తొలి ప్రేమ. అందుకే ఈ కథ బాగా కనెక్ట్ అయ్యింది. ఇందులో వరుణ్ తేజ్‌తో కలిసి నటించడం చాలా హ్యాపీగా ఉంది. తను సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. చిన్న వయసులో కనిపించడానికి రోజుకు మూడుసార్లు జిమ్‌కు వెళ్లేవాడు. ఆయన పాత్ర సినిమాలో స్పెషల్‌గా ఉంటుంది. దర్శకుడు వెంకీ అట్లూరికిది తొలి చిత్రమైనా ఎక్కడా మిస్టేక్స్ లేకుండా జాగ్రత్తగా చాలా బాగా తెరకెక్కించాడు. ఇందులో కార్ సీన్ నాకు బాగా నచ్చింది. సినిమా కూడా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. సినిమాకు పవన్ కళ్యాణ్ అభిమానులు అందిస్తున్న సపోర్ట్ మరువలేనిది. వారికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని అన్నారు.

ప్రతి సినిమా నాకు టెన్షనే..!


వినాయక్

'ఇతర భాషా చిత్రాల నుంచి స్ఫూర్తి పొంది సినిమాలు తీయడం మనకు కొత్తేమి కాదు. సినిమా ప్రారంభం నుంచి ఉంది. ఇప్పుడు సోషల్ మీడియా వల్ల బయటికి వస్తుంది. అదే సందర్భంలో మన తెలుగులో మంచి కథలతో కూడిన సినిమాలొస్తున్నాయి' అని అంటున్నారు వి.వి.వినాయక్. 'ఖైదీ నంబర్ 150' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆయన దర్శకత్వంలో వస్తోన్న చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటించారు. ఈ నెల 9న విడుదల కానున్న ఈ సినిమా గురించి బుధవారం వినాయక్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే తెలుసుకుందాం..

మైండ్ గేమ్‌తో..

మైండ్‌గేమ్‌తో సాగే చిత్రమిది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాలీగా పెరిగిన హీరోకి అనుకోకుండా ఓ సమస్య వస్తుంది. తను గాడ్‌ఫాదర్‌లా భావించే వ్యక్తే మోసం చేస్తే న్యాయం కోసం అతను ఏం చేశాడు. ఫ్యామిలీ బాధ్యత తీసుకుని స్నేహితులతో కలిసి విలన్ ఆట ఎలా కట్టించాడనేది సినిమా కథాంశం. ఇందులో 'ధర్మాభాయ్ డాట్ కామ్' ఏంటనేది ఆసక్తికరం. ఆ మధ్య హల్‌చల్ చేసిన స్నేక్ గ్యాంగ్ ఇష్యూస్ కూడా ఇందులో ఉంటాయి. ఆకుల శివ మరోసారి మంచి కథ అందించారు. థమన్ నాలుగు పాటలకు మంచి బాణీలను, ఆకట్టుకునే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. మొత్తంగా క్యూట్ లవ్, హ్యూమర్, యాక్షన్, మంచి సాంగ్స్, కామెడీ మేళవించిన కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. నా మార్క్ రెగ్యులర్ ఫార్మాట్‌లో ఉంటుంది. ఫస్ట్ కాపీ చూశాక హ్యాపీగా ఫీలయ్యాం. నిర్మాత సి.కళ్యాణ్ నన్ను గాజు బొమ్మలా చూసుకున్నారు. ఈ సినిమాకు ఆయనే ఇంటిలిజెంట్.

రీమిక్స్ ముందే అనుకున్నాం..

చిరంజీవి అన్నయ్య నటించిన 'కొండవీటి దొంగ'లోని 'చమకు చమకు' పాట నాకిష్టమైనది. ఆ పాటను ఇందులో రీమిక్స్ చేయాలని మొదట్నుంచి అనుకున్నాం. ఇళయరాజా కూడా ఓకే చెప్పారు. ఆ పాటలో సాయి ధరమ్‌తేజ్ డాన్స్ అద్భుతంగా చేశాడు. పాట చిత్రీకరణలో సాయిని చూసినప్పుడు అన్నయ్య చిరంజీవి గుర్తుకొచ్చారు. ఇందులోని డాన్స్‌లు మరో లెవల్‌లో ఉంటాయి. జానీ మాస్టర్, శేఖర్ మాస్టర్ మంచి డాన్సులు కంపోజ్ చేశారు. సాయి డాన్సులే కాదు, యాక్షన్, కామెడీ కూడా బాగా చేశాడు. నా సినిమాల ద్వారా ఇతర హీరోలకు కెరీర్ టర్న్ అయ్యిందో లేదో తెలియదు గానీ, ఈ సినిమా ద్వారా సాయిధరమ్‌తేజ్ హీరోగా నెక్స్ట్ లెవల్‌కి వెళతాడు. చిరంజీవి లెజెండరీ పర్సన్. ఆయనతో సినిమా చేసేటప్పుడు కాస్త డోస్ పెంచి పనిచేయాలి. కానీ సాయితో రిలాక్స్‌డ్‌గా చేశాను. చరణ్, బన్నీ, సాయి 'ఠాగూర్' సినిమా టైమ్‌లో చిన్నపిల్లలు. చరణ్ చాలా సౌమ్యుడు, మంచి విలువలతో కూడిన వ్యక్తి.

మరో యాంగిల్ ఓపెన్ అవుతుంది..

సొంత కథలతో సినిమాలు చేయడమే కాదు ఇతర కథలతోనూ సినిమాలు చేయాలని, దీంతో మనలో కొత్త యాంగిల్ ఓపెన్ అవుతుందని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఎప్పుడూ చెబుతుండేవారు. అందుకే నేను కూడా సొంత కథలతోపాటు ఇతర కథలను కూడా చేస్తున్నాను. అలా చేయకపోయి ఉంటే నాపై ఇప్పటికీ ఫ్యాక్షన్ డైరెక్టర్ అనే ముద్ర ఉండేది. ఇతర కథలు చేయడం వల్లే ఆ ముద్ర పోయింది. వినాయక్ ఏదైనా చేయగలడనిపించేలా చేసింది. సొంతంగా కథ రాసుకునేందుకు చాలా టైమ్ పడుతుండటంతో ఈ కథతో చేశాం. ఆకుల శివతో ఇది మూడవ చిత్రం.

కాపీ మొదట్నుంచి ఉంది..

ఇతర సినిమాల నుంచి కాపీ కొట్టడం, ఇన్‌స్పైర్ కావడమనేది 'సినిమా' ప్రారంభం నుంచి ఉంది. కాకపోతే అప్పుడు ఎవరికీ తెలిసేది కాదు. ఇప్పుడు సోషల్ మీడియా వల్ల తెలిసిపోతుంది. కాపీ, ఇన్స్‌పిరేషన్ అనే కామెంట్స్ ఎప్పుడూ ఉన్నాయి. ఉంటాయి. అదే సమయంలో మన వద్ద కొత్త కాన్సెప్ట్‌తో కూడిన సినిమాలు వస్తున్నాయి. మంచి రచయితల కొరత ఉందనేది వాస్తవం కాదు. రచయితలు దర్శకులవుతున్నారు. ప్రతి ఒక్కరికి దర్శకులు కావాలని ఉంటుంది. కావాలి కూడా. మన వద్ద టాలెంట్ ఉన్న దర్శకులకు అవకాశాలు రావడం లేదు. ఛాన్స్‌లు వచ్చే దర్శకుల వద్ద మంచి కథలుండటం లేదు. ఓ సినిమా ఆడుతుందో లేదో షూటింగ్ మధ్యలోనే తెలిసిపోతుందని చెప్పే హీరోలు బ్రహ్మలై ఉంటారు. నాకు మాత్రం అది విషయం తెలియదు. ఎందుకంటే మేం ఓ సీన్ తర్వాత మరో సీన్ తీయాలనే ఆలోచనలో ఉంటాం. అదే సమయంలో సినిమాపై నమ్మకంతోనే తీస్తాం. సినిమా తీసేటప్పుడు నాకు టెన్షన్‌గా ఉంటుంది. నాకే కాదు ప్రతి ఒక్క దర్శకుడూ అలానే ఫీలవుతారు. నేను కథ విన్నప్పుడు ఇది ఆడుతుందనిపిస్తేనే చేస్తా. లేకపోతే చేయను.

కాంబినేషన్లు తప్పుకాదు..

కాంబినేషన్లతో సినిమా తీయడం తప్పుకాదు. ఎందుకంటే సినిమా అనేది వ్యాపారం. నిర్మాత డబ్బులు పెడుతున్నాడంటే ఎంతో కొంత వెనక్కి రావాలనే కోరుకుంటాడు. అందుకోసం ఏ కాంబినేషన్ వర్కౌట్ అవుతుందో లెక్కలేసుకునే చేస్తాడు. కృష్ణ, శోభన్‌బాబుల టైమ్ నుంచి ఈ కాంబినేషన్లు ఉన్నాయి. అయితే హీరో, దర్శకుడు, నిర్మాత ఈ ముగ్గురిలో సినిమాకు ఎవరు గొప్ప అంటే సినిమానే గొప్పదని చెబుతా. ప్రస్తుతం నాకు రాజకీయాల్లోకి వెళ్లే ఆసక్తి లేదు. భవిష్యత్‌లో వెళతానా? లేదా? అన్నది తెలియదు. డెస్టినీ నిర్ణయించేదాన్ని నేనెలా చెప్పగలను. ఇక నాకు కోపం రాదా? అంటే వస్తుంది. కానీ దాన్ని దాచుకుంటా(నవ్వుతూ). కోపం రాని మనిషి ఎవరూ ఉండరు.

రెండేండ్ల తర్వాత..

నెక్స్ట్ సినిమాలు ఇంకా ఏం అనుకోలేదు. మహేష్‌తో సినిమా చేయాలని ఒకటి రెండు సార్లు అనుకున్నాం. ఆయనకు సరిపడా కథను చెప్పలేకపోయా. మంచి కథ కోసం ప్రయత్నిస్తున్నా. అలాగే 'అదుర్స్ 2' తీయాలనుంది. కథ కుదరడం లేదు. కచ్చితంగా సీక్వెల్ చేస్తా. అలాగే కొత్త వాళ్ళతో మంచి కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు చేయాలనే ఓ ఆలోచన కూడా ఉంది. నిర్మాణానికి సంబంధించి కూడా ప్లాన్ చేస్తున్నా. అవన్నీ రెండేండ్ల తర్వాతే.

మిస్టరీ థ్రిల్లర్‌గా నూతన చిత్రం !


కళ్యాణ్ రామ్

కళ్యాణ్ రామ్ 'ఇజం' నుంచి విభిన్న కథా చిత్రాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం 'ఎమ్మెల్యే', 'నా నువ్వే' చిత్రాల్లో నటిస్తున్నారు. తాజాగా మరో వైవిధ్యమైన కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ ప్రయోగాత్మక చిత్రంలో నటించేందుకు సిద్ధమవుతున్నారని టాక్. విజయ్ మద్దల అనే నూతన దర్శకుడు ఈ సినిమా ద్వారా డైరెక్టర్‌గా పరిచయం కాబోతున్నారు. కథ నడిచే విధానం, అందులో ట్విస్టులు కళ్యాణ్ రామ్‌కు బాగా నచ్చడంతో సినిమా చేసేందుకు ఓకే చెప్పినట్టు తెలుస్తుంది. చిత్రీకరణ జరుపుకుంటోన్న ప్రస్తుత చిత్రాలు పూర్తయిన తర్వాత ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు. పొలిటికల్ డ్రామాగా రూపొందుతున్న 'ఎమ్మెల్యే' చిత్రానికి ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహిస్తుండగా, కాజల్ కథానాయికగా నటిస్తుంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'నా నువ్వే' చిత్రానికి జయేంద్ర దర్శకత్వం వహిస్తుండగా తమన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు వేసవిలో విడుదల కానున్నాయి.


సల్మాన్ ఖాన్

మరోసారి కిక్ ఇచ్చేందుకు

'కిక్' సినిమాతో మంచి కమర్షియల్ హిట్‌ను అందుకున్నారు సల్మాన్ ఖాన్. 2014లో విడుదలైన ఈ సినిమా తెలుగులో రవితేజ హీరోగా వచ్చిన 'కిక్'కు రీమేక్. తెలుగులోనే దీనికి సీక్వెల్‌గా వచ్చిన 'కిక్ 2' నిరాశ పరిచింది. ఈ నేపథ్యంలో సల్మాన్ హిందీలో 'కిక్ 2' సినిమా చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. సాజిద్ నడియద్‌వాలా దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో సల్మాన్ సరసన నటించే కథానాయిక ఇంకా ఫైనల్ కాలేదు. ఇదిలా ఉంటే సల్మాన్ ఇటీవల తన అభిమానులను సర్‌ప్రైజ్ చేసి, అంతలోనే నిరాశ పరిచారు. సల్మాన్ పెళ్ళి గురించి ఆయన అభిమానులే కాదు, యావత్ సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సల్మాన్ చేసిన ఓ ట్వీట్ అభిమానులను ఖుషి చేసింది. అంతలోనే నిరాశను మిగిల్చింది. ఇంతకి ఆ వివరాలు చూస్తే.. సల్మాన్ మంగళవారం 'నాకు అమ్మాయి దొరికింది' అంటూ ట్వీట్ చేశారు. దీంతో అభిమానులు ఒక్కసారిగా సర్‌ప్రైజ్ అయ్యారు. ఆ ఆనందంతో కామెంట్స్ చేస్తూ విషెష్ తెలిపారు. అంతలోనే సల్మాన్ స్పందిస్తూ, 'కంగారు పడల్సింది ఏమీ లేదు. నా బావమరిది ఆయుష్ శర్మ నటిస్తున్న 'లవ్ రాత్రి' సినిమాకి కథానాయిక దొరికింది. ఆమె పేరు వరీనా' అని ట్వీట్ చేస్తూ ఆమె ఫొటోను పంచుకున్నారు. దీంతో ఆయన అభిమానులతోపాటు ఫాలోవర్స్ ఒక్కసారిగా నిరాశ చెందారు. ఇటీవల 'టైగర్ జిందా హై'తో భారీ విజయాన్ని అందుకున్న సల్మాన్ ప్రస్తుతం 'రేస్ 3'లో నటిస్తున్నారు. రెమో డిసౌజా దర్శకుడు. జాక్వెలిన్, పూజా హెగ్డే కథానాయికలు.

రెగ్యులర్ షూటింగ్‌లో చిరు అల్లుడి చిత్రం


కళ్యాణ్ దేవ్

చిరంజీవి అల్లుడు కళ్యాణ్ దేవ్ హీరోగా పరిచయం కాబోతున్న సినిమా ఇటీవల ప్రారంభమైన విషయం విదితమే. రాకేష్ శశి దర్శకత్వంలో వారాహి చలన చిత్ర పతాకంపై సాయి కొర్రపాటి నిర్మించే ఈ చిత్రంలో మాళవిక నాయక్ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత సాయి కొర్రపాటి మాట్లాడుతూ, 'చిరంజీవి అల్లుడు కళ్యాణ్ దేవ్ హీరోగా పరిచయ చిత్రాన్ని నేను నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. రాకేష్ శశి తయారు చేసిన అద్భుతమైన కాన్సెప్ట్‌ను రాజీ పడకుండా భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కించబోతున్నాం. 'బాహుబలి' చిత్రానికి కెమెరా వర్క్‌తో జీవం పోసిన సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తుండటం సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. వీటితో పాటు అనేక ప్రత్యేక ఆకర్షణలు, విశేషాలతో ఈ సినిమా ఉండబోతుంది. తాజాగా ప్రారంభమైన షెడ్యూల్‌లో కళ్యాణ్‌దేవ్‌తోపాటు కీలక నటీనటులు పాల్గొంటున్నారు' అని అన్నారు. తనికెళ్ళ భరణి, మురళీశర్మ, నాజర్, సత్యం రాజేష్, ప్రగతి, కళ్యాణి నటరాజన్, పోసాని కృష్ణ మురళి, రాజీవ్ కనకాల, జయప్రకాష్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: రామకృష్ణ, సంగీతం: యోగేష్, నిర్మాణం: సాయి కొర్రపాటి, నిర్మాత: రజని కొర్రపాటి.

ఈ హోలీకి జాగ్రత్త !

'పిల్లౌరి' చిత్రం తర్వాత అనుష్క శర్మ నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'పరి'. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ హర్రర్ చిత్ర టీజర్ బుధవారం విడుదలైంది. ఇందులో అనుష్క మొహమంతా రక్తపు మరకలతో, విచిత్ర వేషాధారణతో భయపెడుతూనే ఆకట్టుకుంటోంది. 'ఈ హోలీకి జాగ్రత్తగా ఉండండి. దెయ్యం వచ్చేస్తోంది' అని టీజర్‌లో రాసిన క్యాప్షన్ ఆసక్తిగా ఉంది. ఇందులో అనుష్క శర్మ దెయ్యంగా కామెడీ తరహా పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా హోలీ పండుగను పురస్కరించుకుని మార్చి 2న విడుదల కానుంది.


'పరి'లో అనుష్క శర్మ

ఫిబ్రవరి వరకు టైమివ్వండి


కంగనా రనౌత్

కంగనా రనౌత్ అభిమానులకు ఓ స్వీట్ న్యూస్ తెలిపింది. త్వరలో పెళ్ళి చేసుకుంటానని చెప్పి సర్‌ప్రైజ్ చేసింది. 'పెళ్ళి కచ్చితంగా చేసుకుంటాను. అందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు టైమ్ ఇవ్వండి' అని అని తెలిపింది కంగనా. ఇటీవల ముంబయిలో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో పాల్గొన్న కంగనా రనౌత్ మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించింది. ఇప్పట్లో పెళ్ళి చేసుకునే ఆలోచన ఉందా ? అని మీడియా ప్రశ్నించగా 'ఏ నెలలో పెళ్ళి చేసుకోవాలి? ఫిబ్రవరినా? వచ్చే ఫిబ్రవరి వరకు టైమ్ ఇవ్వండి. 2019 ఫిబ్రవరిలో కచ్చితంగా పెళ్ళి చేసుకుంటా' అని సమాధానమిచ్చింది. దీంతో ఆమె అభిమానులు పెళ్ళి చేసుకోబోతున్నందుకు ఓ విధంగా ఖుషి అవుతూనే సినిమాలకు దూరమవుతుందేమో అని బాధపడుతున్నారు. అయితే తను పెళ్ళి చేసుకోబోయే వ్యక్తి ఎవరన్నది మాత్రం వెల్లడించలేదు. ఇంకా కంగనా చెబుతూ, 'కెరీర్ కూడా నాకు చాలా ముఖ్యం. నాకు వస్తున్న అవకాశాల విషయంలో రాజీపడాల్సిన అవసరం లేదు. నాకు ఏం కావాలో, నేనేం చేయాలో అది చేస్తా. ఈ విషయంలో ఎవరు ఎలా ఫీలైనా నాకు సంబంధం లేదు' అని పేర్కొంది. కంగనా ప్రస్తుతం ఝాన్సీ రాణి లక్ష్మీభాయి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రంలో నటిస్తుంది. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జూన్‌లో విడుదల కాబోతుంది.

ట్రాక్టర్లు టీఆర్ఎస్ నాయకులకే

- ఖమ్మం జిల్లాలో దారితప్పిన సబ్సిడీ ట్రాక్టర్ల పథకం
- రైతులని కాదని...టీఆర్ఎస్ నేతల అనుచరులకు
- మంత్రి ఇలాఖాలో 38లో 35 టీఆర్ఎస్‌కే
- ఈ నెల 17న 578 పంపిణీకి అధికారుల ఏర్పాట్లు



నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

రైతులకు దక్కాల్సిన సబ్సిడీ ట్రాక్టర్లను టీఆర్ఎస్ నాయకులు కొల్లగొట్టారు. మంత్రి తుమ్మల ఇలాఖాలో 38 ట్రాక్టర్లు మంజూరైతే అందులో 36 టీఆర్ఎస్ నాయకులే దక్కించుకున్నారు. ట్రాక్టర్లు పొందిన లబ్దిదారులంతా సర్పంచ్, ఎంపీటీసీ కుటుంబసభ్యులో, వారి బంధువులో ఉన్నారు. ఖమ్మం జిల్లా తుమ్మల నియోజక వర్గంలో కూసుమంచి మండలాన్ని 'నవతెలంగాణ' పరిశీలించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఖమ్మం జిల్లాలో 2015 నుంచి వాయిదా పడుతూ.. ఊరిస్తూ వస్తున్న సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ చివరకు అధికార పార్టీ నేతలకు, స్థానిక సంస్థల ప్రతినిధులకు వరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 578 మంది లబ్దిదారులకు ఈ నెల 17న మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, హరీశ్‌రావు సమక్షంలో సబ్సిడీ ట్రాక్టర్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి తుమ్మల ఇలాకాలోని పాలేరు నియోజకవర్గానికి చెందిన రైతుల నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. పరిశీలన తర్వాత వ్యవసాయాధికారితో కూడిన మండల కమిటీ 89 మందిని అర్హులుగా గుర్తించి జిల్లా కమిటీకి అప్పగించారు. అందులో 38 మందిని ఎంపిక చేయగా దాదాపు 98 శాతం మంది టీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలాన్ని నవతెలంగాణ పరిశీలించగా ట్రాక్టర్లు పొందిన వారంతా ఎంపీటీసీలు, సర్పంచులో కాకుంటే...వారి బంధువులో ఉన్నారు. రైతులను అధికారులు పూర్తిగా విస్మరించారు. మండలంలో మొత్తం 38 ట్రాక్టర్లు మంజూరైతే 36 మందీ టీఆర్ఎస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ముఖ్య నేతలు, వారి అనుచరులే ఉన్నారు. ఇదేంటీ? లబ్దిదారుల్లో రైతులేరి అని అధికారులను అడిగితే...అర్హులనే లబ్దిదారులుగా ఎంపికచేశాం అంటూ చెప్పటం గమనార్హం.

అర్హులనే ఎంపికచేశాం: అరుణకుమారి, వ్యవసాయాధికారి, కూసుమంచి

నిబంధనల మేరకే రెండున్నరెకరాలు కలిగిన ఉన్నవారి నుంచే లబ్దిదారులను ఎంపిక చేశాం. అనర్హులకు ఇవ్వలేదు. ఎవరైనా అనర్హులున్నట్టు నిరూపిస్తే వారిని జాబితాలో నుంచి తొలగిస్తాం. జాబితాలో తర్వాత ఉన్నవారికి అవకాశం ఇస్తాం.

	లబ్దిదారి పేరు	టీఆర్ఎస్‌తో అనుబంధం
1.	ఆర్. సృజన	ఎంపీపీ వెంకటరెడ్డి భార్య
2.	బారి శ్రీనివాస్	శ్రీనివాస్ వైస్ ఎంపీపీ
3.	ఇంటూరి భద్రమ్మ	ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంటూరి శేఖర్ తల్లి
4.	ఇంటూరి పుల్లయ్య	ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంటూరి శేఖర్ బంధువు
5.	అంబాల రాము	ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇంటూరి శేఖర్ అనుచరుడు
6.	నిమ్మరబోయిన చంద్రమ్మ	మత్స్య సొసైటీ అధ్యక్షులు, టీఆర్ఎస్ నాయకులు లింగయ్య భార్య
7.	బొల్లంపల్లి రమాదేవి	టీఆర్ఎస్ మండలాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి భార్య
8.	వాకా బ్రహ్మరెడ్డి	గట్టు సింగారం ఎంపీటీసీ సుధారాణి భర్త
9.	జొన్నలగడ్డ శ్రీధర్	రైతు సమన్వయ సమితి సభ్యులు జొన్నలగడ్డ రవి సోదరులు
10.	ముకులూరి శ్యాంసుందర్‌రెడ్డి	గైగోళ్లపల్లి సర్పంచ్ మౌనిక భర్త
11.	దండ్యాల బసవమ్మ	రూ.కోట్ల వ్యాపారం జరిగే సాయి ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత లక్ష్మణ్‌రావు సోదరుని భార్య
12.	కోనేటి భాస్కర్‌రావు	ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అనుచరుడు
13.	పుట్టా అనిత	టీఆర్ఎస్ నాయకుడు బాలకృష్ణారెడ్డి అనుచరుడు
14.	బానోత్ శ్రీనునాయక్	ఎర్రగడ్డ తండా సర్పంచ్, టీఆర్ఎస్
15.	కోనేటి రామారావు	ముత్యాలగూడెం టీఆర్ఎస్ గ్రామశాఖాధ్యక్షులు
16.	కొండపర్తి సురేష్	టీఆర్ఎస్ నాయకులు మలీదు వెంకన్న అనుచరుడు
17.	చాట్ల పరుశురాం	గట్టుసింగారం సర్పంచ్, టీఆర్ఎస్
18.	పడిశాల యల్లయ్య	భగత్‌వీడు సర్పంచ్, టీఆర్ఎస్
19.	ఉల్లోజు పెంటయ్య	నాయకన్‌గూడెం టీఆర్ఎస్ నాయకులు
20.	చాట్ల సత్యనారాయణ	గట్టుసింగారం సర్పంచ్ తమ్ముడి వరుస
21.	ఎడవల్లి ముత్తయ్య (గుర్వాయిగూడెం)	మాజీ ఎంపీపీ, టీఆర్ఎస్ నాయకుడు
22.	బండారుపల్లి రమాదేవి	రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు వీరెల్లి నాగేశ్వరరావు కుమార్తె
23.	వద్యా పూల్‌సింగ్	వీరెల్లి నాగేశ్వరరావు అనుచరుడు
24.	పాండ్యా	కోక్యాతండా మాజీ సర్పంచ్, టీఆర్ఎస్
25.	బానోత్ బాలాజీ	(పోచారం ఎంపీటీసీ బానోత్ శ్రీనివాస్ సమీప బంధువు

మోడీ సర్కారు హయాంలో ఆదాయం కాదు.. ఆత్మహత్యలు రెండింతలు

- నాలుగేండ్లయినా ఎన్నికల 'హాంగోవర్'లోనే ప్రధాని
- యూపీఏకు ఎన్డీయేకు తేడా లేదు :సీపీఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

రైతుల ఆదాయం రెండింతలు చేస్తామనే వాగ్దానంతో నరేంద్రమోడీ సర్కారు అధికారంలోకి వచ్చిందని, కానీ గత నాలుగేండ్లలో రైతుల ఆదాయం పెరగకపోగా.. ఆత్మహత్యలు రెండింతలయ్యాయని సీపీఐ(ఎం) ఎంపీ కేకే రాగేష్ విమర్శించారు. పైగా గత యూపీఏ సర్కారుకు ప్రస్తుత ఎన్డీయే సర్కారు తేడా లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను, పథకాలనే మోడీ సర్కారు అమల్జేస్తోందని విమర్శించారు. 'పాతసీసాలో కొత్తసారా'గా అభివర్ణించిన ఆయన.. నాలుగేండ్లలో మోడీ సర్కారు విధానపరంగా తీసుకొచ్చిన మార్పులేంటని నిలదీశారు. ఇక 'మంచిరోజులు' 'సబ్‌కాసాథ్ సబ్‌కా వికాస్' నినాదాలను మరిచిపోయారని, అందుకే రాష్ట్రపతి ప్రసంగంలోనూ ప్రస్తావించలేదని విమర్శించారు. కేంద్ర సర్కారు హామీలను చాలా ప్రకటిస్తోందని, కానీ ఒక్కటీ అమలు చేయడం లేదని అన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తికావొస్తున్నా నేటికీ ప్రధానమంత్రి ఎన్నికల 'హాంగోవర్'లో ఉన్నారని ఎద్దేవా చేశారు.రాజ్యసభలో బుధవారం జరిగిన రాష్ట్రపతి ప్రసంగ ధన్యవాద తీర్మానంపై కేకే రాగేష్ మాట్లాడారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో కొత్తగా ఏమీలేదు. గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర మంత్రులు చేస్తున్న ప్రకటనలనే రాష్ట్రపతి తన ప్రసంగంలో చెప్పారు. మోడీ సర్కారు చాలా హామీలు ఇస్తోంది. నాలుగేండ్లు పూర్తికావొస్తోంది. కానీ ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు' అని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలేంటి. ఎంత వరకు అమలు చేశాం. ఇంకా ఏమేమీ అమలు చేయాల్సి ఉంది అని సమీక్షించుకోవాల్సిన సమయం. కానీ ప్రధాని మోడీ ఇప్పుడు కూడా తానేదో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు మాట్లాడు తున్నారు. ఎన్నికల హాంగోవర్ తొలగిపోలేదు' అని విమర్శించారు. 'యూపీఏ సర్కారు అవలంబించిన నయా సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా చోటుచేసుకున్న అవినీతి, అధిక ధరలు, ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ తదితర ప్రజావ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. మంచిరోజులు తీసుకొస్తానని, సబ్‌కాసాథ్ సబ్‌కా వికాస్ అని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చారు. కానీ ఈ నాలుగేండ్లలో ప్రభుత్వ విధానంలో ఏమైనా మార్పులు తీసుకొచ్చారా?' అని రాగేష్ ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక స్థానాలు గెలిచిన మాట వాస్తవమేనని, కానీ ఆ పార్టీకి కేవలం 31 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని గుర్తు చేశారు. 'దేశంలోని 69 శాతం ప్రజానీకం మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఓటు వేసింది' అని తెలిపారు. 'రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఆరోపించినట్టు నాలుగేండ్లలో మోడీ సర్కారు యూపీఏ పథకాలను, విధానాలను అమలు చేస్తోంది. కేంద్రమంత్రులు ఉజ్వల పథకాన్ని చాలా కీర్తిస్తున్నారు. ఈ పథకం గొప్పదే. కానీ రెండో పార్శ్యం కూడా చూడాలి. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరలను నాలుగేండ్లలో 17 సార్లు పెంచింది. సబ్సిడీలను ఎత్తేస్తోంది. ఈ పరిస్థితుల్లో పేదలు గ్యాస్ సిలిండర్ కొనగలరా?. 2014లో గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ కోసం రూ.42 వేలకోట్లు కేటాయించగా.. ఈ యేడాది రూ. 10 వేల కోట్లకు తగ్గించారు. ఇలా ఒకవైపు ఇస్తున్నామని మరోవైపు నుంచి దోచుకుంటున్నారు. ఇది ప్రజలను వంచించడమే' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వంపై పలు ప్రశ్నలు సంధించారు. 'నాలుగేండ్లలో ఎంత నల్లధనం వెలికితీశారు? స్విస్ ఖాతాదారుల పేర్లు ఏవి? పనామా పేపర్ల గురించి ఎందుకు మాట్లాడ్డం లేదు?' అని నిలదీశారు.

'నోట్లరద్దు నిర్ణయం తరువాత 99 శాతం పాతనోట్లు బ్యాంకుల్లోకి తిరిగి వచ్చాయి. ఈ నిర్ణయంతో నల్లడబ్బును తెల్లగా మార్చుకునేందుకు అవకాశమిచ్చారు. ప్రజల కష్టాలకు బాధ్యత ఎవరు వహిస్తారు? చిన్న,మధ్యతరహా పరిశ్రమల రంగం కుదేలైంది. దీనికి ఎవరు బాధ్యులు? ఆన్‌లైన్ లావాదేవీలకు యూజర్‌ఛార్జీలు ఎందుకు వేస్తు న్నారు?' అని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెండింతలు కాకపోగా.. ఆత్మ హత్యలు రెండింతలయ్యాయని అన్నారు. అయితే వ్యవసాయ సంక్షోభంపై కేకే రాగేష్ మాట్లాడుతున్న సమయంలో.. కేటాయించిన గడువు పూర్తయిందంటూ మైక్ కట్ చేశారు.

పోరుబాటలో...కమ్యూనిస్టులు..

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్‌సీపీ ఏ పార్టీ వచ్చినా సరళీకృత ఆర్థిక విధానాలనే అమలుచేస్తున్నాయని విమర్శించారు. సరళీకృత విధానాల్లో భాగంగా భూములను గుంజుకోవడం, కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం వంటి పనులు చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో సైన్స్ మీద బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు దాడికి పాల్పడుతున్నాయని చెప్పారు. మతోన్మాద వ్యాప్తికి సైన్స్ అడ్డంకిగా మారుతుందని సంఘ్‌పరివార్ శక్తులు భావిస్తున్నాయని అన్నారు. డార్విన్ సిద్ధాంతాన్నే ప్రశ్నించే పరిస్థితి వచ్చిందన్నారు. సైన్స్ విషయాలు, ప్రచారాలను ఒక్క జన విజ్ఞాన వేదిక(జేవీవీ)కే పరిమితం చేయరాదని, అన్ని సంఘాలూ పాలు పంచుకోవాలని సూచించారు. సమాజంలో, ప్రజల్లో, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి నిరంతరం సైన్స్ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇది చేయకుండా మతోన్మాదాన్ని అడ్డుకోలేమని అన్నారు. మూఢనమ్మకాలను పారదోలేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు, మ్యాజిక్‌షోలు ఏర్పాటు చేయాలని సూచించారు. పేదలు, గిరిజనులు, దళితుల్లోకి వెళ్లేందుకు సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన హామీలను అమలులో బీజేపీ ప్రభుత్వం విద్రోహం చేస్తోందన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. సమయం వచ్చినప్పుడల్లా పరిష్కారం కాని విభజన అంశాలు, బీజేపీ హామీలను గుర్తు చేసి ప్రజల్లో చైతన్యం పెంచాలని కోరారు. అందరితో కలిసి పనిచేసేదే లాల్‌జెండా అని స్పష్టం చేశారు. దోపిడీకి గురయ్యే వారంతా బహుజనులేనని, వారికోసం పనిచేయాలని కోరారు. సామాజిక న్యాయంపై మాట్లాడితే వర్గఐక్యత కోల్పోతామని భావించడం సరైంది కాదన్నారు. సామాజిక న్యాయం, కులవివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలన్నీ వర్గపోరాటంలో అంతర్భాగమని అన్నారు. దోపిడీ, అణచివేత, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడేది కమ్యూనిస్టులేనని చెప్పారు. పీడిత ప్రజలందర్నీ ఏకం చేయాలని, పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 18-22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సూచించారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని

- రెండోసారి ఏకగ్రీవ ఎన్నిక
- 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
- 60 మందితో రాష్ట్ర కమిటీ

నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి బొల్లె జగదీశ్వర్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండ పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో చివరిరోజు బుధవారం ఆ పార్టీ నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. 13 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం, 60 మందితో నూతన రాష్ట్ర కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

1.తమ్మినేని వీరభద్రం
2. ఎస్ వీరయ్య
3. చెరుపల్లి సీతారాములు
4. జి నాగయ్య
5. చుక్కరాములు
6. నంద్యాల నర్సింహ్మారెడ్డి
7. సున్నం రాజయ్య
8. బి వెంకట్
9. టి జ్యోతి
10. జూలకంటి రంగారెడ్డి
11. పి సుదర్శన్‌రావు
12. జి రాములు
13. డిజి నర్సింహారావు

రాష్ట్ర కమిటీ సభ్యులు

(పైన 13 మంది కలిపి)

14. ఎం సాయిబాబు
15. జె వెంకటేష్
16. పాలడుగు భాస్కర్
17. ఎస్ రమ
18. టి సాగర్
19. పి జంగారెడ్డి
20. బి హైమావతి
21. జాన్‌వెస్లీ
22. కిల్లె గోపాల్
23. బండారు రవికుమార్
24. పివి శ్రీనివాస్
25. ఎం సుబ్బారావు
26. ఎ నర్సిరెడ్డి
27. బి బిక్షమయ్య
28. హిమబిందు
29. ఆర్ శ్రీరాంనాయక్
30. ఎంవి రమణ
31. పి జయలక్ష్మి
32. ఆర్ వెంకట్రాములు
33. మల్లు లక్ష్మి
34. పి ఆశయ్య
35. పి ప్రభాకర్
36. రవి
37. ఎండి అబ్బాస్
38. పొన్నం వెంకటేశ్వర్లు
39. నున్నా నాగేశ్వరరావు
40. బుగ్గవీటి సరళ
41. ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి
42. తుమ్మల వీరారెడ్డి
43. ఎం సర్వయ్య
44. ముల్కలపల్లి రాములు
45. ఎం నాగార్జునరెడ్డి
46. పారేపల్లి శేఖర్‌రావు
47. మచ్చ వెంకటేశ్వర్లు
48. ఎజె రమేష్
49. కో అప్షన్
50. ఎండి జహంగీర్
51. కొండమడుగు నర్సింహ
52. సాదుల శ్రీనివాస్
53. భూపాల్
54. కో ఆప్షన్
55. సారంపల్లి వాసుదేవరెడ్డి
56. ఆముదాల మల్లారెడ్డి
57. సూడి కృష్ణారెడ్డి
58. ఎం శ్రీనివాస్
59. టి భీంరావు
60. రత్నమాల

ఆహ్వానితులు

1. కాసాని ఐలయ్య
2. ఆర్ సుధాభాస్కర్
3. పి సోమయ్య
4. నాగటి నారాయణ
5. ఎండి జబ్బార్
6. ఎ మల్లేష్
7. జి ముకుందరెడ్డి
8. జి జగదీశ్
9. టి స్కైలాబ్‌బాబు

ప్రత్యేక ఆహ్వానితులు


1. మల్లు స్వరాజ్యం
2. సారంపల్లి మల్లారెడ్డి
3. పి రాజారావు

కంట్రోల్ కమిషన్

1. ఎస్ వినయకుమార్ (ఛైర్మెన్)
2. లెల్లెల బాలకృష్ణ
3. ఎన్ సోమయ్య
4. మర్లపాటి రేణుక
5. బి మల్లేష్

పార్లమెంట్‌లో మోడీ డైలాగులు

- కాంగ్రెస్‌పై ఓ రేంజ్‌లో ప్రధాని గుస్సా
- లోక్‌సభ తలుపులు మూసి విభజన చట్టం చేశారని విమర్శ
- మహిళా ఎంపీపై వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ పార్లమెంట్‌లో ప్రధాని మోడీ చేసిన ప్రసంగం...రాజకీయ ఎన్నికల ఉపన్యాసాన్ని తలపించింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ చరిత్రనంతా తవ్వి...తనదైన వ్యంగ్య ధోరణితో విమర్శల వాన కురిపించారు. ఏపీ విభజనతో సహా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ, దేశంలోని అన్ని సమస్యలకూ కారణం కాంగ్రెస్సేనని, తాను కానని చెప్పే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ పార్టీ, పాలనా తీరు...ఏపీ విభజన విషయాలు ఆయన ప్రసంగంలో ప్రధానంగా చోటుచేసుకున్నాయి.

బుధవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ...గతంలో మూడు రాష్ట్రాల ఏర్పాటు అనంతరం ఎలాంటి సమస్యలూ రాలేదని, వాజ్‌పేయి హయాంలో అప్పటి ప్రభుత్వం రాజనీతిజ్ఞతతో వ్యవహరించిందని ఈ సందర్భంగా మోడీ చెప్పారు. రాజకీయ దృష్టితో కాకుండా ప్రజల కోసం పనిచేశామని చెప్పుకొచ్చారు.

దేశంలో సమస్యలన్నింటికీ కారణం కాంగ్రెస్సే..

కాంగ్రెస్ చేసిన పాపాలే ఇప్పటికీ వెంటాడుతున్నాయన్నారు. రాష్ట్రాలనే కాదు దేశాన్ని కూడా కాంగ్రెస్ విభజించిందని విమర్శించారు. అంజయ్య, పీవీ, నీలం సంజీవరెడ్డిలను కాంగ్రెస్ అవమానించిందన్నారు. ఏపీ ప్రజల మనోభావాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. లోక్‌సభ తలుపులు మూసి మరీ విభజన చట్టాన్ని ఆమోదించారన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు.

ఏపీ విభజన జరిగి నాలుగేండ్లయినా సమస్యలున్నాయన్నారు. దేశం అభివృద్ధి చెందకపోవడానికి కాంగ్రెస్ విధానాలే కారణమని విమర్శించారు. వ్యవస్థలన్నింటినీ కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకునేదని, చివరికి చీఫ్ జస్టిస్‌నూ తనే ఎంపిక చేసుకునేదని దుయ్యబట్టారు. కర్నాటక ఎన్నికల నేపథ్యంలోనే విపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడారని, ఎన్నికల అనంతరం ఆయన ఎక్కడుంటారోనని వెక్కిరింపు ధోరణిలో మాట్లాడారు.

ప్రజాస్వామ్యం అంటే మాదే...

దళితులను అవమానించే కాంగ్రెస్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం తగదని మోడీ అన్నారు. ప్రజాస్వామ్యం అంటే తమదేనని చెప్పుకొచ్చారు. నిర్ణీత సమయం ప్రకారం అన్ని పనులూ పూర్తి చేస్తున్నామన్నారు. తమకు ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని, గత మూడేండ్లలో ఎవరూ చేయని పనులను తాము చేశామన్నారు. రాజీవ్ గాంధీ చేసిన అవమానాల వల్లే ఏపీలో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టారన్నారు.

రాజ్యసభలోనూ ఫైర్...

లోక్‌సభలో ప్రసంగించిన ప్రధాని మోడీ, ఆ తర్వాత రాజ్యసభలోనూ అదే ధోరణిలో కాంగ్రెస్‌ను టార్గెట్ చేశారు. గత యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పేర్లు మార్చడం తప్ప ఎన్డీయే ప్రభుత్వం ఏమీ చేయడం లేదన్న విమర్శల్ని తాము పెద్దగా పట్టించుకోమన్నారు. తమ ప్రభుత్వం లక్ష్య సాధనపైనే దృష్టి పెట్టిందని, తమది 'ఎయిమ్ ఛేంజర్' ప్రభుత్వమని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అవసరం లేదని, ఆ పార్టీని రద్దు చేయాలని మహాత్మాగాంధీ మాటల్ని గుర్తుచేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భారత్ తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు బాధపడుతోందన్నారు. సంక్షేమ పథకాలపై నిర్మాణాత్మక సూచనలు స్వీకరిస్తామని మోడీ చెప్పారు.

ఎంపీ రేణుకా చౌదరిపై వెటకారం

రాజ్యసభలో తన ప్రసంగానికి కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి పదేపదే అడ్డుపడటంతో, ఆమెపై మోడీ వెటకారపు వ్యాఖ్యలు చేశారు. "సభాపతిగారు.. రేణుకాజీని ఏమీ అనొద్దని మిమ్మల్ని కోరుతున్నా.. రామాయణం సీరియల్ తర్వాత ఇంతటి నవ్వులను వినే సౌభాగ్యం ఇప్పుడే దక్కింది" అంటూ మోడీ వ్యంగ్య ధోరణిలో వ్యాఖ్యలు చేయటం వివాదాస్పదమైంది. దీనిపై ఎంపీ రేణుకా చౌదరి స్పందిస్తూ..."వికృతమైన ప్రవర్తన, నోటి దురుసు"ను తెలియజేస్తోందన్నారు. ఇంతకు మించి ప్రధాని మోడీ నుంచి మనమేమీ ఆశించలేమని అన్నారు. మహిళల్ని మోడీ సర్కార్ ఎంత చులకనగా చూస్తోందో దీనిని బట్టి తెలుస్తోందన్నారు.

సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీది : రాహుల్‌గాంధీ

పార్లమెంట్‌లో ప్రతిపక్షాల చేసే ఆరోపణలకు ప్రధాని మోడీ సమాధానం చెప్పాలిగానీ, ప్రతిపక్షాలపై ఆయన ఆరోపణలు చేయటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. పార్లమెంట్ ఇరు సభల్లో మోడీ చేసిన ప్రసంగాన్ని తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ బయట కాంగ్రెస్ పార్టీని, పాలనను విమర్శించే హక్కు, స్వేచ్ఛ ప్రధాని మోడీకి ఉందన్నారు. పార్లమెంట్ వేదికపై సమాధానమివ్వాల్సిన బాధ్యతలో మోడీ ఉన్నారని, ఆరోపణలు చేయటం కోసం కాదని, ఇన్ని మాట్లాడారు..రాఫెల్ ఒప్పందం గుట్టు ఎందుకు బయటపెట్టడం లేదని రాహుల్ ప్రశ్నించారు. తన పాలన, ప్రభుత్వ విధానాల వైఫల్యాల్ని కప్పిపుచ్చుకోవటం కోసమే మోడీ ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పృథ్వీ-2 పరీక్ష సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

ప్రయోగించింది. కాగా.. నిర్దేశించిన లక్ష్యాన్ని పృథ్వీ-2 విజయవంతంగా ఛేదించిందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయాణించే ఈ క్షిపణి 350 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సునాయసంగా ఛేదించగలదు. 500 నుంచి 1000 కిలోగ్రాముల వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలదు. మంగళవారం అగ్ని-1, గతనెల 18న అగ్ని-5 క్షిపణులను పరీక్షించిన సంగతి తెలిసిందే.

సవాల్ నా వరకే..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటామంటూ వ్యాఖ్యలు చేశారన్నారు. బుధవారం ప్రగతిభవన్‌లో ఆయన ఇష్టాగోష్టిలో మాట్లాడారు. 2019 సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్న వ్యాఖ్యలకు తాను ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఉత్తమ్ సూటిగా సమాధానం చెప్పకుండా "శిఖండి" రాజకీయం చేస్తున్నారని తప్పుపట్టారు. తన 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఉత్తమ్ లాంటి వాడిని చూడలేదని, గూడారాల చాటున, కుటుంబం వెనక దాక్కొని చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయనకు దమ్ము...ధైర్యం ఉంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు. తన వయస్సు, రాజకీయ అనుభవాన్ని గుర్తు పెట్టుకొని మాట్లాడాలని ఫైరయ్యారు 'తనను బచ్చాగాడని ఉత్తమ్ అంటున్నాడు...రాహుల్ గాంధీ బచ్చాగాడు కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. నా కన్న వయస్సులో రెండేండ్ల మాత్రమే రాహుల్ ఒక పెద్ద దద్దమ్మ అని, అందరూ ఆయనను పప్పుముద్ద అని పిలుస్తారు. ఆయన కింద పని చేస్తున్న ఉత్తమ్ ఓ దద్దమ్మ. కుంతియా.. తంతియాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు' అని విమర్శించారు. ఒంటరిగాపోటీ చేసి 2019 ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. టీజేఏసీ ఛైర్మెన్ కోదండరామ్ ఏర్పాటు చేయనున్న కొత్త పార్టీని టీఆర్ఎస్ స్వాగతిస్తోందన్నారు. తెలంగాణలో ఇంకెవరైనా పార్టీ పెట్టుకోవచ్చన్నారు. ఆ పార్టీలను నిర్ణయించేది ప్రజలేనన్నారు. దేశంలో జాతీయ పార్టీలే లేవని కేటీఆర్ చెప్పారు.

కాంగ్రెస్ అంటేనే పెద్ద లోఫర్ పార్టీ

కాంగ్రెస్ అంటేనే పెద్ద లోఫర్ పార్టీ అని ముఖ్యమంత్రి పదవుల కోసం నరహంతకులుగా మారారని కేటీఆర్ విమర్శించారు. 1991లో ముఖ్యమంత్రి దించడానికి హైదరాబాద్‌లో మతకల్లోహాలను రెచ్చగొట్టి నరమేధాన్ని సృష్టించారని, అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి స్వయంగా చెప్పారని గుర్తు చేశారు. 356 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకొని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావును పదవి నుంచి దించారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో చిన్న పాటి నాయకుడిని హత్య చేస్తే దానిని కాంగ్రెస్ రాజకీయం చేస్తుందన్నారు. నల్లగొండ ప్రజలకు ఫ్లోరోసిస్ వ్యాధిని అంటగట్టారే తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం రూ40వేల కోట్ల ప్రతిపాదనలు పంపితే, బాహుబలి సినిమాకు వచ్చిన కలెక్షన్ల కన్న తక్కువగా ఇచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీకి మిత్రపక్షంగా ఉన్నా టీడీపీకే ఇవ్వలేదన్నారు. ఇక మాకేం ఇస్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదని చెప్పారు. బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు ఉన్నారంటే అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాలకు పరిమితమవుతున్నారని విమర్శించారు. బీజేపీ తీరును ప్రజల్లోకి తీసుకెళతామన్నారు.

కల్లాల్లోనే కన్నీళ్లు

(మొదటిపేజీ తరువాయి)

40కిపైగా సీడ్ కంపెనీలున్నాయి. ఈ సీడ్ వ్యాపారులు ప్రతియేటా అక్టోబర్, నవంబర్ నెలల్లో రైతులతో ముందస్తు కొనుగోలు ఒప్పందం చేసుకొని సిండికేటుగా ధర నిర్ణయించేవారు. అయితే, రైతుల ఉద్యమాల వల్ల ముందస్తు ఒప్పందాలకు తావులేకుండా పోయింది. అయినా, రుచిమరిగిన వారు ఊరుకోరు.. అందుకే వ్యాపారులు పంట రాగానే అదనుపై ధర తగ్గించేలా కుట్రపన్నారు. 'ఈసారి పంటసాగు విస్తీర్ణం, దిగుబడి బాగా వచ్చింది. ఇప్పటికిప్పుడు విక్రయిస్తే కనీసం క్వింటాకు రూ.2వేలు అయినా వస్తాయి.. లేదంటే ఇంకా తగ్గిపోతుంది' అని రైతులకు మాయమాటలు చెప్పి నమ్మబలుకుతున్నారు. అది నిజమేనని రైతులు నమ్మేలా.. వారం రోజుల వ్యవధిలో క్వింటాపై రూ.100 నుంచి రూ.200 తగ్గించారు. చివరకు క్వింటా రూ.1800 పడిపోయేలా పథకం రచించారు. దీంతో రైతాంగం గత్యంతరం లేక రోడ్డెక్కి నిరసన తెలుపుతోంది. కొంతమంది రైతులు చేసేదేమీ లేక ఇప్పటికే 20శాతం పంటను క్వింటా రూ.1800కు అమ్మేసుకున్నారు. ఇకముందు ఇంకా ధర పడిపోయే అవకాశం ఉందని దళారులు ప్రచారం చేస్తూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ఎర్రజొన్న రైతులకు మద్దతు ధరపై నోరు విప్పకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులు రాని వైనం..

ఆర్మూర్ డివిజన్‌లోని 110 గ్రామాల్లో 45వేల ఎకరాల్లో ఎర్రజొన్న సాగుచేశారు. ఎకరా సాగుకు రూ.45వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం దళారుల మయాజాలంతో క్వింటా ధర రూ.1800గా నిర్ణయిస్తున్నారు. ఈ ధర కూడా వస్తుందో రాదోననే భ్రమలు కల్పించేలా క్వింటా రూ.1500 వరకు పడిపోయినట్టు ప్రచారం చేస్తుండటం గమనార్హం. ఇప్పటివరకు 20శాతం పంట విక్రయించారు. ఎకరాకు 18 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రాగా.. (క్వింటాకు రూ.1800 చొప్పున రైతు నుంచి కొనుగోలు చేయగా) రూ.32,400 మాత్రమే వస్తోంది. ఇది పెట్టిన పెట్టుబడితో పోల్చితే రూ.12వేలకు పైగా నష్టమే. ఈ నేపథ్యంలో ఎర్రజొన్న రైతాంగం ఐక్యకార్యాచరణ కమిటీ పేర ఆందోళనకు సిద్ధమౌతోంది. ఈనెల 9న ఎర్రజొన్న రైతులు చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చారు.

దళారులు చెప్పినట్లే.. : గంగారాం, హాసకొత్తూర్- కమ్మర్‌పల్లి

క్వింటాకు రూ.1800 అంటే.. అంతకే అమ్ముకోవాల్సి వస్తోంది. దళారులు ఎట్లా చెబితే అట్టే ఉంది. ప్రభుత్వం నుంచి మద్దతు ధర ప్రకటన లేకపోవడం బాధాకరం.

క్వింటాకు రూ.4,500 చెల్లిస్తేనే గిట్టుబాటు : చిన్నగంగారాం- మోర్తాడ్

ఇప్పుడున్న ధరకు జొన్నలు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు వస్తలేవు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నాం. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించనందున దళారులను ఆశ్రయిస్తున్నం. ప్రభుత్వమే క్వింటాకు రూ.4,500 చెల్లిస్తే గిట్టుబాటవుతుంది.

రాఫెల్ డీల్ వెనుక!

(మొదటిపేజీ తరువాయి)

వేలకోట్ల రూపాయలు ప్రజల సొమ్ము, ఏవో సాకులు చూపి ఒప్పందం వివరాలు దాచి ఉంచుతామని చెప్పడానికి వీల్లేదు. ఒక గణతంత్ర దేశంలో పార్లమెంట్‌కు తెలియజేయకుండా సమాచారాన్ని దాచటమేంటని సీపీఐ(ఎం) ప్రశ్నించింది. ఇలా చేయటం వల్ల ఇది రక్షణ శాఖపైనా, ప్రభుత్వ రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని, పారదర్శక పాలన పట్ల నమ్మకముంటే వెంటనే ఒప్పందం వివరాలు బయటపెట్టాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

కలుషిత నీరు తాగి 400 మందికి అస్వస్థత

కామారెడ్డి జిల్లాలో ఘటన

నవతెలంగాణ-కామారెడ్డి

కలుషిత నీరు తాగి 400 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం చిన్నలచ్చాపేటలో జరిగింది. గ్రామానికి చెందిన 400 మంది నాలుగు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి అవి తీవ్రమయ్యాయి. స్థానిక సర్పంచి ఆంజనేయులు వైద్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు బాధితులను మాచారెడ్డి, కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రుల్లో చేర్పించారు. గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో లీకేజీ ఏర్పడి తాగునీరు కలుషితమైందని, ఈ నీరు తాగిన గ్రామస్తులు అస్వస్థతకు గురైనట్టు వైద్యులు నిర్ధారించారు.

నేడు ముద్దుకృష్ణమ అంత్యక్రియలు

తిరుపతి: ఏపీ టీడీపీ ఎంఎల్‌సి గాలి ముద్దుక్రిష్ణమనాయుడు డెంగ్యూ జ్వరంతో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీ నేతల సందర్శనార్థం హైదరాబాద్‌లో ఆయన భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం వరకు ఉంచారు. అనంతరం విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.25కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురానికి తీసుకొచ్చారు. అప్పటికే ఆ గ్రామంలో జిల్లా నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు చేరుకున్నారు.

సెన్సెక్స్ ▼113 34,082

నిఫ్టీ ▼22 10,476

స్టాక్ మార్కెట్లలో కొనసాగిన నష్టాలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాల పరంపర కొనసాగుతోంది. ప్రపంచ మార్కెట్ల ప్రతికూల పరిణామాల నేపథ్యంలో మంగళవారం భారీగా పతనమైన దేశీయ స్టాక్ మార్కెట్లలో బుధవారం కూడా నష్టాలు కొనసాగాయి. ఉదయం సెషన్‌లో కోలుకున్న మార్కెట్లు ఆ తరువాత భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) పాలసీ ప్రకటన అనంతరం నష్టాల పాలయ్యాయి. సెన్సెక్స్ 113 పాయింట్లు పడిపోయి, 34,082 పాయింట్లు వద్ద ముగిసింది.. నిఫ్టీ 22 పాయింట్ల నష్టంతో 10,500 పాయింట్ల దిగువన 10,476 పాయింట్ల వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు సైతం 141 పాయింట్లు కోల్పోయింది. మార్కెట్లో మేటిగా రాణించిన స్టాక్స్‌లో హెచ్‌పీసీఎల్, అరబిందో ఫార్మా, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ, టాటా పవర్‌లు ముందంజలో ఉన్నాయి.

హోండా నుంచి యాక్టివా -5జీ!



ముంబయి, న్యూఢిల్లీ: హోండా మోటార్ సైకిల్ స్కూటర్స్ ఇండియా సంస్థ అత్యాధునిక యాక్టివా వాహనాన్ని భారత్‌లో ఆవిష్కరించింది. ఆటో ఎక్స్‌పో 2018లో యాక్టివా 5జీని ఆ సంస్థ ప్రదర్శనకు ఉంచింది. కొత్త డీలక్స్ వేరియంట్, ఫుల్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, పొజిషన్ ల్యాంప్, కొత్త ఫ్రంట్ క్రోమ్ గార్నిష్‌తో ఈ సరికొత్త ఐదవ జనరేషన్ యాక్టివాను మార్కెట్‌లోకి ఆవిష్కరించినట్టు హోండా చెప్పింది. ఈ కొత్త యాక్టివా 5జీ రెండు రంగుల్లో అందుబాటులో ఉండనుంది. ఒకటి డజెల్ యెల్లో మెటాలిక్, రెండు పెర్ల్ స్పార్టన్ రెడ్. అంతేకాక ఫ్రంట్ హుక్, సీట్ ఓపెనర్ స్విచ్‌తో 4-ఇన్-1 లాక్, కొత్త మఫ్లర్ ప్రొటెక్టర్‌లు కూడా ఉన్నాయి. మెకానిక్ పరంగా యాక్టివా 5జీ అలానే ఉండనుంది. 109సీసీ, సింగిల్ సిలిండర్ ఇంజిన్, బీఎస్-4 ఇంజిన్ నిబంధనలకు అనుగుణంగా దీన్ని రూపొందించారు. ఈ కొత్త స్కూటర్ త్వరలోనే మార్కెట్‌లో అందుబాటులోకి రానుంది.

మూడోసారి'.. వడ్డీరేట్లు యథాతథం!

బడ్జెట్‌తో ధరలు పెరగొచ్చు!

- 'స్థిరీకరణ' వదిలి వ్యయంతో నష్టం
- ఆర్థికం క్రమంగా పుంజుకొంటోంది
- జీవీఏ 6.6 శాతానికి చేరుకోవచ్చు..
- ద్రవ్యోల్బణ లక్ష్యానికి కట్టుబడి ఉన్నాం..
- చమురు ధరల పెరుగుదలతో ముప్పు
- ప్రపంచ మార్కెట్ల పనితీరుపై కలవరం
- చప్పగా ముగిసిన ఎంపీసీ సమావేశం



ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశం అనంతరం మీడియా ముందుకు వచ్చిన ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ సభ్యులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల పట్ల 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్‌బీఐ) కొంత ఆవేదన వ్యక్తం చేసింది. వివిధ పథకాలకు ప్రభుత్వ అత్యధిక కేటాయింపుల జరపడం మూలంగా సర్కారు ఖర్చులు పరిధిని మించిపోయే అవకాశం ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. దీంతో ఆర్థిక స్థిరీకరణ చేజారి.. అత్యధిక నిధుల కోసం సర్కారు ప్రయివేటు నిధులపై ఆధారపడాల్సి రావొచ్చని తెలిపింది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థపై భారం పడడంతో పాటు ద్రవ్యోల్బణం మరింతగా పెరిగే ప్రమాదం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. 'ద్రవ్య పరపతి విధాన సమీక్ష' నిమిత్తం సమావేశమైన ఆర్‌బీఐ 'పరపతి విధాన కమిటీ' (ఎంపీసీ) తన రెండు రోజుల సమావేశంలో కేంద్ర బడ్జెట్‌పై క్షుణ్ణంగా విశ్లేషణ జరిపినట్టు సమాచారం. రైతులకు సాగు ప్రయోజనకరంగా మార్చేందుకు గాను సర్కారు బడ్జెట్‌లో అన్నదాతల ఉత్పత్తి ఖర్చుకు 1.5 రెట్లు అధికంగా కనీస మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆర్‌బీఐ విశ్లేషించింది. దీనికి తోడు ఆర్థిక స్థిరీకరణ లక్ష్యంపై కూడా కొంత అనుమానాలను వ్యక్తం చేసింది. ప్రభుత్వ వ్యయం పెరిగి సర్కారీ పెట్టుబడులు తగ్గిపోవడం ప్రయివేటు పెట్టుబడులు విస్తరించేందుకు ఊతం లభించవచ్చని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. కేంద్రం బడ్జెట్‌లో వ్యవసాయం, అన్నదాతలు, మౌలిక రంగాలపై ప్రధానంగా దృష్టి సారించడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దన్ను లభిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. చమురు ధరలు పెరుగుతుండడం, చమురేతర పరిశ్రమల మూలధన వస్తువుల ధరలు పెరుగుతుండడం మూలంగా వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో సీపీఐ ద్రవ్యోల్బణం 5.1-5.6 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బీఐ లెక్కగట్టింది. ద్వితీయార్ధ భాగంలో ఇది 4.5-4.6 శాతంగా ఉండొచ్చని తెలిపింది.

కీలక వడ్డీరేట్లు యథాతథం..

వరుసగా మూడో ద్రవ్యపరపతి విధాన సమీక్షలోను ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో వడ్డీరేట్లను ఇప్పుడున్న స్థాయిలోనే కొనసాగించాలని ఎంపీసీ నిర్ణయించినట్టుగా బుధవారం ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఎంపీసీలోని అయిదుగురు సభ్యులు సమ్మతి తెలపగా.. ఒక సభ్యుడు వ్యతిరేకత తెలిపినట్టుగా ఆర్‌బీఐ వెల్లడించింది. దీంతో రానున్న రెండు నెలలకు కూడా రెపోరేటు 6 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ 6.25 శాతంగాను, రివర్స్ రెపోరేటు 5.75 శాతంగానే కొనసాగనుంది. మధ్య కాలానికి లక్ష్యంగా పెట్టుకున్న 4 శాతం (వినియోగదారు ధరల) ద్రవ్యోల్బణ స్థాయిని అందుకోవడంమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తరుణంలో.. వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడమే మేలని తాము నిర్ణయించినట్టు ఎంపీసీ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీవీఏ వృద్ధి రేటు 6.6 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బీఐ అంచనా కట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇది 7.2 శాతానికి చేరువ కావచ్చని పేర్కొంది.

ద్రవ్యోల్బణం మరింత పెరగొచ్చు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1శాతానికి పెరిగే అవకాశముందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది. ఈ మేరకు నేడు జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ పేర్కొంది. చమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉద్యోగాల జీతాల పెంపు వల్లే ద్రవ్యోల్బణం పెరిగే అవకాశముందని ఆర్‌బీఐ చెబుతోంది. 'దేశీయంగా జనవరిలో పెట్రోల్, డీజిల్ ధరలు వేగంగా పెరిగాయి. అంతకుముందు అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే నాలుగో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1శాతం వరకు ఉండే అవకాశముంది' అని ఆరో ద్వైమాసిక విధాన సమీక్షలో ఆర్‌బీఐ పేర్కొంది. అటు వినియోదారుల ధరల సూచీ(సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణంలోనూ స్వల్ప మార్పులు జరగొచ్చని అంచనా వేస్తోంది.

రుణ సేకరణ పెరుగుతోంది..

దేశంలో పెట్టుబడుల విషయంలో కొంత పురోగతి కనిపిస్తోందని ఆర్‌బీఐ తెలిపింది. ఇటీవలి రుణ సేకరణ పెరగడం, ప్రాథమిక క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సమీకరణ పెరగడం, మూలధన వస్తువుల ఉత్పత్తి, దిగుమతులు పెరగడమే ఇందుకు నిదర్శనమని వివరించింది. ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ఎగుమతులు పెరగొచ్చని పేర్కొంది. అయితే ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలు క్రమంగా పెరుగుతుండడం పట్ల ఆర్‌బీఐ ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.

చమురు ధరలు సమీప భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అవకాశాలున్నాయని పేర్కొంది. దీనికి తోడు ఇటీవలి కాలంలో అమెరికాతో సహా వివిధ దేశాల స్టాక్ మార్కెట్లు అనూహ్యంగా కుంగుతుండడం, దేశీయ మార్కెట్ల పతనంపై కూడా ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్ష నిర్వహించింది. రానున్న రోజుల్లో ఈ అంశాలు ప్రభావం చూపవచ్చని పేర్కొంది.



అవినీతి పోలీస్ రాజ్యం

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో తీర్మానాలు

- సీఎం కార్యాలయమే అవినీతికి అడ్డా: జూలకంటి
- ఎనిమిదో నవాబు కేసీఆర్: పోతినేని

నల్లగొండ : ముఖ్యమంత్రి కార్యాలయమే అవినీతికి అడ్డాగా మారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. అవినీతిరహిత పరిపాలనను అందిస్తామన్న కేసీఆర్ మాటలు ఆచరణలో అమలుకాలేదని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు అంతా ఇందులో భాగస్వాములేనని అన్నారు. ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇప్పిస్తామని చెప్పి లక్షలు, కోట్లు అమాయకుల దగ్గర వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కేసీఆర్ నిరంకుశ పాలనను ప్రజలు ప్రశ్నిస్తున్నారని వివరించారు. నాలుగేండ్లకాలంలో రూ.15 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. మియా పూర్ ప్రభుత్వ భూములను దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై సర్కారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నయీ మ్ ముఠా దోపిడి చేసి రూ.1,500 కోట్ల నుంచి రూ.2000 కోట్లను సం పాదించిందని ప్రభుత్వమే చెప్పిందని, ఇప్పటివరకు వాటిని సంబంధీకులకు చేరేలా చర్యలు తీసుకోలేదని చెప్పారు. సాగునీటి, తాగునీటి ప్రాజెక్టుల్లో భారీ అవినీతి చోటుచేసుకుందన్నారు. సుమారు రూ. 10 వేల కోట్లు అవినీతి జరిగిందన్నారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక సైతం తప్పుబట్టిందని గుర్తు చేశారు.

ఎనిమిదో నిజాం : పోతినేని

రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ఏడో నిజాం అసఫ్ జాహీ పరిపాలన తరువాత ఎనిమిదో నిజాం పరిపాలనను తలపిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. తెలంగాణ వస్తే ఎన్‌కౌంటర్లు ఉండవన్న కేసీఆర్, నేడు పోలీస్ రాజ్యాన్ని నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సర్కారు పరిపాలన నచ్చని వాళ్ల అజ్ఞాతంలోకి వెళ్లేవారని, ఇప్పుడే ఏకంగా ఒత్తిళ్లకు తట్టుకోలేక పోలీసు అధికారులే అజ్ఞాతంలోకి వెళ్లే పరిస్థితి ఉత్పన్నమైందని గుర్తు చేశారు. నేడు రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులపై దాడి జరుగుతున్నదన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఐపీసీ 506, 507 సెక్షన్లను సవరించి సర్కారుపై విమర్శలు, ఆరోపణలుచేసిన వారిపై కేసులు పెట్టేందుకు పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూస్వాములకే వరం

అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి

కామ్రేడ్ నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి బి.బసవపున్నయ్య



రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రైతుల ఓట్లకు గాలం వేసేందుకు ఆర్థిక సాయం చేయాలని టీఆర్ఎస్ నిర్ణయించిందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి మల్లారెడ్డి చెప్పారు. తద్వారా భూస్వాములకు మాత్రమే లబ్దిచేకూరుతుందని అభిప్రాయపడ్డారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా 'నవతెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

1971 పాసుపుస్తకాల చట్టాన్ని సవరించి కౌలు రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్రం లో 14 లక్షల మంది కౌలురైతులు ఉన్నారని వివరించారు. 40 లక్షల భూయజమానులకు మాత్రమే టీఆర్ఎస్ సర్కారు ఆర్థికసాయం ఉపయోగపడుతుందన్నారు. ప్రతియేటా రాష్ట్రంలో 800మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారని గుర్తు చేశారు. ఇందులో కౌలురైతులు కనీసంగా 300 మంది ఉంటున్నారని, వీరికి కనీస పరిహారం సైతం ఇవ్వడం లేదని అభిప్రాయపడ్డారు వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం రైతులకు చెందిన మొత్తం రూ. 37 వేల కోట్ల రుణాలకుగాను, కేవలం రూ. 17 వేల కోట్లు మాత్రమే టీఆర్ఎస్ రద్దుచేసిందని గుర్తు చేశారు. కచ్చితంగా ఒక పంటకు సాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

65 ఏండ్లు దాటిన పేద రైతుకు నెలకు రూ. 5000 పింఛను ఇవ్వాలని కోరారు. మనకంటే బలహీనమైన పాకిస్తాన్, టర్కీ, బంగ్లాదేశ్ దేశాల్లో ఈ పథకం అమల్లో ఉందన్నారు. బడ్జెట్లో వ్యవసాయానికి 2.31 శాతం అంటే రూ.47,600 కోట్లు మాత్రమే కేటాయించారు. కానీ ఈ నిధులు సరిపోవని, కనీసంగా 10 శాతం నిధులు అవసరమని చెప్పారు. దేశంలో 43 కోట్ల ఎకరాల భూమి సాగుచేస్తున్నారని, వీటికి కేటాయించిన నిధులు సరిపోవన్నారు. కేటాయించిన వాటిలో రూ.15 వేల కోట్లు వడ్డీలు, రూ. 13 వేల కోట్లు బీమా ప్రీమియంకు, రూ. 4 వేల కోట్లు ప్రధాన మంత్రి కృషి సించాయ్‌యోజనకు పోతాయన్నారు. రూ. 47 వేల కోట్లలో రూ.37 వేల కోట్లు వీటికే పోతాయని, మిగిలేది రూ. 10 వేల కోట్లు మాత్రమేనని చెప్పారు. వీటి ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు ఇవ్వడం, పరిశోధనలు చేయడం సాధ్యం కాదన్నారు. 13రాష్ట్రాల్లో రైతుల ఆత్మహత్యలు సాగుతున్నాయని చెప్పారు.

ప్రతియేటా 12600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలియజేసిందని తెలిపారు. ఉత్తరాదిలోని బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానాలో రైతు ఆందోళనలు సాగుతున్నాయన్నాయని చెప్పారు. రుణమాఫీ చేయాలని, గిట్టుబాటు ధరలను ముందే నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న హైదరాబాద్‌లో రైతు సదస్సులో కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు.

దేశాన్ని అమ్మేందుకు ఎన్డీయే కుట్ర

కార్మిక వ్యతిరేకి మోడీ సర్కారు

- ఈనెల 10న ఢిల్లీలో కార్యాచరణ : సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కె. హేమలత



నల్లగొండ : కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు పూర్తి కార్మికుల వ్యతిరేకిగా మారిందని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.హేమలత అన్నారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో ట్రేడ్ యూనియన్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని వ్యాఖ్యానించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆమె 'నవతెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. బడ్జెట్ ప్రవేశపెట్టేముందు కేంద్రం అన్ని జాతీయ కార్మిక సంఘాలతో భేటీ అయింది. ఆ మేరకు సీఐటీయూ అనేక అంశాలపై వినతిపత్రం సమర్పిం చింది. అందులో ఒక్క అంశాన్ని కూడా ఎన్డీయే ప్రభు త్వం పట్టించుకోలేదు. కనీస వేతనాలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం, ఉపాధి కల్పన పెంచేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చాం. అయితే ఆ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. సర్కారు నిధులు కేటాయించ లేదు. ఇండియన్ లేబర్ కమిషన్ సిఫారసులను అమలుచేయాలని కోరినా పట్టించుకోలేదు. ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశాం. ఆర్థిక శాఖ మంత్రితో ఆయా అంశాలపై చర్చించాం. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. ప్రభుత్వ సంస్థలు, ఆస్తులను విక్రయించడం ద్వారా వచ్చే కాలంలో రూ. 70 వేల కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ఎన్డీయే దేశాన్ని అమ్మేసేందుకు ప్రయత్నిస్తున్నది. కార్మికుల ప్రయోజనాలు పట్టడం లేదు. గత ఏడాది కొత్త ఉద్యోగాలు రాకపోగా, 90 లక్షల ఉద్యోగాలు ఊడిపోయాయి. గత ఐదేండ్లుగా భర్తీకానీ ఉద్యోగ ఖాళీలను రద్దుచేసేందుకు కుట్ర పన్నింది. ఈ నేపథ్యంలో ఈనెల10న అన్ని కార్మికసంఘాలతో ఢిల్లీలో సదస్సు జరగనుంది. అందులో కార్యాచరణను నిర్ణయిస్తాం. పోరాటాలు, ఉద్యమాలు చేపడతాం.

అసెంబ్లీలో ప్రజా ఎజెండా

- సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య



నల్లగొండ: వచ్చేఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజల ఎజెండాను ప్రస్తావి స్తామని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నంరాజయ్య తెలిపారు. సమాజంలోని అట్టడుగువర్గాల సమస్యలకు శాసనసభకు అద్దం పట్టాలని అభిప్రాయప డ్డారు. టీఆర్ఎస్ సర్కారు హయాంలో అసెంబ్లీని కేసీఆర్ కుటుంబం హైజాక్ చేసిందన్నారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) లక్ష్యాలను, విధానాలను అసెంబ్లీలో ప్రస్తావించే ప్రయత్నం చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, బీసీ మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విషయమై చర్చిస్తామన్నారు. ప్రత్యేక నిధి ఏర్పాటయ్యేలా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంతో పోరాడుతామని ప్రకటించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఉద్యమాలు, పోరాటాలను అణచివేతకు పోలీసు నియామకాలు తప్ప, మిగతా ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయ డిఎస్సీ వేయలేదన్నారు 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమని చెప్పారు. కొన్ని తరగతులు, ప్రాంతాలకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నదని, ఇది రాష్ట్ర సమగ్రాభివృద్ధికి విఘాతమని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాలకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపధికన నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో బీఎల్ఎఫ్ విజయవంతమవుతుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు కలవడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా బీఎల్ఎఫ్ వచ్చిందన్నారు. దీనిపట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని గుర్తు చేశారు. సీపీఐ కూడా బీఎల్ఎఫ్‌తో కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక కేంద్రీకరణ అవసరం

ప్రజా పునాది పెంచుకోవాలి : సీపీఐ(ఎం)సీనియర్ నేత బొంతల చంద్రారెడ్డి



నల్లగొండ : రాష్ట్రంలో అణగారిన తరగతులు, దళితులు, బహుజనులపై ప్రత్యేక కేంద్రీకరణ అవసరమని సీపీఐ(ఎం) సీనియర్ నేత బొంతల చంద్రారెడ్డి చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం పని చేయడం ద్వారానే ప్రజాపునాది సాధ్యమని అభిప్రాయపడ్డారు. సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల సందర్భంగా ఆయన 'నవతెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి సరిపడినంతగా కేటాయింపులు లేవన్నారు. కార్పొరేట్ సంస్థలు, శక్తులకే ఎన్డీయే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బీజేపీ, ఎన్డీయే పని చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌ను ప్రభావితం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. మార్కెట్లో మద్దతు ధరల కోసం గత ఏడాది రూ 950 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ 200 కోట్లకు కుదించడాన్ని తప్పుబట్టారు. ఈ చర్య వ్యవసాయాన్ని, దానిపై ఆధారపడే రైతాం గాన్ని ఆర్థిక బలహీనంగా చేయడానికి, అణచివేయడానికి తోడ్పడతాయన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఇక్కడే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులకు తామే రేట్లను నిర్ణయించుకుంటారని, వ్యవసాయ ఉత్పత్తులకు మాత్రం ప్రభుత్వం, వ్యాపారులు నిర్ణయిస్తారని, ఇది దారుణమమన్నారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు గత పదేండ్లుగా రూ 42 లక్షల కోట్లు రుణాలు మాఫీ చేస్తే, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రైతులకు రూ2.48 లక్షల కోట్లు మాత్రమే మాఫీ చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయరంగంలో బడాపెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టి ఫలితాలు సాధించుకుంటున్నారని, ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేందుకు వామపక్షాలు మరింత కృషిచేయాలని ఆయన కోరారు.

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలకు 27 మంది ప్రతినిధులు ఎన్నిక

నర్రా రాఘవరెడ్డి నగర్ (నల్లగొండ) నుంచి బొల్లె జగదీశ్వర్

సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభలు ఏప్రిల్ 18-22 వరకు హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఈ మహాసభల్లో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి 27 మంది ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండ పట్టణంలో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర ద్వితీయ మహాసభల్లో చివరిరోజు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వారి పేర్లను వెల్లడించారు.



నూతనంగా ఎన్నికైన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ప్రతినిధుల పేర్లు

తమ్మినేని వీరభద్రం (కేంద్ర కమిటీ సభ్యులు)
ఎస్ వీరయ్య (కేంద్ర కమిటీ సభ్యులు)
చెరుపల్లి సీతారాములు (కేంద్ర కమిటీ సభ్యులు)

1. జి నాగయ్య
2. చుక్క రాములు
3 నంద్యాల నర్సింహ్మరెడ్డి
4. సున్నం రాజయ్య
5. జి వెంకట్
6. టి జ్యోతి
7. జూలకంటి రంగారెడ్డి
8. పి సుదర్శన్‌రావు
9. జి రాములు
10. డిజి నర్సింహారావు
11. ఎం సాయిబాబు
12. టి సాగర్
13. ఆర్ వెంకట్రాములు
14. జాన్‌వెస్లీ
15. పివి శ్రీనివాస్
16. మల్లు లక్ష్మి
17. వై కిరణ్‌చంద్ర
18. నున్నా నాగేశ్వరరావు
19. బుగ్గవీటి సరళ
20. ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి
21. తుమ్మల వీరారెడ్డి
22. ముల్కలపల్లి రాములు
23. మచ్చ వెంకటేశ్వర్లు
24. ఎండి జహంగీర్
25. భూపాల్
26. సారంపల్లి వాసుదేవరెడ్డి
27. ఎండి జబ్బార్


పరిశీలకులు

1. ఎం శ్రీనివాస్
2. టి భంరావు
3. కె హిమబిందు

ప్రత్యామ్నాయ ప్రతినిధులు

1. కోట రమేష్
2. విజయ్
3. ఎస్ రమ

బీఎల్ఎఫ్ దేశానికే దిక్సూచి : తమ్మినేని



నల్లగొండ: బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ (బీఎల్ఎఫ్) దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. నల్లగొండ జరిగిన పార్టీ ద్వితీయ మహాసభల్లో రెండోసారి ఎన్నికైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలపై సీపీఐ(ఎం) పనిచేస్తున్నదన్నారు. రైతాంగం, మహిళ, యువజన, విద్యార్థి, చేతివృత్తిదారుల సమస్యలపై భవిష్యత్తులోనూ పనిచేస్తామన్నారు. గతంలో మల్లన్నసాగర్ నుంచి ఆశావర్కర్లు, ఇతర రంగాలపై చేసిన ఉద్యమాలకు మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. గత మూడేండ్లుగా పార్టీ రాష్ట్రంలో చేసిన కృషికి మహాసభ సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. జాతీయ నాయకులు సీతారాం ఏచూరి, ప్రకాశ్‌కరత్, బివి రాఘవులు తదితర నేతలు రాష్ట్ర పార్టీ చేసిన కార్యక్రమాలు, పోరాటాలు, ఉద్యమాల పట్ల అభినందనలు తెలియజేసినట్టు వివరించారు. బీఎల్ఎఫ్‌ను అట్టడుగు వర్గాల దగ్గరకు చేరుస్తామన్నారు. తొలి సమావేశం మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తామన్నారు. అఖిల భారత మహాసభలు ఏప్రిల్‌లో జరగనున్నాయని, వాటి విజయవంతం కోసం కృషిచేస్తామని ప్రకటించారు. 1000 మంది ప్రతినిధులు దేశం నలుమూలల నుంచి హాజరవుతారని చెప్పారు. దేశ రాజకీయాలను నిర్దేశించేవిధంగా చర్చలు జరగనున్నాయని వివరించారు. బహుజనుల రాజ్యాధికారం కోసం కలిసొచ్చే పార్టీలతో పనిచేస్తామన్నారు. విద్యా,వైద్యం, సేద్యం,ఉద్యోగం కోసం పోరాటాలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో గత నాలుగేండ్ల పరిపాలన నిరాశపరిచిందన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు సైతం అదేతోవలో ఉందన్నారు.దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి పబ్బంగడుపుకుంటున్నదని వ్యాఖ్యానించారు.

కిసాన్
నవతెలంగాణ
11 హైదరాబాద్
గురువారం 8-2-2018
www.navatelangana.com

వ్యవసాయ సూచనలు

వ్యవసాయం - వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 29-36 డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 09-17 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 34 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే రాత్రి ఉష్ణోగ్రతలు 09 నుంచి 20 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు అయ్యే అవకాశం ఉంది.

వరి: తెలంగాణ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. కనుక వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గింది. నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిళ్లు కప్పి ఉదయం వేళల్లో తీసివేయాలి. రాత్రి వేళలో నారుమడిలో సంవృద్ధిగా నీటిని ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే ఆ నీటిని తీసివేసి మళ్లీ ఉదయం 10-11 మధ్య నీటిని పెట్టినట్టయితే నారు ఎదుగుదల బాగా ఉంటుంది. నారు మడిలో జింక్ లోప లక్షణాలు కనిపించిన వెంటనే జింక్ సల్ఫేట్ 2.0 గ్రా, లీటరు నీటికి కలిపి అవసరం మేరకు 1-2 సార్లు 5 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. విత్తిన 15 రోజులకు పైపాటుగా వేసే యూరియాతో (2.5 కిలోలు)తోపాటు కార్బండజిమ్ 25శాతం మ్యాంకోజెబ్ 50 శాతం కలిగిన మిశ్రమ శిలీంధ్ర నాశకాన్ని 6.25 గ్రా. పట్టించి నారుమడిలో వేయాలి. వరిలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రా. లీటరు నీటికి కలిపి ఒకసారి పిచికారి చేయాలి. వరిలో కాండం తొలుచు పురుగు ఆశించకుండా ఉండటానికి 200 చ.మీ నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను 5నుంచి 7 రోజుల ముందు నారుమడిలో వేసుకోవాలి. ఈ పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా నాటిన 15నుంచి 20 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు 10 కి. ఎకరానికి వేసుకోవాలి. వరిలో జింకు ధాతు లోపం గమనించినట్టయితే 2 గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేయాలి.

మొక్కజొన్న: పైరు మొలిచిన 10 నుంచి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుండి 30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి. మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే సూచనలున్నాయి. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

వేరుశనగ: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో ఆకు మచ్చ తెగులు, కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించుటకు అనుకూలం. అకుమచ్చ తెగులు నివారణకు 2 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1గ్రా. కార్బండజిమ్ లేదా 2 గ్రా. క్లోరోథాలోనిల్ 2 మి.లీ హెక్సాకొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కాండం కుళ్లు వైరస్ తెగుళ్ల నివారణకు ముందు జాగ్రత్తగా పంట పొలం, గట్లపై ఉన్న వయ్యారిభామ కలుపు మొక్కలను నిర్మూలించుకోవాలి. పొలం చుట్టూ 4 నుంచి 5 వరుసల్లో సజ్జ, జొన్న, మొక్కజొన్న పంటలను వేయడం వల్ల తామర పురుగులు పంటను ఆశించకుండా నివారించవచ్చు. పొగాకు లద్దె పురుగు గమనించి నట్టయితే నివారణకు ఈ కింది సస్యరక్షణ పద్దతులు పాటించాలి. నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి అడుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి 10 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 5 మి.లీ వేపనూనె లేదా 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 1.5 గ్రా. థయోడికార్బ్ లేదా 2.0 మి.లీ క్లోర్‌పెనపైర్ లేదా 1 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బాగా ఎదిగిన లద్దె పురుగుల నివారణకు విషపు ఎరలను (5 కిలోల తవుడు, 500గ్రా. కార్బరిల్ మందును కలిపి తయారు చేసి సాయంత్రం పూట పొలంలో చల్లాలి.

మిరప: ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు కానోఫోరా కొమ్మ కుళ్లు తెగులు, బూడిద తెగులు, తామర పురుగులు సోకుటకు అనుకూలం. నివారణకు కానోఫోరా కొమ్మకుళ్లు తెగులుకు 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రా. ప్లాంటామైసిన్ మందును 10 లీటర్ల నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 గ్రా. మి.లీ కారాథేన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. తామర పురుగుల నివారణకు 1.5 గ్రా. అసిపిట్ లేదా 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులుకు 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ కారాతేన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కూరగాయలు: కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్టయితే నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. క్యాబేజీ, కాలిఫ్లవర్ పంటలో డైమండ్ రెక్కల పురుగు గమనించడమైంది. నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్ లేదా 0.3 మి.లీ స్పినోసాడ్ మందును లీటరు నీటిలో కలిపి పంట కోతకు 15 రోజుల ముందు పిచికారి చేయాలి.

పశుపోషణ : గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, అవులు, బర్రెల్లో గొంతువాపు వ్యాధి, ఆవులు, అంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకేందుకు అనుకూలం కనుక వీటి నివారణకు టీకాలు వేయించాలి.



టమాట అన్ని కాలాల్లో పండే పంట. నీటి సౌకర్యం ఉండి, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడినిస్తుంది. తద్వారా లాభాలు తెచ్చిపెడుతుంది. కొన్ని సందర్భాల్లో దిగుబడులు ఎక్కువున్నా, మార్కెట్ ప్రతి కూల పరిస్థితుల దృష్ట్యా ధరలు పడిపోయి రైతుల కంట తడిపెట్టిస్తోంది. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఈ పంట వేసుకుంటే లాభాల పంటే.

నిరంతరం అనుకూలం

వాతావరణం : టమాట పంటను సంవత్సరం పొడవునా అన్ని రుతువుల్లోనూ సాగు చేసు కోవచ్చు. అధిక దిగుబడికి శీతాకాలం అనుకూల మైనది. అధిక ఉష్ణోగ్రత, ఎక్కువ వర్షపాతానికి తట్టుకోలేదు.

నేలలు : బాగా నీరు ఇంకే బరువైన గరప నేలలు ఈ పంట కు అనుకూలం. వర్షాకాలంలో తేలికపాటి నేలల్లో వర్షాధార పంటగా కూడా సాగు చేసు కోవచ్చు. శీతా కాలంలో దీన్ని ఇసుకతో కూడిన గరప నేలల నుండి బరువైన బంక నేలల్లాంటి వివిధ రకాల నేలల్లో సాగు చేయవచ్చు. మురుగు నీటి వసతి లేని భూములు, చౌడు భూములు ఈ పంటకు అనుకూలం కాదు.

నాటే సమయం : వేసవిలో జనవరి, ఫిబ్రవరిలో సాగు చేసు కోవచ్చు.

రకాల వివరాలు

పూసారూబీ : పండ్ల పరిమాణం మధ్యస్థంగా ఉండి లోతైన గాళ్లు కలిగి ఉంటాయి. 135 రోజుల్లో పంట చేతి కొస్తుంది. ఎకరానికి 12 టన్నుల దిగుబడి వస్తుంది.

పూసా ఎర్లీడ్వార్ఫ్ : పండ్ల పరిమాణం పూసారూబీ కంటే పెద్దగా ఉండి తేలికపాటి ఎరుపు రంగు కలిగి ఉంటుంది. వర్షాకాలం, వేసవి కాలంలో ముందుగా నాటుకునేందుకు అనుకూలం.

మారుతమ్ : పండ్లు గుండ్రంగా, మధ్యస్థంగా ఉంటాయి. వేసవి కాలానికి అనుకూలం. 140 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరానికి 14 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

అర్క మేఘాలి : వర్షాధార పంటగా వేయడానికి అనుకూలం.130 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నులే దిగుబడి వస్తుంది.

అర్క సౌరభ్: పండ్ల పరిమాణం పెద్దగా గుండ్రంగా ఉంటుంది. ప్రాసెసింగ్‌కు, కాయగూరగా అను కూలం.110 రోజుల్లో పంట చేతికొస్తుంది. ఎకరానికి 14 టన్నులు దిగుబడి వస్తుంది.

అర్క వికాస్ : పండ్ల పరిమాణం పెద్దగా ఉంటుంది. వేసవి పంటక అనుకూలం.

రకాలు - అనుకూలత

వర్షాధార పంటకు తొలకరి ఖరీఫ్‌లో వేసుకోవడానికి అర్క మేఘాలి, పూసా ఎర్లీడ్వార్ఫ్, అలాగే ఖరీఫ్‌లో వేసు కోవడానికి పూసారూబీ, అర్కవికాస్ రకాలు అనుకూలం.

శీతాకాలానికి : పూసారూబీ, పూసా, ఎర్లీడ్వార్ఫ్, అర్కవికాస్, అర్క సౌరబ్.

వేసవి పంటకు : మారుతమ్, పికెఎం-1, అర్కవికాస్, అర్క సౌరబ్.



ప్రాసెసింగ్‌కు అనుకూలమైన రకాలు

హైబ్రిడ్ రకాలు సలాడ్‌కు, ప్రాసెసింగ్‌కు అనుకూలం.

నిల్వకు : సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద 8 నుంచి 10 రోజుల వరకు, శీతల గిడ్డంగుల్లో 30 రోజుల వరకు నిల్వ ఉండే రకాలు.

నేల తయారీ : మూడు,నాలుగు సార్లు దున్ని చదును చేయాలి. 60 సెం.మీ దూరంలో బోదెలు చేసుకోవాలి.

విత్తన మోతాదు : ఎకరానికి సూటి రకాలకు 200 గ్రా. సంకర జాతి రకాలకు 60నుంచి 80గ్రా.విత్తనం కావాలి.విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్‌తో లేదా 3 గ్రా.మెటలాక్సిల్‌తో, 2 గంటల తర్వాత 4 గ్రా. ట్రైకోడెర్మా కల్చర్‌తోను విత్తనశుద్ధి చేయాలి. వేసవిలో రసం పీల్చే పురుగుల బెడద తట్టుకునే విధంగా ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రా.కిలో విత్తనానికి పట్టించి ఆ తర్వాత శిలీంద్ర నాశనులతో విత్తన శుద్ధి చేయాలి.

కలుపు నివారణ అంతరకృషి

కలుపు నివారణకు ఎకరానికి పెండిమిథాలిన్ 1.0 లీ (తేలిక నేలలు) 1.20 లీ (బరువు నేలలు) 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 48 గంటల్లోపు లేదా తడినేలపై పిచికారి చేయాలి. మెట్రిబుజిన్ అనే మందును 300 గ్రా. మోతాదులో నాటిన 15 రోజులకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిన 30 నుంచి 35 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి. పొలంలో కలుపు లేకుంగా మొదటి నాలుగు వారాల్లో అంతరకృషి చేయాలి. మొక్కలు ఎదిగిన తర్వాత వాటిని కదిలించకూడదు.

నీటి యాజమాన్యం : భూమిలో తేమనబట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి. వేసవిలో ప్రతి 5 నుంచి 6 రోజులకు ఒకసారి తడి అవసరం ఉంటుంది.

సస్యరక్షణ పురుగులు

కాయలతొలుచు పురుగు : లేత ఆకులన కొమ్మలను తినేస్తుంది. కోత దశలో కాయలను తొలచి నాశనం చేస్తుంది. దీని నివారణకు ఎరపంటగా బంతిని వేసుకోవాలి. ఒక వరుస బంతి మొక్కలు ప్రతి 16 వరుస లకు టమాట కంటే బంతినారును 20 రోజుల ముందుగా నాటుకోవాలి. ట్రైకోగ్రామా బదనికలను ఎకరానికి 20వేల చొప్పు విడుదల చేయాలి. ఎకరానికి 4 చొప్పున లింగాకర్షణ బుట్టలను పెట్టాలి. నాటిన 28 నుంచి 35 రోజులకు ఫ్లూబెండమైడ్ 0.3 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.


పచ్చదోమ : ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి క్రమేపి ఆకులంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకొని దోనెలుగా కనిపిస్తాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాస్ 2 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రబ్బరు పురుగు : కాయతొలుచు పురుగుల మాదిరిగానే పంటను నాశనం చేస్తుంది. పురుగుల చివరి దశలో నివారణకు విషపు ఎరలను పెట్టాలి. 10కి.తవుడు,1 కిలో కార్బరిల్ 50 శాతం పొడి మందు, 1కిలో బెల్లం తగినంత నీటికి కలిపి పాకం చేసి పులియ పెట్టింది ఈ పురుగు నివరాణకు తోడ్పడుతుంది.

టమాటలో సమగ్ర సస్యరక్షణ

ఫ్రెంచి చిక్కుడు (బిన్నీస్) పంటతో పంట మార్పిడి చేస్తే బ్యాక్టీరియా ఎండు తెగులు కొంత వరకు తగ్గుతుంది.ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేయడం వల్ల నులిపురుగుల ఉధ్ధృతి తగ్గుతుంది. కిలో విత్తనానికి ముందుగా 3 గ్రా. థైరమ్ ఆ తర్వాత 8 గ్రా. ట్రైకోడెర్మాకల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి. వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వల్ల నేలలో ఉన్న నిద్రావస్థ దశలోని పురుగులు నివారింప బడుతాయి. ట్రైకోడెర్మా కల్చర్‌ను ఒక కిలో కల్చర్‌ను 10 కిలోల వేపపిండి, 90 కిలోల పశువుల ఎరువుతో కలిపి దుక్కిలో వేసుకోవాలి. పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డుపంటగా వేయడం వల్ల రసం పీల్చేపురుగుల ఉధృతి తగ్గి టమాటాలో ఆకు ఎండు తెగులు, వైరస్ తెగులు కొంత వరకు తగ్గుతుంది.పొలంలో అక్కడక్కడ వేసిన ఆముదం మొక్కలపై ఉన్న గుడ్ల సముదాయాలను అప్పుడే పొదగబడిన పిల్ల పురుగులను ఏరి నాశనం చేయాలి. పొలంలో అక్కడక్కడ ఎకరానికి 4 చొప్పున పసుపు రంగు పూసిన రేకుకు ఆముదం,గ్రీజ్‌పూసి పెట్టాలి. తెల్లదోమలు వీటికి ఆకర్షింపబడి అతుక్కుంటాయి. ఎకరానికి 4లింగాకర్షక బుట్టలు పెట్టి శనగపచ్చపురుగు, రబ్బరు పురుగుల యొక్క ఉనికిని గమనించాలి. ఎరపంటగా బంతి మొక్కలను నాటుకోవాలి.పూత దశకు ముందు ఎకరానికి 20వేల చొప్పున ట్రైకోగ్రామా బదనికలను వారానికి ఒకసారి చొప్పున 6వారాలు విడుదల చేయాలి. పొలంలో ఎకరానికి 20 చొప్పున పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలి.

మొక్క పెరుగుదల దశలో నాటిన 30 రోజుల నుండి పూత వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 5కిలోల వేపగింజల పప్పు 100 లీటర్ల నీటిలో 15 రోజుల తేడాతో పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు ఉన్నట్టయితే ఎకరానికి 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని నాటడానికి ముందు భూమిలో కలిసేలా వేయాలి. ఈ తెగులు నివారణకు నాటే ముందు 100 పిపిఎం, 100 మి.గ్రా లీటరు నీటికి స్ట్రెప్టోసైక్లిన్ ద్రావణంలో ముంచి నాటాలి. డైమిథోయేట్ లీటరు నీటికి 2 మి.లీ చొప్పున పూత సమయం నుండి పిచికారి చేయాలి.



- డాక్టర్ పిడిగం సైదయ్య,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
శ్రీకొండా లక్ష్మణ్‌బాపూజీ
హార్టికల్చర్ యూనివర్సిటీ
హైదరాబాద్

❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄

ఆరుతడి పంటల్లో వంకాయ సాగు

విత్తే సమయం: వేసవి కాలపు పంటను జనవరి రెండో పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు నారు పోసుకోవచ్చు.

నారు నాటకునే సమయం: 30నుంచి 35 రోజుల వయస్సు కలిగిన నారును నాటుకోవాలి. చలికాలం నారును నవంబరు, డిసెంబరులో వేసవి నారును ఫిబ్రవరి, మార్చి మొదటి వారంలో నాటుకోవచ్చు.

నేలలు: బాగా నీరు ఇంకే నేలలు, ఒక మాదిరి నుంచి హెచ్చు సారవంతమైన నేలలు ఈ పంట సాగుకు అనుకూలమైనవి. చౌడు నేలలు పనికిరావు.

విత్తనం: ఎకరానికి సూటి రకాలకు 260 గ్రా, సంకర జాతి రకాలకు 120 గ్రాముల విత్తనం కావాలి.

రకాలు: ప్రాంతీయ మార్కెట్‌లో వినియోగదారుల అభిరుచినిబట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి. మన రాష్ట్రంలో పూసా, క్రాంతి,పూసాపర్పుల్,క్లస్టర్, శ్యామల రకాలు ఎక్కువగా వాడుతారు.

నేల తయారీ: నేలను నాలుగైదుసార్లు దున్ని చదును చేయాలి. వర్షాకాలపు పంటకు బోదెలు, కాల్వలు ఏర్పాటు చేయాలి. శీతాకాలం వేసవి పంటలకు 4ఇంటు5 చ.మీ మడులను తయారు చేసుకోవాలి.

నారుమడి పెంపకం: 6 అంగుళాలు ఎత్తు ఉండే 4ఇంటు1 మీ సైజుగల నారుమడులను తయారు చేసుకోవాలి. ఒక ఎకరానికి 10నుంచి 12 నారుమడులు సరిపోతాయి. 260 గ్రా. మిత్తనాన్ని 10 సె.మీ వరుసల్లో విత్తుకోవాలి. అయితే విత్తే ముందు విత్తనాలను 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల నీటిలో 30 నిమిషాలపాటు నానబెట్టి నీడలో ఆడబెట్టాలి. ఆ తర్వాత కిలో విత్తనానికి 4గ్రా.ల చొప్పున ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను కూడా పట్టించి విత్తుకోవాలి. విత్తిన తర్వాత మాగుడు తెగులు కనిపించిన వెంటనే కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి వారం రోజుల వ్యవధి ఇస్తూ రెండు మూడుసార్లు నారుమడిని బాగా తడపాలి. నారును పీకడానికి వారం రోజుల ముందు 250గ్రా. కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ నారుమడికి వేయాలి.



నాటే దూరం: పొడవుగా నిటారుగా పెరిగే రకాలకు పూసాపర్పుల్ లాంగ్, పూసాపర్పుల్ క్లస్టర్, పూసా పర్పుల్ రౌండు,భాగ్యమతి, శ్యామల, 60ఇంటు60 సెం.మీ గుబురుగా పెరిగే రకాలకు పూసా క్రాంతి, అర్కకుసుమాకర్ గులాబి 75ఇంటు50 సెం.మీ దూరం పాటించి నాటాలి. ఎకరానికి 200 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేసి కలియదున్నాలి. బాక్టీరియా ఎండు తెగులు ఉండే ప్రాంతాల్లో ఎకరానికి 6కిలోల చొప్పున బ్లీచింగ్ పొడిని వేసుకోవాలి. రసం పీల్చే పురుగులు ఆశించకుండా ఎకరానికి 10కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికలను నాటేముందు వేసుకోవాలి.

ఎరువులు: ఎకరానికి 6నుంచి 8 టన్నుల పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. 24 కిలోల భాస్వరం (150కిలోల సూపర్ ఫాస్ఫేట్), 24కిలోల పోటాష్‌లనిచ్చే ఎరువులను (40కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) చివరి దుక్కిలో వేయాలి. 40కిలోల నత్రజనిని, (200కిలోల అమ్మోనియ సల్ఫేట్ లేదా 85కిలోల యూరియా) మూడు భాగాలుగా చేసి 30,60,75వ రోజున పైపాటుగా వేయాలి. సంకరజాతి రకాలకు ఈ ఎరువుల మోతాదు 50శాతం అధిక చేసి వేయాల్సి ఉంటుంది.

కలుపు నివారణ,అంతరకృషి: విత్తిన లేదా నాటిన ఒకటి రెండు రోజుల్లో అలాక్లోర్ 1.0లీ తేలిక నేలలు, 1.5లీటర్ల చొప్పున, బరువు నేలలకు ఎకరానికి పిచికారి చేయాలి. నాటిన నెల రోజుల్లో గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి.పైపాటు ఎరువులు వేసే ప్రతిసారి బోదెలు సరిచేస్తే పంట బాగా పెరుగుతుంది.

నీటి యాజమాన్యం: నాటే ముందు లేదా నాటిన తర్వాత నీరు పెట్టాలి. భూమిలో తేమనుబట్టి నీరుపెట్టాలి.బరువైన నల్లరేగడి నేలల్లో తప్పకుండా మురుగు నీటి పారుదల సౌకర్యం కల్పించాలి.

సస్యరక్షణ-పురుగులు

మొవ్వు, కాయతొలుచు పురుగు: నాటిన 30 నుంచి 40రోజుల్లో ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, తర్వాత దశలో కాయలను తొలచి నష్టాన్ని కలుగచేస్తాయి. కాయలు వంకర్లు తిరిగి పోతాయి. కొమ్మల చివర్ల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలు తుంచి వేసి నాశనం చేయాలి. కార్బరిల్ 50శాతం, డబ్ల్యుపి 3గ్రా.లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ సైపర్ మెత్రిన్ 1 మి.లీ లీటరు నీటిలో కలిపి 10 రోజుల వ్యవధిలో కాయలు కోసిన తర్వాత పిచికారి చేయాలి.

రసం పీల్చే పురుగులు(దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ): ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు పసుపు రంగుకు మారి పైకి ముడుచుకొని పోతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమెటాస్ లేదా ఫిప్రోనిల్ లీటరు లీటరు నీటికి 2 మి.లీ చొప్పున కలిపి పిచికారి చేయాలి. తెల్లదోమ అధికంగా ఉన్నట్టయితే ఎసిఫేట్ 1.5గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఎర్రనల్లి: ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలెగూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3గ్రా. లేదా డైకోఫాల్ 5మి.లీ లేదా స్పైరోమిసిఫెన్ 3 మి.లీ లేదా ప్రాపర్గైట్ 3 మి.లీ చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

నులిపురుగులు (రూట్‌నాట్ నెమలోడ్స్) ఈ పురుగులు ఆశించిన పంట వేర్లపై వేరు బుడిపెలు కనబడతాయి. ఇవి ఆశించిన మొక్కలు తక్కువగా పెరిగి పేలగా తక్కువ కాయలు కాస్తాయి. వీటిని తట్టుకునే రకాలైన బ్లాక్ బ్యూటీ, విజయ (హైబ్రిడ్) బనారస్ జెయింట్ టీ-2లను సాగు చేయాలి. పొలంలో నులిపురుగుల సంతతిని తగ్గించడానికి తప్పనిసరిగా అన్ని పొలాల్లో ఏడాది పాటు బంతిపూల పంటతో మార్పిడి చేయాలి.

❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄❄

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

'మాంకోజెబ్'తో తామర పురుగులు పరార్

ప్ర. మిరప పంటలో పూత ఎండిపోతుంది. కాయ గిడసబారి పోతుంది. నివారణ చెప్పండి?

- రామనర్సింహ్మ గొడిషేర్‌పేట గ్రా, వెంగటూరు మం, జగిత్యాల జిల్లా

పూతలో దోమజాతికి (మిడ్జి) చెందిన పిల్ల పురుగులు మొగ్గలను పూతను, పిందెను ఆశించి నష్టపరుస్తాయి. పూత ఎండి రాలి పోతుంది. ఏర్పడిన కాయలు గిడసబారి, వంకరలు తిరిగి ఉండడం వల్ల నాణ్యత కోల్పోతాయి. నివారణకు ట్రైజోఫాస్ ఎకరానికి 200 మి.లీ పిచికారి చేసి వారం రోజుల తరువాత మళ్లీ క్లోరిపైరిఫాస్ 500 మి.లీ లేదా కార్బోసల్ఫాన్ 450 మి.లీ పిచికారి చేయాలి.

ప్ర. చిక్కుడులో పేనుబంక నివారణ చెప్పండి?

- శ్రీనివాస్, రాంబాబు గ్రా, కోటెపల్లి మ, వికారాబాద్ జిల్లా

ఇవి ఆకులు, పూలపై ఆశించి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు గిడసబారి పోతాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా ఫిప్రోనిల్ లేదా ఎసిటామిప్రిడ్ లేదా మిథైల్ డెమటాస్ మందు 2 మి.లీ లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

ప్ర. వరిలో సుడిదోమ నివారణ చెప్పండి? **- రమేష్, పెంట్లపల్లి గ్రా, మం, నాగర్‌కర్నూల్ జిల్లా**

జ. గోధుమ వర్ణపు తెల్లమచ్చ దోమలు దుబ్బుల అడుగున, నీటి మట్టంపై ఉండి దుబ్బుల నుండి రసాన్ని పీలుస్తాయి. పైరు సుడులు, సుడులుగా ఎండిపోతుంది. నివారణకు బూప్రొపెజిన్ 11.6 మి.లీ లేక ఎసిఫేట్ 1.5 గ్రా. లేక ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ 80 డబ్లుజి 0.25 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ప్ర. చామంతిలో ఆకుమచ్చ నివారణ చెప్పండి?

- నారాయణ, రాయికోడ్ గ్రా, మం, సంగారెడ్డి జిల్లా

జ. నల్లటి లోతైన గుండ్రటి మచ్చలు ఆకులపై ఏర్పడడం వల్ల ఆకులు ఎండి వడలిపోతాయి. నివారణకు మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ప్ర. కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ తెలపండి?

- జగన్నాథ్, న్యాలకల్ గ్రా, మం, సంగారెడ్డి జిల్లా

జ. కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను, పూతను చుట్టగా చుట్టుకొని లోపల ఉండి గీకి తింటుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 1.6 మి.లీ మోనోక్రొటోఫాస్ లేదా 2.0 మి.లీ క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

అడగండి.. చెబుతాం!

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500020. ఫోన్: 8332995392, kisan@navatelangana.com


ఆటలు 12
హైదరాబాద్
నవతెలంగాణ
గురువారం 8 ఫిబ్రవరి 2018

కిదాంబి సేన దూకుడు

- రెండో పోరులో మాల్దీవ్స్‌పై 5-0తో విజయం
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

అలోర్ సెతార్ (మలేసియా)

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కిదాంబి సేన జోరు కొనసాగుతోంది. తొలి పోరులో ఫిలిప్పైన్స్‌ను 5-0తో ఓడించిన భారత పురుషుల జట్టు.. బుధవారం జరిగిన గ్రూప్ డి రెండో పోరులో కుర్ర జట్టు మాల్దీవ్స్‌ను 5-0తో మట్టికరిపించింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో 21-5, 21-6తో అతి సునాయస విజయం అందుకున్న కిదాంబి భారత్‌కు బలమైన ఆరంభాన్నిచ్చాడు. మాల్దీవ్స్ సింగిల్స్ స్టార్ ఆటగాడు షాహీద్ హుస్సేన్ జేయన్ కిదాంబికి ఏమాత్రం పోటీనివ్వలేకపోయాడు. బి. సాయిప్రణీత్ 17 నిమిషాల్లోనే మరో సింగిల్స్ ముగించి ఔరా! అనిపించాడు. అహ్మద్ నిబాల్‌ను 21-10, 21-4తో ఓడించాడు. మూడో సింగిల్స్ మ్యాచులో సమీర్ వర్మ 21-5, 21-1తో మొహమ్మద్ అర్సలాన్‌పై గెలుపొందాడు. 3-0 ఆధిక్యంలో నిలిచిన భారత్ డబుల్స్‌లోనూ అదే దూకుడు కొనసాగించింది. సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిల జోడీ షాహీద్ హుస్సేన్ జేయాన్, షాహీమ్ హస్సాన్ ఆఫ్‌షీమ్‌లపై 21-8, 21-8తో సులువైన గెలుపు నమోదు చేశారు. మరో డబుల్స్ పోరులో ఎమ్ఆర్ అర్జున్, రామచంద్రన్ శ్లోక్‌లు సైతం అత్యంత సునాయసంగా గెలుపొం దారు. 21-2, 21-5తో మొహమ్మద్ అర్సలాన్ అలీ, అహ్మద్ నిబాల్ జోడీని ఓడించారు. నేడు కిదాంబి సేన ఇండోనేషియాతో తలపడనుం డగా.. పి.వి సింధు సారథ్యంలోని మహిళల జట్టు జపాన్‌తో ఢీ కొట్టనున్నది



సిరీస్ సొంతం

రెండో వన్డేలో మిథాలీ సేన ఘన విజయం

- స్మృతి మంధాన సెంచరీ
- హర్మన్, వేద అర్ధ శతకాలు


స్మృతి మంధాన 135

కింబర్లె : దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే మిథాలీ సేన సొంతమైంది. రెండో వన్డేలో భారత్ 178 పరుగుల తేడాతో సఫారీలపై భారీ విజయం నమోదు చేసింది. సఫారీ గడ్డపై భారత ఓపెనర్ స్మృతి మంధాన (135, 129 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి అదరగొట్టింది. వరుసగా రెండో వన్డేలోనూ సెంచరీతో చెలరేగింది. వన్డేల్లో తన వ్యక్తిగత అత్యధిక స్కోరును తిరగరాసింది. మంధాన శతకానికి హర్మన్‌ప్రీత్ కౌర్ (55 నాటౌట్, 69 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), వేద కృష్ణమూర్తి (51 నాటౌట్, 33 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్)లు అజేయ హాఫ్ సెంచరీలు జత చేయగా భారత్ నిర్ణీత ఓవర్లలో 302 పరుగులు చేసింది. 44వ ఓవర్లో మంధాన వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగగా.. బరిలోకి దిగిన వేద ధనాధన్ ఆటతో సఫారీ బౌలర్లకు చుక్కలు చూపించింది. తొలుత టాస్ గెల్చి ఫీల్డింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా భారత్‌ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయింది. కేవలం మూడు వికెట్లు మాత్రమే తీయగల్గింది. ఇక ఛేదనలో సైతం సఫారీలు చేతులెత్తేశారు. 30.5 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటయ్యారు. ఓపెనర్ లిజెలే లీ (73), మరిజన్నె కప్ (17 నాటౌట్) మినహా అందరూ సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. పూనమ్ యాదవ్ (4/24) నిప్పులు చెరగటంతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌వుమెన్ విలవిల్లాడారు. రాజేశ్వరి గైక్వాడ్, దీప్తి శర్మలు చెరో రెండు వికెట్లు పడగొట్టగా జులన్ గోస్వామి ఓ వికెట్ తీసుకున్నది. ప్రపంచ కప్ రన్నరప్‌గా నిలిచిన తర్వాత భారత మహిళల జట్టు ఆడుతోన్న తొలి సిరీస్ ఇదే. భారత్, దక్షిణాల మధ్య ఆఖరుదైన మూడో వన్డే శనివారం పోచెఫ్‌స్ట్రూమ్ వేదికగా జరుగనున్నది.



అంకిత రాణించినా..

1-2తో భారత్ పరాజయం

న్యూఢిల్లీ : అంకిత రైనా అదిరిపోయే ప్రదర్శన చేసినా భారత్‌కు ఓటమి తప్పలేదు. వరల్డ్ నెంబర్ 120, లిన్ జుపై అంకిత వరుస సెట్లలో గెలుపొందినా.. సహచరుల సహకారంకొరవడటంతో ఆసియా /ఓసియానా గ్రూప్1 చాలెంజ్ తొలి పోరులోనే భారత జట్టువ పరాజయం పాలైంది. ప్రపంచ 253 ర్యాంకర్ అంకిత తనకాన్న మెరుగైన ప్రత్యర్థిని 6-3, 6-2తో చిత్తు చేసింది. అయితే డబుల్స్‌లో ప్రార్థనా థోంబరే జతగా తేలిపోయింది. డబుల్స్‌లో ప్రపంచ 31వ ర్యాంకు జోడీ వాంగ్, జావోగ్‌జువాన్‌ల చేతిలో 2-6, 6-7(1)తో ఓడింది. సమన్వయ లోపంతో పలుమార్లు ప్రత్యర్థికి పాయింట్లు సమర్పించుకున్న భారత్ తగు మూల్యం చెల్లించుకున్నది. తదుపరి పోరులో భారత్.. హాంగ్ కాంగ్‌పై 3-0తో నెగ్గిన కజకిస్థాన్‌తో తలపడనున్నది.




తొలి రెండు వన్డేల్లో ఘన విజయం సాధించిన కోహ్లి సేన మూడో వన్డేలోనూ అదే పునరావృతం చేసింది. విరాట్ కోహ్లి అజేయ శతకంతో వీరంగం చేయగా.. శిఖర్ ధావన్ ధనాధన్ హాఫ్ సెంచరీతో మెరవగా.. భారత్ మూడొందల పైచిలుకు లక్ష్యాన్ని దక్షిణాఫ్రికాకు నిర్దేశించింది. ఇక మణికట్టు మాయగాళ్లు చాహల్, కుల్దీప్ వికెట్ల వేటలో రెచ్చిపోవటంతో సఫారీలు ఛేదనలో తేలిపోయారు. భారత్ కేప్‌టౌన్ వన్డేలో 124 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. తొలిసారి సఫారీ గడ్డ మీద ద్వైపాక్షిక సిరీస్‌లో మూడు మ్యాచులు నెగ్గి చరిత్ర సృష్టించింది.



విరాట్ వందనం

దక్షిణాఫ్రికాపై 124 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం

- ధావన్ హాఫ్ సెంచరీ
- చాహల్, కుల్దీప్ స్పిన్ మాయ


విరాట్ కోహ్లి 160*

నవతెలంగాణ-కేప్‌టౌన్

టీమ్ ఇండియా సేనాని విరాట్ కోహ్లి విశ్వ రూపం ప్రదర్శించాడు. అమోఘమైన బ్యాటింగ్‌తో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో వన్డేలో అభిమానులను అబ్బురపరిచాడు. విరాట్ కోహ్లి (160 నాటౌట్, 159 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులకు గబ్బర్ శిఖర్ ధావన్ (76, 63 బంతుల్లో 12 ఫోర్లు) గర్జన తోడవగా టీమ్ ఇండియా దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. విజయానికి 304 పరుగుల లక్ష్య ఛేదనలో సఫారీలు 179 పరుగులకే కుప్పకూలారు. మణికట్టు మాయగాళ్లు యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు మరోసారి సఫారీల భరతం పట్టారు. కావల్సిన రన్‌రేటు ఓ పక్క పెరిగిపోతుంటే, వికెట్లు పేకమేడలా కూలుతుంటే.. సఫారీలు సిరీస్‌లో వరుసగా మూడో ఓటమి చవి చూశారు. ఆరు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికాల మధ్య నాల్గో వన్డే శనివారం వాండరర్స్ మైదానంలో జరుగనున్నది.

విరాట్ వీరంగం : టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా భారత్‌ను బ్యాటింగ్ ఆహ్వానించి తొలి ఓవర్లోనే ఓపెనర్ రోహిత్ శర్మను బలిగొన్నది. ఇది భారత్‌కు ఊహించని పరిణామం. రోహిత్ నిలకడపై అనుమానులున్నా డకౌట్ అవటం నిరాశపరిచింది. అయితే ఓ పక్క సహచర ఓపెనర్ వెనుదిరిగినా టీమ్ ఇండియా గబ్బర్, శిఖర్ ధావన్ (76) మాత్రం దూకుడుగా ఆడాడు. రబాడా బౌలింగ్‌లో నాల్గో బంతికి రోహిత్ క్యాచౌట్ తప్పించుకున్నా తర్వాతి రెండో బంతికే క్లాసెన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. మూడో ఓవర్లో మూడో బంతికి కోహ్లిని అంపైర్ ఎల్బీగా ప్రకటించాడు. అయితే రివ్యూలో కోహ్లి నాటౌట్‌గా తేలింది. ఆపై కోహ్లిని ఆపటం ఎవరి తరమూ కాలేదు. కోహ్లి, ధావన్‌లు పోటీపడి ఆడటంతో భారత్ స్కోరు బోర్డు పరుగుల పెట్టింది. ధావన్ బౌండరీలతో విరుచుకుపడగా, కోహ్లి క్రీజులో పరుగులు తీస్తూ స్కోరును ముందు కురికించాడు. ఈ దశలో ధావన్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. సిరీస్‌లో ధావన్‌కు ఇది రెండో హాఫ్ సెంచరీ కాగా కెరీర్‌లో 25వది. వీరి 140 పరుగుల భారీ భాగస్వామ్యానికి డుమిని అడ్డుకట్ట వేశాడు. 24వ ఓవర్ తొలి బంతికి డుమిని బౌలింగ్‌లో మార్క్‌రం చేతికి చిక్కాడు గబ్బర్. సిరీస్‌లో సఫారీ స్పిన్నర్లకు దక్కిన తొలి వికెట్ ఇదే కావటం విశేషం. అయితే ధావన్ దూరమైనా కోహ్లి నిలకడ కొనసాగించాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్ సహకారంతో శతకం దిశగా పరుగులు పెట్టాడు. డుమిని బౌలింగ్‌లో 40 ఓవర్ తొలి బంతికి కోహ్లి కెరీర్‌లో 34వ వన్డే శతకం అందుకున్నాడు. అజింక్య రహానె (11) హార్దిక్ పాండ్య (14), ఎమ్ఎస్ ధోని (10), కేదార్ జాదవ్ (1)ల నుంచి కోహ్లి సహకారం కొరవ డింది. ఓ పక్క వికెట్లు కూలుతున్నా కోహ్లి తొణకలేదు. భువనేశ్వర్ కుమార్ (16 నాటౌట్) ఓ ఎండ్‌లో నిలువగా మరో పక్క కోహ్లి పరుగులు పిండుకున్నాడు. నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి 160 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత్ ఆరు వికెట్ల నష్టానికి 303 పరుగుల చేసింది.


శిఖర్ ధావన్ 76

చెలరేగిన స్పిన్నర్లు : ఛేదనలో దక్షిణాఫ్రికా ఆదిలోనే కీలక ఆమ్లా వికెట్ కోల్పోయింది. డివిలియర్స్, డుప్లెసిస్, క్వింటన్ డికాక్‌లు లేని వేళ హషీమ్ ఆమ్లా ఆ జట్టును ఆదుకుంటాడనుకుంటే పేసర్ బుమ్రా దెబ్బకు ఒక్క పరుగుకే ఆమ్లా మైదానం వీడాడు. ఆపై మణికట్టు స్పిన్నర్లు యుజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లు సఫారీ బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టారు. ప్రాక్టీసు స్పిన్నర్లతో చేసినప్పటికీ మైదానంలో మనోళ్లను దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ ఎదుర్కోలేకపోయారు. అర్ధ శతకం సాధించిన జేపీ డుమిని (51)ని చాహల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోగా, ఏడెన్ మార్క్‌రం (32)ను కుల్దీప్ బలిగొన్నాడు. డెవిడ్ మిల్లర్ (25) సహా మిగతా బ్యాట్స్‌మెన్ స్పిన్ మాయలో వికెట్లు పారేసుకున్నారు. 40 ఓవర్లకే ఆలౌట్ అయిన సఫారీలు 179 పరుగులు మాత్రమే చేయగలిగారు. చాహల్, కుల్దీప్ చెరో నాల్గు వికెట్లు కూల్చగా.. జశ్‌ప్రీత్ బుమ్రా రెండు వికెట్లు తీశాడు.

400
టీమ్ ఇండియా మాజీ సారథి, వికెట్ కీపర్ ఎమ్ఎస్ ధోని అరుదైన ఘనత సాధించాడు. వికెట్ల వెనుక 400 ఔట్లు చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. గిల్‌క్రిస్ట్, కుమార సంగక్కర, మార్క్ బౌచర్‌ల తరువాత ఈ ఘనత సాధించిన నాల్గో ఆటగాడు ధోని.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) క్లాసెన్ (బి) రబాడా 0, శిఖర్ ధావన్ (సి) మార్క్‌రం (బి) డుమిని 76, విరాట్ కోహ్లి నాటౌట్ 160, అజింక్య రహానె (సి) ఫెహ్లుక్వాయో (బి) డుమిని 11, హార్దిక్ పాండ్య (సి) క్లాసెన్ (బి) క్రిస్ మోరిస్ 14, ఎమ్ఎస్ ధోని (సి) లుంగి ఎంగిడి (బి) తాహిర్ 10, కేదార్ జాదవ్ (సి) క్లాసెన్ (బి)ఫెహ్లుక్వాయో 1, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 16, ఎక్స్‌ట్రాలు 15, **మొత్తం : (50 ఓవర్లలో 6 వికెట్లకు) 303.**

బౌలింగ్ : కగిసో రబాడా 10-1-54-1, లుంగిసాని ఎంగిడి 6-0-47-0, క్రిస్ మోరిస్ 9-0-45-1, అండిలె ఫెహ్లుక్వాయో 6-0-42-1, ఇమ్రాన్ తాహిర్ 9-0-52-1, జేపీ డుమిని 10-0-60-2.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : హషీమ్ ఆమ్లా ఎల్‌బిడబ్ల్యూ (బి) బుమ్రా 1, ఏడెన్ మార్క్‌రం (స్టం) ధోని (బి) కుల్దీప్ యాదవ్ 32, జేపీ డుమిని ఎల్‌బిడబ్ల్యూ చాహల్ 51, హెన్రిచ్ క్లాసెన్ ఎల్‌బిడబ్ల్యూ చాహల్ 6, డెవిడ్ మిల్లర్ (సి) ధోని (బి) బుమ్రా 25, ఖాయా జొండో (సి) మనీష్ పాండే (బి) చాహల్ 17, క్రిస్ మోరిస్ ఎల్‌బిడబ్ల్యూ కుల్దీప్ యాదవ్ 14, అండిలె ఫెహ్లుక్వాయో (సి) కోహ్లి (బి) కుల్దీప్ యాదవ్ 3, కగిసో రబాడా నాటౌట్ 12, ఇమ్రాన్ తాహిర్ (సి) కోహ్లి (బి) చాహల్ 8, లుంగిసాని ఎంగిడి ఎల్‌బిడబ్ల్యూ (బి) కుల్దీప్ యాదవ్ 6, ఎక్స్‌ట్రాలు , **మొత్తం : (40 ఓవర్లలో 10 వికెట్లకు) 179.**

బౌలింగ్ : భువనేశ్వర్ 7-0-41-0, బుమ్రా 7-0-32-2-0, హార్దిక్ పాండ్య 8-0-35-0, యుజ్వేంద్ర చాహల్ 9-0-46-4, కుల్దీప్ యాదవ్ 9-1-23-4.

బీసీసీఐకి సచిన్ లేఖ

- సీఏబీఐకు గుర్తింపు కోరిన మాస్టర్ బ్లాస్టర్



న్యూఢిల్లీ : టీమ్ ఇండియా మాజీ ఆటగాడు, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ బీసీసీఐకి లేఖ రాశాడు. అంధుల క్రికెట్ అసోసియేషన్ (సీఏబీఐ)ను భారత్ క్రికెట్ నియంత్రణ మండలి గుర్తించాలని, బోర్డు పెన్షన్ పథకం కింద అంధ క్రికెటర్లను తీసుకోవాలని కోరాడు. గత నెలాఖరున అంధుల ప్రపంచ కప్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. ఫైనల్లో దాయాది పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించి ట్రోఫీ గెల్చుకున్నారు. అయితే విజయానంతరం భారత్‌కు చేరిన ప్రపంచ కప్ విజేతలను ప్రభుత్వం గానీ, బోర్డు గానీ గుర్తించలేదు. కాగా ఇప్పటికే పలువురు సీనియర్ అధికారులు అంధుల ప్రపంచ కప్ విజేతలకు ప్రభుత్వం చేయూతనివ్వాల్సిందిగా కోరారు. ఇదే విషయమై సచిన్ టెండూల్కర్ సైతం స్పందించాడు. బీసీసీఐ పాలకుల కమిటీ చైర్మెన్ వినోద్ రాయ్‌కు లేఖ రాశాడు. 'భారత్ అంధుల క్రికెట్ ప్రపంచ కప్ నెగ్గితే సంబురాలు చేసుకున్నాం. అయితే కష్టపడి విజయం సాధించిన ఆటగాళ్లను పట్టించుకోలేదు. ఈ సందర్భంగా మీకు నా వినతి ఇదే, సీఏబీఐను బీసీసీఐ పరిధిలోకి తీసుకోండి. తద్వారా ఆటగాళ్లకు మేలు జరుగుతుంది. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలతో దేశానికి వన్నె తెస్తారు. ట్రోఫీ అందుకున్న క్రీడాకారులకు బీసీసీఐ పెన్షన్ పథకాన్ని వర్తింప జేయాలి' అని లేఖలో సచిన్ తెలిపాడు. సచిన్ లేఖకు బీసీసీఐ అధికారులు స్పందిస్తే ప్రపంచ కప్ విజేతలకు మేలు జరిగినట్టే.

ఎస్‌జీఎఫ్ఐ రగ్బీ జాతీయ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో 63వ రగ్బీ జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఈనెల 9వరకు సాగనున్నాయి. ఈ పోటీల్లో 14రాష్ట్రాల నుంచి అండర్ 17, అండర్ 19 విభాగాలకు చెందిన ఆరువందల మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలను సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రగ్బీ క్రీడ పట్ల ఎస్‌జీఎఫ్ఐ ప్రత్యేక శ్రద్ధ వహించి, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామీణ పాఠశాలల్లోనూ ఆడించాలని కోరారు. రాష్ట్రంలో నిర్వహించనున్న ఆసియా రగ్బీ ఛాంపియన్‌షిప్ పోటీలకు సాట్స్ పూర్తి సహకారం అందిస్తామని వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డీఈఓ సత్యనారాయణరెడ్డి, తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె రాంరెడ్డి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలు

- 'ఖేలో ఇండియా' పోటీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రతిభ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఢిల్లీలో జరుగుతున్న ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్-2018 పోటీల్లో తెలంగాణ వెయిట్ లిఫ్టర్లు రెండు బంగారు పతకాలు సాధించారు. జనవరి 31 నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో తెలంగాణ నుంచి 11 విభాగాల్లో క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 85 కిలోల కేటగిరిలో హెచ్ కార్తీక్, 69 కిలోల విభాగంలో ఆర్ శివలింగేశ్వరసాయి బంగారు పతకాలు సాధించారు. పోటీలను పర్యవేక్షించేందుకు వెళ్లిన సాట్స్ ఎండీ దినకర్‌బాబు క్రీడాకారులిద్దరినీ అభినందించారు. అన్ని విభాగాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని దినకర్‌బాబు కోరారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.